PRAJASAKTI Regd.No. 15795/68

ప్రజాశక్తి

ప్రతి అక్షరం ప్రజల పక్షం

Published from Vijayawada, Visakhapatnam, Kurnool, Tirupathi, Rajahmundry, Srikakulam, Ongole and Ananthapuramu

సంపుటి : 44 సంచిక : 76 | విజయవాడ, గురువారం 17 అక్టోబర్ 2024 | 6 + 8 పేజీలు వెల : 5.50

Vol No | Vijayawada, Thursday 17 October 2024 | Rs

సిటీ◆

తొలి రోజు ఆట వర్షార్పణం

- భారత్-న్యూజిలాండ్ తొలి టెస్టు

6

ఖాళీల భర్తీకి తీసుకున్న చర్యలేమిటి? : హైకోర్టు

ప్రజాశక్తి-అమరావతి

పోలీసు శాఖలో ఖాళీగా ఉన్న 19,999 పోస్టుల భర్తీకి ఉత్తర్వులు ఇవ్వాలంటూ దాఖలైన వ్యాజ్యాన్ని బుధవారం హైకోర్టు విచారణ జరిపింది. భర్తీ చేసేందుకు ప్రభుత్వం తీసుకునే చర్యలను తెలియజేయాలని ఆదేశించింది. పోలీసు శాఖలో ఖాళీలను భర్తీ చేయాలని గతంలో సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును అమలు చేయాలంది. ఈ మేరకు చీఫ్ జస్టిస్ ధీరజ్ సింగ్ ఠాకూర్ ఆధ్వర్యంలోని డివిజన్ బెంచ్ ఉత్తర్వులు జారీ చేసింది. హెల్ప్ ది పీపుల్ చారిటబుల్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ కీతినీడి అఖిల్ శ్రీగురు తేజ వేసిన పిల్‌పై విచారణను 3 వారాలకు వాయిదా వేసింది. కాగా ఎపి పబ్లిక్ సర్వీస్ కమిషన్ (ఎపిపిఎస్‌సి) ఛైర్మన్, ఇతర సభ్యుల నియామకాల కోసం ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఆధ్వర్యంలో పది మందితో కూడిన కమిటీని ఏర్పాటు చేసినట్లు రాష్ట్ర ప్రభుత్వం హైకోర్టుకు తెలియజేసింది. ఆ వివరాలను నివేదించాలన్న హైకోర్టు పిల్‌పై విచారణను మూడు వారాలకు వాయిదా వేస్తూ చీఫ్ జస్టిస్ ధీరజ్ సింగ్ ఠాకూర్ ఆధ్వర్యంలోని డివిజన్ బెంచ్ ఉత్తర్వులు జారీ చేసింది.

ప్రగతే లక్ష్యంగా కొత్త పాలసీలు

క్యాబినెట్ సమావేశానంతరం చంద్రబాబు

20 లక్షల ఉద్యోగాలు, రూ.30 లక్షల పెట్టుబడులు వస్తాయని ప్రకటన

ఉపాధి కల్పన, ధరల నియంత్రణ, గంజాయి నియంత్రణలకు మంత్రివర్గ ఉపసంఘాలు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

రాష్ట్ర ప్రగతే లక్ష్యంగా ఆరు కొత్త పాలసీలను మంత్రిమండలి ఆమోదించినట్లు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు చెప్పారు. రాష్ట్ర సచివాలయంలో ముఖ్యమంత్రి అధ్యక్షతన బుధవారం క్యాబినెట్ సమావేశం జరిగింది. ఈ సమావేశం అనంతరం విలేకరులతో మాట్లాడిన చంద్రబాబు మంత్రవర్గ సమావేశ నిర్ణయాలను వివరించారు. ఎన్నడూ లేని విధంగా ఒకే రోజు ఆరు కీలక రంగాలకు చెందిన నూతన పాలసీలను మంత్రిమండలి చర్చించి, ఆమోదించిందని ఆయన తెలిపారు. 'ఒకేసారి ఆరు కొత్త పాలసీలు తెచ్చాం. వన్ ఫ్యామిలీ -వన్ ఎంటర్ ప్రెన్యూర్ నినాదంతో ముందుకు వెళ్తున్నాం. ఉద్యోగాలు చేయడం కాదు. ఉద్యోగాలు ఇచ్చే స్థాయికి మన యువత ఎదగాలి. నూతన విధానాలు రాష్ట్ర ప్రగతిని మారుస్తాయి. యువత భవిష్యత్తులో పెనుమార్పులు తీసుకు వస్తాయి.' అని ఆయన చెప్పారు. రానున్న ఐదేళ్ల కాలంలో 20 లక్షల ఉద్యోగాల కల్పనే లక్ష్యంగా ఈ పాలసీలను రూపొందిచినట్లు ఆయన తెలిపారు. అదే సమయంలో 30 లక్షల కోట్ల రూపాయల పెట్టుబడులను ఆకర్షించడం కూడా తమ లక్ష్యమని ఆయన అన్నారు.

ఐదు జోన్లలో ఇన్నోవేషన్ హబ్‌లు

అమరావతి కేంద్రంగా రతన్‌టాటా ఇన్నోవేషన్ హబ్ ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. దీనికి అనుబంధంగా విశాఖ, రాజమహేంద్రవరం, విజయవాడ లేదాగుంటూరు, తిరుపతి, అనంతపురంలో జోనల్ ఇన్నోవేషన్ హబ్‌లు ఏర్పాటు చేస్తామని పేర్కొన్నారు. ఆదాయం పంచాలన్నదే తమ నినాదమని చెప్పారు. ఫుడ్ ప్రాసెసింగ్ రంగాలకు ఎక్కువ ప్రాధాన్యత ఇచ్చామని, రాయలసీమను ఇక అభివృద్ధి కేంద్రంగా మారుస్తామని, రాళ్లసీమ అనే పేరు మారుస్తామని అన్నారు. స్వర్ణాంధ్ర 2047 విజన్‌లో భాగంగా రాష్ట్రానికి గ్లోబల్ బ్రాండ్ ఇమేజ్ తీసుకొస్తామని చెప్పారు. ఉత్తరాంధ్ర ప్రాంతంలో పోర్టులు టూరిజం అభివృద్ధికి చర్యలు తీసుకుంటామని తెలిపారు. భావనపాడు పోర్టు పరిధిలో 10 వేల ఎకరాల్లో ఇండస్ట్రియల్ పార్కు ఏర్పాటు చేస్తామని అన్నారు. ఉపాధి కల్పనతోపాటు రాష్ట్రం అభివృద్ధి చెందాలని అన్నారు.

మంత్రివర్గ సమావేశంలో మాట్లాడుతున్న సిఎం చంద్రబాబు

ఇవి కొత్త పాలసీలు

- ఎపి ఇండస్ట్రియల్ డెవలప్‌మెంట్ పాలసీ 4.0
- ఎపి ఎంఎస్ఎంఇ ఎంటర్ ప్రెన్యూర్ డెవలప్‌మెంట్ పాలసీ
- ఎపి ఎలక్ట్రానిక్ పాలసీ 4.0
- ఎపి ఇండస్ట్రియల్ పార్క్ పాలసీ 4.0
- ఎపి ఫుడ్ ప్రాసెసింగ్ పాలసీ 4.0
- ఎపి ఇంటిగ్రేటెడ్ క్లీన్ ఎనర్జీ, గ్రీన్ ఎనర్జీ పాలసీ 4.0

గంజాయి తాగితే అదే చివరిరోజు

"రాష్ట్రంలో ఇక నుండి ఎవరైనా గంజాయి, మాదకద్రవ్యాలు వినియోగిస్తే అదే వారికి చివరిరోజు అవుతుంది, అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడేవారు, గంజాయి, బ్లేడ్ బ్యాచ్ సభ్యులకు జీవితాంతం గుర్తుండేలా సంఘ బహిష్కరణ శిక్ష విధిస్తాం, ఇటీవల వరుసగా జరుగుతున్న ఘటనల నేపథ్యంలో ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది" అని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు హెచ్చరించారు. ఈ విషయాన్ని గంజాయి తాగేవారి తల్లిదండ్రులు కూడా గుర్తుపెట్టుకోవాలని హెచ్చరించారు. గంజాయి, మాదకద్రవ్యాలు వినియోగించి అరాచకశక్తులుగా మారి కొంతమంది తల్లి, చెల్లి, కన్నబిడ్డకు కూడా తేడా తెలియకుండా వ్యవహరిస్తున్నారని అన్నారు. దీనిని ఇకపై ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. వీటి నివారణ కోసంహోమ్‌శాఖ మంత్రి వంగలపూడి అని అధ్యక్షతన మంత్రులు లోకేష్, కొల్లు రవీంద్ర, సత్యకుమార్, గుమ్మడి సంధ్యారాణితో మంత్రివర్గ ఉపసంఘాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. అదే విధంగా యాంటీ నార్కోటిక్ టాస్కుఫోర్స్‌ను కూడా ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. దీనికి సీనియర్ ఐపిఎస్ అధికారి ఆకె రవికృష్ణ నాయకత్వం వహిస్తారని, ప్రత్యేక స్టేషన్ ఏర్పాటు చేస్తున్నామని, సుమారు 570 మంది సిబ్బందిని కేటాయిస్తున్నట్లు సిఎం తెలిపారు. 26 జిల్లాల్లోనూ నార్కోటిక్స్ పోలీసు బృందాలను ఏర్పాటు చేయనున్నారు. ఈ కేసుల విచారణకు ఎపి హైకోర్టు ఆధ్వర్యంలో జిల్లాల్లో ఐదు ప్రత్యేక కోర్టులు, లేదా ఐదు ఫాస్ట్‌ట్రాక్ కోర్టులు ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని మంత్రిమండలి నిర్ణయించింది.

ఉద్యోగాల కల్పన... ధరల నియంత్రణ

రాష్ట్రంలో 20 లక్షల ఉద్యోగాలు కల్పించేందుకు వీలుగా లోకేష్ ఛైర్మన్‌గా మంత్రివర్గ ఉపసంఘాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు చంద్రబాబు తెలిపారు. దీనిలో మంత్రులు టి.జి.భరత్, గొట్టిపాటి రవికుమార్, కందుల దుర్గేష్, కొండపల్లి శ్రీనివాస్, పి.నారాయణ, బి.సి.జనార్ధన్‌రెడ్డి సభ్యులుగా ఉన్నారు. అదే విధంగా ధరల నియంత్రణ కోసం పౌరసరఫరాలశాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ అధ్యక్షతన మరో మంత్రివర్గ ఉప సంఘాన్ని నియమించారు. దీనిలో మిగతా 5లో

విజయోత్సవ సభలో మాట్లాడుతున్న ఉద్యమ నాయకులు

శామ్‌సంగ్ కార్మికుల విజయం

- దిగొచ్చిన ప్రభుత్వం.. డిమాండ్లకు అంగీకారం
- సమ్మె విరమణ
- కార్మికులకు సిఐటియు అభినందనలు

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

చెన్నైలో శామ్‌సంగ్ కార్మికుల పోరాటం.. చారిత్రాత్మక విజయాన్ని సాధించింది. కార్మికుల డిమాండ్లను ప్రభుత్వం అంగీకరించింది. చారిత్రాత్మక విజయం సాధించినందుకు శామ్‌సంగ్ కార్మికులకు సిఐటియు అభినందనలు తెలిపింది. కార్మికవర్గ పోరాటాల సమకాలీన చరిత్రలో శామ్‌సంగ్ ఇండియా కార్మికులు పోరాటం దుష్ట పాలనకు వ్యతిరేకంగా జరిగిన గొప్ప ప్రత్యక్ష కార్మికవర్గ చర్య అని సిఐటియు పేర్కొంది. వేతనాలు పెంచాలని, యూనియన్‌ను గుర్తించాలని డిమాండ్ చేస్తూ కార్మికులు సెప్టెంబరు 11న సమ్మె ప్రారంభించారు. ఈ సమ్మెకు సిఐటియు మద్దతుగా నిలిచింది. అలాగే సిపిఎంతో సహా ఇతర వామపక్షాలు సమ్మెకు మద్దతుగా రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళనలు చేపట్టాయి. తమిళనాడులోని కాంచీపురం జిల్లా శ్రీపెరంబుదూర్ ప్లాంట్‌లో శామ్‌సంగ్ కార్మికులు 37 రోజులపాటు సాగిన వీరోచిత పోరాటం ప్రభుత్వంతో చర్చల తరువాత విజయవంతమైంది. బుధవారం జరిగిన యూనియన్ జనరల్ బాడీ సమావేశంలో సమ్మెను విరమించాలని నిర్ణయించారు. కార్మికులందరూ గురువారం (అక్టోబరు 17) విధుల్లో చేరాలని పేర్కొన్నారు. శామ్‌సంగ్ ఇండియా వర్కర్స్ యూనియన్‌గా ఏర్పడిన ఈ మొత్తం ఐదు నెలల కాలంలో వేతనం కోల్పోవడమే కాకుండా యాజమాన్య బెదిరింపులు, పోలీసుల అరెస్టులు, చిత్రహింసలను వీరోచితంగా, ధైర్యంగా ఎదుర్కొన్న ఉద్యోగులందరికీ సిఐటియు విప్లవాత్మక శుభాకాంక్షలు తెలిపింది. చెన్నైలోని శ్రీపెరంబుదూర్‌కు చెందిన శామ్‌సంగ్ వర్కర్స్ చెరగని అధ్యాయాన్ని సృష్టించారని, దేశ శ్రామికవర్గ ఉద్యమం అద్భుతమైన చరిత్రకు నాంది పలికారని తెలిపింది. అలాగే సిఐటియు నేతృత్వంలోని శామ్‌సంగ్ ఇండియా వర్కర్స్ యూనియన్ (ఎస్ఐడబ్ల్యుయు) కార్మికులు సాధించిన విజయానికి అఖిల భారత కిసాన్ సభ (ఎఐకెఎస్) విప్లవాభినందనాలు తెలిపింది. ఈ వీరోచిత పోరాటానికి నాయకత్వం వహించిన సిఐటియుకు ఎఐకెఎస్ అభివందనాలు తెలిపింది. ఈ మేరకు ఎఐకెఎస్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు అశోక్ ధావలే, విజూ కృష్ణన్ ప్రకటన విడుదల చేశారు.

శామ్‌సంగ్ ఇండియా వర్కర్స్ యూనియన్ నేత ముత్తుకుమార్ మాట్లాడుతూ.. 'పెరిగిన వేతనాలు, వైద్య బీమా, మెరుగైన సౌకర్యాలు వంటి అన్ని కీలక డిమాండ్లపై కార్మికులతో చర్చలు జరపాలని శామ్‌సంగ్ యాజమాన్యం నిర్ణయించినందున మేము నిరసనను విరమించాలని నిర్ణయించుకున్నాం. కాబట్టి ఆ చర్చలు కొనసాగుతాయి' మిగతా 2లో

జమ్ము కాశ్మీర్ ముఖ్యమంత్రిగా ప్రమాణం చేస్తున్న ఒమర్ అబ్దుల్లా

ఒమర్ అనే నేను..

జమ్మూకాశ్మీర్ సిఎంగా ప్రమాణం

డిప్యూటీ సీఎంగా సురీందర్ కుమార్ చౌదరి

హాజరైన రాహుల్, ప్రియాంక, అఖిలేశ్, ప్రకాశ్ కరత్, రాజా, కనిమొళి తదితర నేతలు

శ్రీనగర్ : జమ్మూకాశ్మీర్ ముఖ్యమంత్రిగా నేషనల్ కాన్ఫరెన్స్ నేత ఒమర్ అబ్దుల్లా బుధవారం పదవీ స్వీకార ప్రమాణం చేశారు. ఆయనతో పాటు మరో ఐదుగురు మంత్రులు కూడా ప్రమాణస్వీకారం చేశారు. లెఫ్టినెంట్ గవర్నర్ మనోజ్ సిన్హా వారితో ప్రమాణస్వీకారం చేయించారు. మొత్తం ఆరుగురు మంత్రులలో ఒమర్ సహా ముగ్గురు కాశ్మీర్ ప్రాంతానికి చెందినవారు కాగా, మిగిలిన వారు జమ్మూ నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్నవారు. శ్రీనగర్‌లోని షెరీ కాశ్మీర్ ఇంటర్నేషనల్ కాన్ఫరెన్స్ సెంటర్‌లో జరిగిన ప్రమాణస్వీకార కార్యక్రమానికి కాంగ్రెస్ నేతలు రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ, సిపిఎం నేత ప్రకాశ్ కరత్, సిపిఐ నేత డి రాజా, సమాజ్‌వాదీ పార్టీ నాయకుడు అఖిలేశ్ యాదవ్, డిఎంకే నుంచి కనిమొళి తదితరులు హాజరయ్యారు. ప్రమాణస్వీకారం చేసిన మంత్రులంతా నేషనల్ కాన్ఫరెన్స్‌కు చెందిన వారే. కాంగ్రెస్‌కు ఒక మంత్రి పదవి ఇవ్వజూపగా ఆ పార్టీ తిరస్కరించిందని వార్తలు వచ్చాయి. క్యాబినెట్‌లో మరో మూడు ఖాళీలు ఉన్నాయని, వాటిని రాబోయే వారాలలో భర్తీ చేస్తామని తెలిపారు. ఉప ముఖ్యమంత్రిగా ప్రమాణస్వీకారం చేసిన సురిందర్ కుమార్ చౌదరి ఇటీవలి శాసనసభ ఎన్నికలలో బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు రవీందర్ రైనాను నౌషేరా నియోజకవర్గంలో ఓడించారు. జమ్ము కాశ్మీర్‌లో జరిగిన ఎన్నికలు ప్రాంతీయ విభజనను ఎత్తి చూపగా, ఆ విభజనను తగ్గించడానికి నేషనల్ కాన్ఫరెన్స్ ఒక అడుగు ముందుకేసింది. జమ్మూ ప్రాంతానికి చెందిన సురీందర్ చౌదరిని ఉపముఖ్యమంత్రి చేయడం, మంత్రివర్గంలో సముచిత ప్రాతినిధ్యం కల్పించడం ద్వారా ఒమర్ అబ్దుల్లా తన ప్రభుత్వం కాశ్మీర్ కేంద్రంగా ఉండదని బలమైన సందేశాన్ని పంపారు. కేంద్ర పాలిత ప్రాంతం అయిన జమ్మూ కాశ్మీర్ అసెంబ్లీలో మొత్తం 90 స్థానాలు ఉన్నందున నిబంధనల ప్రకారం పది శాతం మందికి మించి మంత్రులను నియమించరాదు.

డిప్యూటీ సిఎం చౌదరి మాట్లాడుతూ, 'నా భుజస్కంధాలపై పెద్ద బాధ్యతను ఉంచారు. నా కర్తవ్యాన్ని నిర్వహించడానికి శక్తి మేరకు కృషి చేస్తాను. గత పది సంవత్సరాల శూన్యతను పూరించడం చాలా కష్టమే. అయినా ప్రయత్నిస్తాను. సిఎం ఒమర్ అబ్దుల్లా నాయకత్వంపై నాకు పూర్తి నమ్మకం ఉంది' అని చెప్పారు.

అదుపులోకి రాని అతిసార

- ఇంకా వైద్య శిబిరం, ఆస్పత్రుల్లో 60 మంది
- కోలుకుంటున్న బాధితులు

2

దక్షిణకోస్తాలో కుండపోత

- చెన్నైలో నీట మునిగిన పలు కాలనీలు
- లోతట్టు ప్రాంతాలు జలమయం
- పొంగుతున్న వాగులు, వంకలు
- రాకపోకలకు అంతరాయం

ప్రజాశక్తి- యంత్రాంగం

బంగాళాఖాతంలో ఏర్పడిన వాయుగుండం ప్రభావంతో దక్షిణకోస్తాతో పాటు రాయలసీమలోని పలు జిల్లాల్లో బుధవారం కుండపోత వర్షం కురిసింది. తమిళనాడు మీద కూడా వాయుగుండం ప్రభావం తీవ్రంగా కనిపించింది. చెన్నైలోని పలు కాలనీలు నీటమునిగాయి. మహానగరం జలమయంగా మారింది. మరోవైపు రాష్ట్రంలో తిరుపతి, చిత్తూరు; నెల్లూరు జిల్లాల్లో భారీ వర్షం కురిసింది. వాగులు, వంకలు పొంగిపొర్లాయి. పలు గ్రామాలకు రాకపోకలు నిల్చిపోయాయి. వాయుగుండం ప్రభావంతో ఆంధ్రప్రదేశ్, తమిళనాడు రాష్ట్రాల్లో పలు రైళ్లను రద్దు చేసినట్లు దక్షిణ రైల్వే ఓ ప్రకటనలో తెలిపింది. తిరుపతి-చెన్నై సెంట్రల్ (16203) తిరుపతి ఎక్స్‌ప్రెస్, తిరుపతి-చామరాజనగర్ (16220) కాట్పాడి మీదుగా కర్ణాటక రాష్ట్రానికి వెళ్లే రైళ్లను తాత్కాలికంగా మిగతా 5లో

ప్రకాశం జిల్లా కొత్తపట్నంలో ముందుకొచ్చిన సముద్రం

ఉద్యోగులకు డిఎ, పెన్షనర్లకు డిఆర్

- కేంద్ర మంత్రివర్గం ఆమోదం

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులకు డిఎ, పెన్షనర్లకు డిఆర్‌కు కేంద్ర మంత్రివర్గం ఆమోదం తెలిపింది. ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ అధ్యక్షతన కేంద్ర మంత్రివర్గ సమావేశం బుధవారం జరిగింది. అనంతరం నేషనల్ మీడియా సెంటర్ (ఎన్ఎంసి)లో ఏర్పాటుచేసిన విలేకరుల సమా వేశంలో కేంద్ర మంత్రి అశ్వినీ వైష్ణవ్ మంత్రివర్గ నిర్ణయాలను వెల్లడించారు. కేంద్ర ప్రభుత్వ ఉద్యోగు లకు కరువు భత్యం (డిఎ), పింఛనుదారులకు డియర్ నెస్ రిలీఫ్ (డిఆర్)ల అదనపు వాయిదా (ఇన్‌స్టాల్ మెంట్)ను జులై ఒకటి నుంచి చెల్లించడానికి కేంద్ర మంత్రివర్గం ఆమోదాన్ని తెలిపిందన్నారు. ఇది మూల వేతనం, పింఛన్‌లో ఇప్పుడు వస్తున్న 50 శాతం రేటు కంటే, మూడు శాతం అధికంగా ఉంటుందన్నారు. ధరల పెరుగుదలను దృష్టిలో పెట్టుకుని, ఆ భారాన్ని తొలగించడానికి ఈ చర్యను తీసుకొన్నామన్నారు. ఈ పెంపు ఏడో కేంద్ర వేతన సంఘం సిఫార్సుల ఆధారంగా ఆమోదించిన ఫార్ములాకు అనుగుణంగా ఉందని, తాజా నిర్ణయం ఫలితంగా ఏడాదికి రూ.9,448.35 కోట్లు వెచ్చించాల్సి ఉందన్నారు. దాదాపు 49.18 లక్షల మంది కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులకు, 64.89 లక్షల మంది పెన్షనర్‌లకు లబ్ధి కలుగుతుందన్నారు.

సజ్జలకు నోటీసులు

- నేడు విచారణకు రావాలని ఆదేశం

ప్రజాశక్తి- గుంటూరు జిల్లా ప్రతినిధి

గుంటూరు జిల్లా మంగళగిరిలోని టిడిపి రాష్ట్ర కార్యాలయంపై దాడి కేసులో వైసిపి కీలక నేత సజ్జల రామకృష్ణారెడ్డికి బుధవారం మంగళగిరి పోలీసులు నోటీసులు జారీ చేశారు. గురువారం విచారణకు హాజరు కావాలని ఈ నోటీసుల్లో పేర్కొన్నారు. వేర్వేరు కేసుల్లో ఉన్న సజ్జలకు దేశం విడిచి పారిపోకుండా లుక్ అవుట్ నోటీసులు పోలీసులు ఇప్పటికే జారీ చేశారు. మంగళగిరి టిడిపి కార్యాలయంపై దాడి కేసులో విచారణకు హాజరు కావాలంటూ తాజాగా ఆయనకు నోటీసులు ఇచ్చారు. ఈ కేసులో ఇప్పటికే పలువురు నేతలను పోలీసులు విచారించారు. దాదాపు 28 మందిని అరెస్ట్ చేశారు. మొత్తం 68 మందిని దాడికి పాల్పడినట్లు గుర్తించారు. వారిలో పలువురు నాయకులు హైకోర్టు, సుప్రీంకోర్టులను ఆశ్రయించి అరెస్టు నుంచి మినహాయింపు పొందారు.

కక్షసాధింపు, వేధింపుల పర్వం : సజ్జల

2

భద్రత, వాణిజ్యం, ఆరోగ్య రంగాల్లో

బంధం మరింత బలోపేతం

- షాంఘై సహకార కూటమి సదస్సు పిలుపు

ఇస్లామాబాద్: షాంఘై సహకార కూటమి (ఎస్‌సిఒ) అగ్ర నాయకులు బుధవారం నాడిక్కడ సమావేశమయ్యారు. భద్రత, వాణిజ్యం, ఆరోగ్యంతో సహా అన్ని రంగాల్లో సహకారాన్ని మెరుగుపరచుకోవాలని పిలుపునిచ్చారు. ప్రజలకు ప్రజలకు మధ్య సంబంధాలు పెంపొందించుకోవాలని, వాతావరణ మార్పుల ప్రభావాలను తగ్గించాలన్న దృఢ నిశ్చయాన్ని వారు పునరుద్ఘాటించారు. .రాజకీయాలు, భద్రత, వాణిజ్యం, ఆర్థికం, పెట్టుబడులు, సాంస్కృతిక, మానవతా సంబంధాలు వంటి రంగాల్లో బంధాన్ని మరింత బలోపేతం చేసుకోవాలని సభ్య దేశాల ప్రతినిధి బృందాల అధిపతులు పునరుద్ఘాటించారు. మనిషి, ప్రకృతి మధ్య సామరస్యపూర్వక సహజీవనాన్ని సాధించాలని, శాంతియుత, సురక్షితమైన సుసంపన్నమైన, పర్యావరణ పరంగా పరిశుభ్రమైన భూగోళం కోసం పాటుపడాలని ఎస్‌సిఒ పిలుపునిచ్చింది. శాంతియుత ఆఫ్ఘనిస్తాన్ కోసం పాక్ ప్రధాని షెహబాజ్ షరీఫ్ పిలుపునిచ్చారు. ఏ దేశంపైన హింసకు దాని భూ భాగాన్ని ఉపయోగించరాదని అన్నారు. పాకిస్తాన్‌లో హింస చెలరేగుతున్న నేపథ్యంలో షరీఫ్ వ్యాఖ్యలు ప్రాధాన్యతన సంతరించుకున్నాయి.

కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్ల మధ్య జరిగిన ఈ సమావేశానికి చైనా ప్రధాని లీ కియాంగ్, రష్యా ప్రధాని మిఖాయిల్ మిషుస్టీన్, భారత విదేశాంగ మంత్రి సుబ్రహ్మణ్యం జైశంకర్, కిర్గిజిస్తాన్ , బెలారస్, కజకిస్తాన్, తజికిస్తాన్, మంగోలియా ప్రధానులు హాజరయ్యారు. పటిష్టవంతమైన భద్రత కోసం పాకిస్తాన్ అదనపు పోలీసులను, దళాలను రాజధాని అంతటా మోహరించారు. సమావేశ స్థలి చుట్టూ పలు అంచెల భద్రతా వలయాలను మిగతా 2లో

నిజాయితీతో కూడిన భాగస్వామ్యం అవశ్యం

- విదేశాంగ మంత్రి జై శంకర్



పాక్ ప్రధాని షెహబాజ్‌తో జైశంకర్

ఇస్లామాబాద్ : నిజాయితీతో కూడిన భాగస్వామ్యం ద్వా రానే సహకారాన్ని నిర్మించుకోవాలని, ఏకపక్ష ఎజెండాలకు తావివ్వరాదని భారత విదేశాంగ మంత్రి జై శంకర్ అన్నారు.. బుధవారం నాడిక్కడ జరిగిన షాంఘై సహకార కూటమి (ఎస్‌సిఒ) శిఖరాగ్ర సదస్సులో ఆయన ప్రసంగిస్తూ , చైనా చేపట్టిన బెల్ట్ అండ్ రోడ్ ఇనీషియేటివ్ (బిఆర్ఐ)ను ఉద్దేశించి నర్మగర్భంగా వ్యాఖ్యానించారు. సీమాంతర తీవ్రవాదం, ఉగ్రవాదం, వేర్పాటువాదాలను మూడు రుగ్మతలు గా ఆయన పేర్కొ న్నారు. ఇవి వాణిజ్యం, పర్యాటకం, ప్రజల మధ్య సంబంధాలను మిగతా 2లో

అదుపులోకి రాని అతిసార

- ఇంకా వైద్య శిబిరం, ఆస్పత్రుల్లో 60 మంది
- కోలుకుంటున్న బాధితులు

ప్రజాశక్తి-గుర్ల (విజయనగరం జిల్లా)

విజయనగరం జిల్లా గుర్ల మండలంలో నాలుగు రోజుల క్రితం ప్రబలిన అతిసార గుర్ల, ఘోషాడ గ్రామాల్లో ఇంకా అదుపులోకి రాలేదు. గుర్ల గ్రామానికి చెందిన వారు సోమవారం ఒకరు, మంగళవారం నలుగురు మృతి చెందడంతో అధికార యంత్రాంగం మరింత అప్రమత్తమైంది. తాజాగా గుర్లకు చెందిన మరో ఇద్దరు అతిసారకు గురై వైద్యం కోసం శిబిరంలో చేరారు. ప్రస్తుతం గుర్లలోని జడ్పి హైస్కూలులో ఏర్పాటు చేసిన వైద్య శిబిరంలో 52 మంది, జిల్లా కేంద్రాస్పత్రిలో నలుగురు, చీపురుపల్లి సిహెచ్‌సిలో నలుగురు మొత్తంగా 60 మంది చికిత్స పొందుతున్నారు. వీరంతా గుర్ల, ఘోషాడ గ్రామాలకు చెందిన వారే ఉన్నారు.

చంపావతి నుంచి ఎస్ఎస్ఆర్‌పేట వద్ద పంపుహౌస్‌ల ద్వారా పలు గ్రామాలకు సరఫరా అవుతున్న తాగునీరు కలుషితం కావడం వల్లే డయేరియా ప్రబలినట్లు తెలుస్తోంది. ఈ నేపథ్యంలోనే అధికారులు ఎస్ఎస్ఆర్ పేట పంపుహౌస్ నుంచి నీటి సరఫరాను నిలిపివేశారు. మరోవైపు అధికారులు మాత్రం గుర్లలోని ఐదుబోర్లలో నీరు కలుషితం కావడం వల్ల ప్రబలిందని చెబుతున్నారు. అలా అయితే ఆ అయిదిళ్లకు చెందిన వారే వ్యాధి బారినపడాలని, కానీ గ్రామమంతా అతిసార బారిన ఎలా పడతారని గ్రామస్తులు ప్రశ్నిస్తున్నారు. ఆర్‌డబ్ల్యుఎస్ అధికారులు గుర్ల లోని బోర్లు నీటి శ్యాంపిల్స్‌ను తీసుకెళ్లారు. అప్రమత్తమైన

గుర్లలోని వైద్య శిబిరంలో చికిత్స పొందుతున్న బాధితులను పరామర్శిస్తున్న కలెక్టర్, డిఎంహెచ్ఒ

వైద్యాధికారులు మండల కేంద్రంలోని జడ్పి హైస్కూలులో వైద్య శిబిరం ఏర్పాటు చేసి రోగులకు వైద్య సేవలందిస్తున్నారు. సీరియస్ కేసులను విజయనగరం, పురుపల్లి ప్రభుత్వాస్పత్రులకు రిఫర్ చేసినట్లు వైద్యాధికారి చెన్నయ్ తెలిపారు.

అతిసార అదుపులోనే ఉంది : కలెక్టర్

గుర్లలో అతిసార అదుపులో ఉందని, ఎవరూ ఆందోళన చెందవలసిన అవసరం లేదని జిల్లా కలెక్టర్ డాక్టర్ బిఆర్ అంబేద్కర్ తెలిపారు. ఇప్పటి వరకు ఎవరూ అతిసారతో మతి చెందలేదని, చనిపోయిన వారు గుండెపోటు, మూత్రపిండాల వ్యాధులతో బాధపడుతున్న వారని చెప్పారు. కలెక్టర్ బిఆర్ అంబేద్కర్, జడ్పి చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, చీపురుపల్లి ఆర్‌డిఒ సత్యవాణి గ్రామంలో ఏర్పాటు చేసిన వైద్యశిబిరంలో చికిత్స పొందుతున్న బాధితులను పరామర్శించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మొదటి రోజున విరేచనాలు తగ్గిన వారు ఇళ్లకు వెళ్లడం, వారు వినియోగించిన టాయిలెట్లను వారి కుటుంబ సభ్యులు వినియోగించడం వల్ల మిగిలిన వారికి సోకినట్లు గుర్తించామని తెలిపారు. కలుషిత నీరు తాగడం వల్ల కూడా డయేరియా సోకి ఉంటుందని చెప్పారు. వాస్తవ పరిస్థితులపై వెంటనే నివేదిక నివ్వాలని అధికారులను ఆదేశించారు. ఆర్‌డబ్ల్యు ఎస్ఇ ఉమా శంకర్ మాట్లాడుతూ గుర్ల గ్రామంలో ఐదు బోరు బావుల నీటి శాంపిల్స్ ను పరీక్షించామని, నీరు కలుషితంగా ఉందని తెలిపారు. జడ్పి చైర్మన్ శ్రీనివాసరావు మాట్లాడుతూ గ్రామంలో నలుగురు మతి చెందినా తాగునీటి సరఫరా లోపాలను సరిదిద్దేవారే లేరని అన్నారు. ప్రభుత్వ నిర్లక్ష్యం స్పష్టంగా కనిపిస్తోందన్నారు. బాధితులను సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు టివి రమణ పరామర్శించి మాట్లాడారు. డయేరియాతో ఎవరూ చనిపోలేదని కలెక్టర్ ప్రకటించడం సరైనదికాదని, నివారణకు యుద్ధ ప్రాతిపదికను చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రాస్పత్రిలో చికిత్స పొందుతున్న రోగులను ఎస్‌టి కమిషన్ చైర్మన్ డాక్టర్ డివిజి శంకర రావు పరామర్శించారు.

డయేరియా మరణాలపై సిఎం విచారం

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

విజయనగరం జిల్లా గుర్ల గ్రామంలో డయేరియాతో రెండు రోజుల్లో ఐదుగురు మృతిచెందిన ఘటనపై ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు విచారం వ్యక్తం చేశారు. ఈ ఘటనపై తన కార్యాలయ అధికారులతో మాట్లాడి బుధవారం వివరాలు తెలుసుకున్నారు. మంగళవారం ఒక్కరోజే నలుగురు మృతి చెందడంతో ప్రస్తుత పరిస్థితిపై ఆరా తీశారు. ఆ ప్రాంతంలో బాధితుల పరిస్థితి, వారికి అందుతున్న చికిత్స, గ్రామంలో చేపట్టిన పారిశుధ్య కార్యక్రమాలను అధికారుల ద్వారా తెలుసుకున్నారు.

భారీ వర్షాలపై సమీక్ష

రాష్ట్రంలో భారీ వర్షాలు పడుతున్న నేపథ్యంలో అధికారులు అప్రమత్తంగా ఉండాలని ముఖ్యమంత్రి సూచించారు. మంగళవారం నుంచి నెల్లూరు సహా పలు జిల్లాల్లో పడుతున్న భారీ వర్షాలపై అధికారులతో సమీక్ష నిర్వహించారు. కొన్ని ప్రాంతాల్లో 20 సెంటిమీటర్లకు పైగా వర్షం పడడం, ఆకస్మిక వరదలు వచ్చే అవకాశం ఉందన్న సమాచారం నేపథ్యంలో యంత్రాంగం అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. వర్ష ప్రభావిత జిల్లాల్లోని పరిస్థితులను ఎప్పటికప్పుడు తనకు నివేదించాలని తన కార్యాలయ అధికారులకు సూచించారు.

ఆలయ ధ్వంసంపై చర్యలకు ఆదేశం

అన్నమయ్య జిల్లా కదిరినాథుని కోటలోని అటవీ ప్రాంతంలో ఆలయంపై జరిగిన దాడిని సిఎం చంద్రబాబు ఖండించారు. దుండగుల దాడిలో ఆలయానికి నష్టం జరిగిందని, దీనిపై సమగ్ర విచారణ జరిపి దోషులపై కఠిన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.

స్టీల్‌ప్లాంట్‌ను సెయిల్‌లో విలీనం చేయాలి

- స్టీల్‌ప్లాంట్ ఎంప్లాయిస్ యూనియన్

ప్రజాశక్తి - ఉక్కునగరం (విశాఖపట్నం)

వైజాగ్ స్టీల్‌ప్లాంట్‌ను సెయిల్‌లో విలీనం చేయాలని స్టీల్‌ప్లాంట్ ఎంప్లాయిస్ యూనియన్ (సిఐటియు) ప్రధాన కార్యదర్శి యు.రామస్వామి డిమాండ్ చేశారు. స్టీల్‌ప్లాంట్ ప్రయివేటీకరణకు వ్యతిరేకంగా కూర్మన్నపాలెం కూడలిలో చేపట్టిన రిలే నిరాహార దీక్షలు బుధవారానికి 1343వ రోజుకు చేరాయి. దీక్షల్లో సిఐటియు కార్యకర్తలు, ఉక్కు కార్మికులు కూర్చున్నారు. వారినుద్దేశించి ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం విశాఖ ఉక్కు కర్మాగారాన్ని సెయిల్‌లో విలీనం చేయడం కోసం రాష్ట్ర ప్రభుత్వం ఒత్తిడి తేవాలని డిమాండ్ చేశారు. ఉక్కు కార్మికులకు ప్రస్తుతం సకాలంలో జీతాలు చెల్లించడం లేదని, పూర్తిస్థాయిలో ఉత్పత్తి చేయడం కోసం రా మెటీరియల్‌ను అందుబాటులో ఉంచడం లేదని తెలిపారు. సంఘం సీనియర్ నాయకులు ఎన్.రామారావు మాట్లాడుతూ ఉక్కు కార్మిక వర్గంపై నానాటికీ ప్రభుత్వ దాడి పెరుగుతోందని, వేతన ఒప్పంద చర్చలు సరైన పద్ధతిలో జరగడం లేదని తెలిపారు. బోనస్‌పై చర్చ లేకుండా కార్మికుల అభిప్రాయాలకు భిన్నంగా యాజమాన్యం ఏకపక్షంగా నిర్ణయం తీసుకోవడం తగదన్నారు. దీనికి వ్యతిరేకంగా కార్మికవర్గం సమ్మెకు సిద్ధమవుతున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో సంఘం నాయకులు శ్రీనివాస్ రెడ్డి, భానుమూర్తి, గంగాధర్, నీలకంఠం, వెంకటరావు పాల్గొన్నారు.

మద్యం షాపుల వద్ద క్యూలు

- పూర్తి సంఖ్యలో తెరచుకోని షాపులు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ప్రైవేటు మద్యం షాపుల్లో విక్రయాలు ప్రారంభమైన తొలిరోజు రాష్ట్ర వ్యాప్తంగా షాపుల వద్ద పెద్ద సంఖ్యలో క్యూలు కనిపించాయి. చాలా చోట్ల మద్యం ప్రియులు షాపులు తెరిచే సమయానికన్నా ముందే వచ్చి ఉండటం కనిపించింది. రాష్ట్ర వ్యాప్తంగా 3,396 షాపులకు అనుమతించినప్పటికీ వివిధ కారణాల వల్ల బుధవారం పూర్తిస్థాయిలో ప్రారంభం కాలేదు, క్షేత్రస్థాయిలో నెలకొన్న కొన్ని సమస్యల కారణంగా ఈ పరిస్థితి ఏర్పడింది. షాపులు అందుబాటులో ఉన్న చోట నిబంధనలకు అనుకూలంగా లేకపోవడం, నిబంధనలుకు అనుకూలంగా ఉన్న చోట్ల ధరలు అందుబాటులో లేకపోవడం వంటి సమస్యలను లైసెన్స్‌దారులు ఎదుర్కుంటున్నారు.

కొన్ని చోట్ల లైసెన్సీలు వారి లైసెన్స్‌ను విక్రయించాలని నిర్ణయించుకోవడం, మరికొన్ని చోట్ల రాజకీయ నేతల నుండి ఒత్తిళ్లు కూడా ఈ పరిసితికి కారణం. మరోవైపు ప్రభుత్వం విస్తృతంగా ప్రచారం చేసిన రూ.99ల క్వార్టర్ బాటిల్ అందుబాటులోకి రాలేదు. దీంతో మద్యపాన ప్రియులు కొంత నిరాశకు గురయ్యారు. వీటికోసం ఇప్పటికే ఎక్సైజ్ శాఖ తయారీ సంస్థలతో ఒప్పందాలు చేసుకున్నప్పటికీ అందుబాటులోకి వచ్చేందుకు మరో వారం రోజుల వరకూ సమయం పడుతుందని తెలుస్తోంది.

ఇందుకు సంబంధించి 2 లక్షల కేసులను తొలుత షాపులకు అందజేసేందుకు అధికారులు ప్రయత్నాలు చేస్తున్నారు. మరోవైపు తెరచిన షాపుల్లో గతంలో బ్యాన్ చేసిన వివిధ రకాల ప్రీమియం బ్రాండ్లు అందుబాటులోకి రావడంతో కొనుగోలుదారులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఈ బ్రాండ్ల కోసం గత ఐదేళ్లుగా ఎన్నో ఇబ్బందులు పడేవాళ్లమని చెబుతున్నారు. వీటి ధరల విషయంలో మాత్రం నిరాశ చెందుతున్నారు.

నష్టపోయిన రైతుల పంట రుణాలు రద్దు చేయాలి

- రైతు సంఘాల సమన్వయ సమితి

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

వరదలు కారణంగా పంట నష్టపోయిన రైతులకు పంట రుణాలు రద్దు చేయాలని వ్యవసాయశాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడును ఎపి రైతు సంఘాల నాయకుల బృందం కోరింది. వెలగపూడిలోని సచివాలయంలో మంత్రిని, రైతు సంఘాల నాయకుల బృందం బుధవారం కలిసి ఈ మేరకు వినతిపత్రాన్ని సమర్పించింది. కంద, పసుపు రైతులకు ప్రభుత్వం పంట నష్టపరిహారాన్ని ఎకరాకు రూ.14 వేలు చెల్లించిందని, అయితే కంద రైతులకు ఎకరాకు రూ.86 వేలు, పసుపు రైతులకు ఎకరాకు రూ.46 వేలు పంట నష్టపరిహారాన్ని అదనంగా చెల్లించాలని కోరారు. పంట వాస్తవ సాగుదారులను గుర్తించి వారికి మాత్రమే ఈ పరిహారం అందించాలన్నారు. భూ యజమాని సంతకంతో నిమిత్తం లేకుండా కౌలు రైతులకు గుర్తింపు కార్డులివ్వాలని కోరారు. లంక భూముల్లో పేరుకుపోయిన ఇసుక, బురద, మట్టిని ప్రభుత్వ ఖర్చుతో తొలగించాలన్నారు.

కొత్తగా పంట వేసుకోవడానికి విత్తనాలు, ఎరువులు, పంట రుణాలు అందించాలని కోరారు. వరద నీటిలో విద్యుత్ మోటార్లు, ఆయిల్ ఇంజిన్లు మునిగిపోయాయని, వీటికి మరమ్మతులు చేయించాలని, లేనిపక్షంలో అందుకయ్యే వ్యయాన్ని అంచనా వేసి పరిహారంగా చెల్లించాలని రైతు సంఘాల నాయకులు వినతిపత్రంలో పేర్కొన్నారు. మంత్రిని కలిసిన వారిలో ఎపి రైతు సంఘాల సమన్వయ సమితి కన్వీనర్, మాజీ మంత్రి వడ్డే శోభనాద్రీశ్వరరావు, సమితి రాష్ట్ర నాయకులు వై కేశవరావు, ఎం హరిబాబు, పి జమలయ్య, లక్ష్మణస్వామి, యు వీరబాబు, మరీదు ప్రసాద్‌బాబు, కోగంటి ప్రసాద్, కోటయ్య, వేణుగోపాలరావు, పెద్ది గోపాలకృష్ణ తదితరులు ఉన్నారు.

పశుసంవర్ధకశాఖ డైరెక్టరు బదిలీ

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

పశుసంవర్ధకశాఖ డైరెక్టరు అమరేంద్ర కుమార్‌ను ప్రభుత్వం బదిలీ చేసింది. ఈ మేరకు పశుసంవర్ధకశాఖ కార్యదర్శి ఎంఎం నాయక్ బుధవారం ఉత్తర్వులు విడుదల చేశారు. ఎపి షీప్ అండ్ గోట్ డెవలప్‌మెంట్ ఫెడరేషన్ లిమిటెడ్ ఎమ్‌డిగా అమరేంద్రను బదిలీ చేశారు. ఆ సంస్థ ఎమ్‌డి టి దామోదరనాయుడును పశుసంవర్ధకశాఖ డైరెక్టరుగా నియమిస్తున్నట్లు ఉత్తర్వుల్లో వెల్లడించారు. గత ప్రభుత్వ హయాంలో అమరేంద్ర కుమార్‌పై అనేక ఆరోపణలు ఉన్నాయి. నిబంధనలను పక్కనపెట్టి ప్రభుత్వ పెద్దలకు అనుకూలంగా వ్యవహరించడంతోపాటు పలు ఇతర ఆరోపణలు ఎదుర్కొన్న నేపథ్యంలో ప్రభుత్వం బదిలీ నిర్ణయం తీసుకున్నట్లుగా తెలుస్తోంది.

ప్రజాశక్తిపై స్పందన ఫోన్ : 9490099006

ప్రజల పత్రికకు ప్రజలే మార్గదర్శకులు. ప్రజాశక్తిలో మీకు నచ్చిన నచ్చని అంశాలను ఎప్పటికప్పుడు మా దృష్టికి తీసుకువస్తే మరింత పదును పెట్టుకోవడానికి వీలవుతుంది.

94900 99006 ఫోన్ నెంబర్‌కు ఆదివారం మినహా ప్రతి రోజూ మధ్యాహ్నం 12 నుంచి సాయింత్రం 6 గంటల మధ్య మీ అభిప్రాయాలు తెలియజేయవచ్చు. మీరు చెప్పేది క్లుప్తంగా సూటిగా పద్ధతిగా వుండాలి. ఇప్పటికే చాలా మంది పంపుతున్న విమర్శలు, సూచనలు మాకు బాగా ఉపయోగపడు తున్నాయి. వారందరికీ కృతజ్ఞతలు.

అభిప్రాయాలు పంపదలిస్తే..
స్పందన, ప్రజాశక్తి తెలుగు డైలీ,
ప్రజాశక్తి భవనం-అమరరెడ్డి కాలనీ,
అరవింద హైస్కూల్ దగ్గర, తాడేపల్లి,
గుంటూరు జిల్లా - 522 501కు కానీ
editorprajasakthi@gmail.comకు పంపవచ్చు.

పల్నాడుకు మరో జాతీయ రహదారి

- కొండమోదు-పేరేచర్లకు రూ.881.61 కోట్ల కేటాయింపు

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

పల్నాడు జిల్లాలోని కొండమోదు- పేరేచర్ల జాతీయ రహదారి నిర్మాణానికి కేంద్ర ప్రభుత్వం రూ.881.61 కోట్లు మంజూరు చేసిందని నరసరావుపేట ఎంపి లావు శ్రీకృష్ణ దేవరాయలు బుధవారం వెల్లడించారు. ఈ రహదారిని కేంద్రం ప్రభుత్వంలోని భారత్ మాలా ప్రాజెక్టు నుండి ఎన్‌హెచ్ (ఓ) కిందకు మార్చి నిధులు మంజూరు చేసినట్లు పేర్కొన్నారు. గుంటూరు-హైదరాబాద్ మార్గంలో కీలకమైన ఈ రోడ్డు నిర్మాణం చేపట్టాలని ఎన్నో ఏళ్ళుగా ఈ ప్రాంత ప్రజలు కోరుకుంటున్నారని తెలిపారు. నాలుగు లైన్ల జాతీయ రహదారి పనులు త్వరలో ప్రారంభం కానున్నాయని పేర్కొన్నారు. ఈ రహదారికి అనుసంధానంగా సత్తెనపల్లి, మేడికొండూరు వద్ద బైపాస్ రోడ్లు కూడా నిర్మిస్తామని తెలిపారు.

శామ్‌సంగ్ కార్మికుల విజయం

మొదటిపేజి తరువాయి

అని ఆయన చెప్పారు. మంగళవారం తమిళనాడు కార్మికశాఖ అధికారులతో నిరసన తెలుపుతున్న కార్మికుల ప్రతినిధులు సమావేశమయ్యారు. సమావేశం అనంతరం రాష్ట్ర పరిశ్రమలశాఖ మంత్రి టిఆర్‌బి రాజా మాట్లాడుతూ..

సమ్మెలో ఉన్న కార్మికులు వెంటనే విధుల్లో చేరాలని నిర్ణయించుకున్నారని, సమ్మెలో పాల్గొన్నందుకు కార్మికులను బలిపశువులను చేయకూడదని శామ్‌సంగ్ అంగీకరించిందని తెలిపారు. యాజమాన్యానికి పూర్తిగా సహకరించేందుకు కార్మికులు అంగీకరించారని, వారు దాఖలు చేసిన డిమాండ్ల చార్టర్‌పై సామ్‌సంగ్ లిఖితపూర్వక సమాధానం దాఖలు చేస్తుందని ఆయన అన్నారు.

సమ్మెను విరమించాలన్న సిఐటియు నిర్ణయాన్ని స్వాగతిస్తున్నట్లు శామ్‌సంగ్ ఒక ప్రకటన విడుదల చేసింది. 'సమ్మెలో పాల్గొన్న కార్మికులపై మేము చర్యలు తీసుకోం. చెన్నై ఫ్యాక్టరీని పని చేయడానికి గొప్ప ప్రదేశంగా మార్చడానికి మా కార్మికులతో కలిసి పని చేయడానికి మేం కట్టుబడి ఉన్నాం' అని ప్రకటనలో పేర్కొన్నారు.

మాట్లాడుతున్న ఆదివాసీ గిరిజన సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కిల్లో సురేంద్ర

కాఫీ రైతులకు గిట్టుబాటు ధర కల్పించాలి

- ఆదివాసీ గిరిజన సంఘం డిమాండ్

ప్రజాశక్తి - పాడేరు (అల్లూరి సీతారామరాజు జిల్లా)

ఏజెన్సీలోని గిరిజన కాఫీ రైతులకు గిట్టుబాటు ధర కల్పించాలని ఆదివాసీ గిరిజన సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కిల్లో సురేంద్ర, అల్లూరి జిల్లా అధ్యక్షులు ధర్మన్న పడాల్ డిమాండ్ చేశారు. అల్లూరి సీతారామరాజు జిల్లా పాడేరులో వారు బుధవారం విలేకరులతో మాట్లాడుతూ గిరిజన రైతులు పండిస్తున్న కాఫీకి అంతర్జాతీయ స్థాయిలో మంచి గుర్తింపు ఉందని, అందుకు తగ్గట్టుగా గిట్టుబాటు ధర లభించడం లేదని తెలిపారు. పార్చ్‌మెంట్ కాఫీ కిలోకు రూ.500, అరబిక్ చెర్రీ కాఫీ కిలోకు రూ.300, రోబస్ట చెర్రీ కాఫీ కిలోకు రూ.200 చొప్పున గిట్టుబాటు ధర ప్రకటించాలని డిమాండ్ చేశారు. ఇటీవల కాఫీ అపెక్స్ కమిటీ 2024-25 సంవత్సరంలో కొనుగోలు చేసే కాఫీ లక్ష్యాలకు సంబంధించి ధరలు ప్రకటించిందని, ఈ మేరకు పార్చ్‌మెంట్ కాఫీ కిలోకు రూ.285, అరబిక్ చెర్రీ కాఫీ కిలోకు రూ.150, రోబస్ట చెర్రీ కాఫీ కిలోకు రూ.80 ధరను చెల్లించనుందని పేర్కొందన్నారు. దీనిపట్ల ఆదివాసీ కాఫీ రైతులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారని తెలిపారు. కాఫీ ధరల నిర్ణయంపై అపెక్స్ కమిటీ పునరాలోచన చేసి, ధరలు పెంచాలని కోరారు. అరకు ఆర్గానిక్ కాఫీకి ప్రపంచ వ్యాప్తంగా మంచి ధర ఉందని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రచారం చేస్తూ పెద్దపెద్ద బహుళ జాతి సంస్థలకు లాభాలు చేకూరుస్తున్నాయని, కాఫీ రైతులకు తక్కువ ధర చెల్లించి తీవ్రంగా నష్టపరుస్తున్నాయని తెలిపారు. 2008 నుంచి కాఫీ బకాయిలు సుమారు రూ.60 కోట్లను రైతులకు చెల్లించాల్సి ఉందని, వాటిని తక్షణం విడుదల చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో సంఘం నాయకులు కె.సత్యనారాయణ, ఎస్.చిట్టిబాబు తదితరులు పాల్గొన్నారు.

కక్షసాధింపు, వేధింపుల పర్వం

- వైసిపి ప్రధాన కార్యదర్శి సజ్జల

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్ర ప్రభుత్వం కక్షసాధింపు, వేధింపులకు దిగుతోందని వైసిపి ప్రధాన కార్యదర్శి సజ్జల రామకృష్ణారెడ్డి ఆరోపించారు. టిడిపి కార్యాలయంపై దాడి ఘటనలో అసలు కేసుపెట్టడానికి అవకాశం కూడా లేదని, తమను వేధించడం ప్రభుత్వ ఉద్దేశమని అన్నారు. వైసిపి కార్యాలయంలో తనను కలిసిన మీడియాతో బుధవారం మాట్లాడారు. తన కుటుంబంతో కలిసి ఈ నెల 7న ఢిల్లీ నుంచి బాలి వెళ్లి 14న తిరిగి వచ్చానని తెలిపారు. గుంటూరు ఎస్‌పి నుంచి లుక్‌అవుట్ సర్క్యులర్ వచ్చిందని ఢిల్లీ విమానాశ్రయంలో ఇమ్మిగ్రేషన్ అధికారులు తనను ఆపారని చెప్పారు. తాను విదేశాల నుంచి తిరిగి విజయవాడకు వెళ్తున్నానని చెప్పినా తామేం చేయలేమని అధికారులు అన్నారని తెలిపారు. తాను విదేశాలకు వెళ్లినట్లు తెలుసుకుని లుక్‌అవుట్ నోటీసు ఇచ్చారన్నారు.

సిఎం చంద్రబాబుకు ఆర్థిక, రాజకీయ ప్రయోజనాలే ముఖ్యం : శ్రీకాంత్ రెడ్డి

ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు ఆర్థిక, రాజకీయ ప్రయోజనాలే ముఖ్యమని వైసిపి నేత, మాజీ ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్ రెడ్డి ఆరోపించారు. రాష్ట్ర ప్రభుత్వం కొత్తగా అమలు చేస్తున్న మద్యం పాలసీలో ఎటువంటి పారదర్శకత లేదని పేర్కొన్నారు. ఎక్కడికక్కడ దౌర్జన్యాలు, బెదిరింపులతో కమీషన్ల కోసం టిడిపి నేతలు దాడులు సాగిస్తున్నారని ఆక్షేపించారు. కొత్త పాలసీ వల్ల ఊరూరా, ఇంటింటికీ నేరుగా మద్యం ఏరులై పారే ప్రమాదం ఉందని, బెల్ట్‌షాపులను ప్రభుత్వమే ప్రోత్సహించేలా వ్యవహరిస్తుందన్నారు.

చంద్రబాబు మెడకు బిగుస్తున్న ఉచ్చు : సతీష్‌కుమార్ రెడ్డి

స్కిల్ డెవలప్‌మెంటు కేసులో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ దర్యాప్తుతో చంద్రబాబు మెడ చుట్టూ ఉచ్చు బిగుసుకుంటోందని వైసిపి ప్రధాన కార్యదర్శి సతీష్‌కుమార్ రెడ్డి అన్నారు. ఈ కేసులో తనకు క్లీన్‌చిట్ ఇచ్చి పూలదండలు వేసినట్లు చంద్రబాబు ప్రచారం చేసుకుంటున్నారని పేర్కొన్నారు. ఈ కేసులో రూ.23.54 కోట్ల ఆస్తులను ఇడి అటాచ్ చేస్తే చంద్రబాబుకు క్లీన్‌చిట్ ఇచ్చినట్లు ప్రచారం చేస్తున్నారని తెలిపారు.

గౌరవప్రదమైన జీవనం అందించడమే లక్ష్యం

- బిసి రక్షణ చట్టం విధివిధానాలపై మంత్రులు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

సచివాలయంలో సమావేశమైన 'బిసి' మంత్రులు

రాష్ట్రంలో వెనుకబడిన తరగతులకు గౌరవప్రదమైన జీవనం అందించడమే లక్ష్యంగా బిసి రక్షణ చట్టాన్ని రూపొందిస్తున్నట్లు ఆ తరగతికి చెందిన మంత్రులు తెలిపారు. బిసి రక్షణ చట్టం విధివిధానాల రూపకల్పనపై మంత్రులు కె అచ్చెన్నాయుడు, కొల్లు రవీంద్ర, ఎస్ సవిత, అనగాని సత్యప్రసాద్, కొలుసు పార్థసారధి, సత్యకుమార్ యాదవ్, వాసంశెట్టి సుభాష్, కొండపల్లి శ్రీనివాస్‌తోపాటు హోంమంత్రి వంగలపూడి అనిత రాష్ట్ర సచివాలయంలో బుధవారం సమావేశమయ్యారు. బిసి రక్షణ చట్టం అవశ్యకతను బిసి సంక్షేమశాఖ మంత్రి సవిత మంత్రులకు ముందుగా వివరించారు. జగన్ హయాంలో రాష్ట్రంలో బిసిల ఆస్తులకు, ప్రాణాలకు రక్షణ కరువైందని విమర్శించారు. ఓటు బ్యాంకు రాజకీయాలకు బలైపోతున్న బిసిల దుస్థితిని 'మీకోసం' బస్సు యాత్రలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, యువగళం పాదయాత్రలో మంత్రి నారా లోకేష్ స్వయంగా పరిశీలించారని తెలిపారు. బిసిలను ఆదుకోవాలని నిర్ణయించి బిసి డిక్లరేషన్‌ను ప్రకటించారని చెప్పారు. చట్టసభల్లో బిసిలకు 33 శాతం రిజర్వేషన్లు కల్పించాలని ఇటీవల మంత్రివర్గ సమావేశంలో తీర్మానం చేసి కేంద్రానికి ప్రతిపాదించినట్లు చెప్పారు. ఆదరణ వంటి పథకాలను అమలు చేయాలని నిర్ణయం తీసుకున్నామన్నారు. కులపరంగా, వ్యక్తిగతంగా ధూషించిన వారిపై చర్యలు తీసుకునేలా చట్టం రూపొందిస్తున్నామని చెప్పారు. మంత్రి అచ్చెన్నాయుడు మాట్లాడుతూ.. చట్టం రూపకల్పనలో న్యాయ నిపుణులు, న్యాయశాఖ కార్యదర్శి సలహాలు, సూచనలు తీసుకోవాలని సూచించారు. మంత్రి కొలుసు పార్థసారధి మాట్లాడుతూ.. చట్టాన్ని పకడ్బందీగా రూపొందించేలా ఇతర చట్టాలను అధ్యయనం చేయాలని సూచించారు. అనగాని సత్యప్రసాద్, సత్యకుమార్ యాదవ్, కొండపల్లి శ్రీనివాస్, వాసంశెట్టి సుభాష్ మాట్లాడుతూ.. చట్టం రూపకల్పనలో సెక్షన్లు, ఇతర అంశాలను క్షుణ్ణంగా పరిశీలించాలన్నారు. ఈ సమావేశంలో బిసి సంక్షేమశాఖ ప్రధాన కార్యదర్శి పోలా భాస్కర్, ఎంజెపి గురుకుల పాఠశాలల కార్యదర్శి కృష్ణమోహన్, బిసి కమిషన్ సభ్యులు మాధవీలత తదితరులు పాల్గొన్నారు.

నాగార్జున సాగర్‌కి పెరిగిన ఇన్‌ఫ్లో..

- ఎనిమిది గేట్ల ద్వారా నీరు విడుదల

ప్రజాశక్తి- శ్రీశైలం ప్రాజెక్టు

నాగార్జునసాగర్ జలాశయానికి వరద ప్రవాహం పెరగడంతో బుధవారం 8 క్రస్ట్ గేట్ల ద్వారా నీటిని దిగువకు విడుదల చేశారు. మూడు రోజులుగా కృష్ణానది పరివాహక ప్రాంతంలో వర్షాలు కురుస్తున్నాయి. ఉదయానికి సాగర్ జలాశయ నీటి మట్టం 590 అడుగుల పూర్తి స్థాయికి చేరడంతో రెండు గేట్ల ద్వారా నీటిని విడుదల చేసిన అధికారులు.. మధ్యాహ్నానికి 8 గేట్లను ఐదు అడుగుల మేరకు ఎత్తారు. ప్రస్తుతం శ్రీశైలం నుంచి నాగార్జునసాగర్‌కు 1,09,246 క్యూసెక్కుల నీరు వస్తోంది. సాగర్ జలాశయం నుంచి కుడి కాలువ ద్వారా 6,253 క్యూసెక్కులు, ఎడమ కాలువ ద్వారా 6,022 క్యూసెక్కులు, ప్రధాన జల విద్యుత్ కేంద్రం ద్వారా 28,903 క్యూసెక్కులు, ఎస్ఎల్‌బిసి ద్వారా 2,400 క్యూసెక్కులు, వరద కాలువ ద్వారా 400 క్యూసెక్కులు, మొత్తం1,09,246 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు.

గరిష్ట స్థాయికి శ్రీశైలం నీటి మట్టం

కృష్ణ ఎగువ పరివాహక ప్రాంతమైన తుంగభద్ర నుండి ఒక మోస్తారు నీటి ప్రవాహం శ్రీశైలం జలాశయానికి చేరుతుండడంతో జలాశయ నీటి మట్టం గరిష్ట స్థాయికి చేరువలో ఉంది. రెండు రోజులుగా ఎగువ జూరాల, విద్యుత్ ఉత్పాదన ద్వారా నీటి ప్రవాహం కొనసాగుతుండడంతో జలాశయ నీటి మట్టం 884.40 అడుగులకు చేరింది. జూరాల నుండి విద్యుత్తు ఉత్పాదన ద్వారా 39,609 క్యూసెక్కులు, తుంగభద్ర ద్వారా 38,493 క్యూసెక్కులు కలిపి జలాశయానికి 78,102 క్యూసెక్కులు నీరు చేరుతోంది. జలాశయంలో నీటి నిల్వ సామర్థ్యం 215 టిఎంసిలకుగాను ప్రస్తుతం 211.9572 టిఎంసిలుగా ఉంది. శ్రీశైలం బ్యాక్ వాటర్ నుండి పోతిరెడ్డిపాడు హెడ్ రెగ్యులేటర్‌కు 8,000, హంద్రీనీవా సుజల స్రవంతికి 1,547, మహాత్మా గాంధీ కల్వకుర్తి ఇరిగేషన్కు 1,360 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. ఎడమ గట్టు భూగర్భ జల విద్యుత్ కేంద్రం ద్వారా 36,900 క్యూసెక్కులు, కుడి గట్టు జల విద్యుత్ కేంద్రం ద్వారా 30,776 క్యూసెక్కులు మొత్తం 67,676 క్యూసెక్కుల దిగువ నాగార్జునసాగర్‌కు విడుదల చేస్తున్నారు. జలాశయం నుండి మొత్తం 78,587 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు.

నిజాయితీతో కూడిన భాగస్వామ్యం అవశ్యం

మొదటిపేజి తరువాయి

తీవ్రంగా దెబ్బతీస్తున్నాయని అన్నారు. పాకిస్తాన్ ప్రధాని షెహబాజ్ షరీఫ్ బుధవారం జైశంకర్‌కు సదస్సులో స్వాగతం పలికారు. ఇరువురు నేతలు కరచాలనం చేసుకుని, కలిసి ఫోటోలు దిగారు. గత 9ఏళ్ళలో భారత విదేశాంగ మంత్రి పాకిస్తాన్‌లో పర్యటించడం ఇదే తొలిసారి. రష్యా, చైనా, బెలారస్, సెంట్రల్ ఆసియా దేశాల ప్రధానులు, ఇరాన్ ఉపాధ్యక్షుడు, జై శంకర్‌లతో సహా నేతలందరూ గ్రూప్ ఫోటోలకు పోజిచ్చారు. ఆ తర్వాత 23వ ఎస్‌సిఒ ప్రభుత్వాధినేతల ప్లీనరీ సమావేశం జరిగింది. మంగళవారం సాయంత్రం ఇస్లామాబాద్ చేరుకున్న జై శంకర్, రాత్రి పాక్ ప్రధాని ఇచ్చిన విందుకు హాజరయ్యారు.

విశ్వాసం కొరవడినా లేదా సహకారం తగిన రీతిలో లేకున్నా, స్నేహ బంధం సరిగా లేకపోయినా లేక పొరుగువారితో సత్సంబంధాలు లోపించినా వాటికి కచ్చితంగా కారణాలు వుంటాయని, ఆత్మ పరిశోధన చేసుకుని వాటిని తెలుసుకోవాలని, పరిష్కరించుకోవడానికి ప్రయత్నించాలని జై శంకర్ పేర్కొన్నారు. పరస్పర గౌరవం, సార్వభౌమాధికార సమానత్వం ప్రాతిపదికన సహకారం వుండాలి. ప్రాదేశిక సమగ్రతను, సార్వభౌమత్వాన్ని గుర్తించాలి. ఇదంతా కూడా నిజాయితీ కలిగిన భాగస్వామ్యాలతో నిర్మించుకోవాల్సి వుంటుందని అన్నారు. మనకు నచ్చిన లేదా ప్రయోజననాలు కలిగించే పద్ధతులనే అనుసరిస్తామనుకుంటే పురోగతి సాధించలేమన్నారు. ముఖ్యంగా వాణిజ్యం, రవాణా విషయంలో ఇది సాధ్యం కాదన్నారు. సరిహద్దుల ఆవలి నుండి చేపట్టే కార్యకలాపాలు తీవ్రవాదం, వేర్పాటు వాదం వంటి లక్షణాలతో కూడి వుంటే వాణిజ్యం, ఇంధన రవాణా, అనుసంధానత, ప్రజల మధ్య సంబంధాలను ప్రోత్సహించడం కష్టసాధ్యమవుతుందని స్పష్టం చేశారు.

నాలుగు నెలలైనా..నెరవేరని సూపర్ 6 హామీలు : షర్మిల విమర్శ

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్రంలో టిడిపి కూటమి ప్రభుత్వం ఏర్పడి నాలుగు నెలలు గడుస్తున్నా.. ఎన్నికల ముందు ఇచ్చిన సూపర్ 6 హామీలను ఇప్పటికీ అమలు చేయలేదని ఎపిసిసి అధ్యక్షులు వైఎస్ షర్మిల విమర్శించారు. 'ఫ్రాంక్లీ స్పీకింగ్' అనే టివి షోలో మంత్రి నారా లోకేష్‌ను చూడటం సంతోషమని, ఇప్పుడు రాష్ట్ర ప్రజలకు మీరు ఇచ్చిన వాగ్దానాలను నెరవేర్చడంపై మీ ఉద్దేశాలు తెలపాలని పేర్కొన్నారు. ఒక ఇంగ్లీష్ ఛానల్‌కు మంత్రి ఇచ్చిన ఇంటర్వ్యూపై ఆమె ఎక్స్ వేదికగా బుధవారం స్పందించారు. ప్రధాని మోడీకి ఇచ్చిన హామీ నెరవేర్చానని గర్వపడుతున్నారు, రాష్ట్ర ప్రజలకు ఇచ్చిన హామీ గురించి ఒక్కమాట మాట్లాడకపోవడానికి కారణమేమిటని మంత్రి లోకేష్‌ను ప్రశ్నించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రతివారం ఢిల్లీకి పరుగులు తీస్తున్నా.. రాష్ట్రానికి ప్రధాని మోడీ ఇచ్చిన హామీల్లో ఒక్కటి కూడా నెరవేర్చకపోవడం సిగ్గుచేటన్నారు. వైజాగ్ స్టీల్ ప్లాంటు సమస్య, పోలవరం ప్రాజెక్టు అంశంపై అతీగతి లేదన్నారు.



భద్రత, వాణిజ్యం, ఆరోగ్య రంగాల్లో బంధం మరింత బలోపేతం

మొదటిపేజి తరువాయి

ఏర్పాటు చేశారు. దక్షిణ సింధ్ రాష్ట్ర రాజధాని కరాచీ విమానాశ్రయం వెలుపల ఆత్మాహుతి బాంబు దాడిలో ఇద్దరు చైనీస్ ఇంజినీర్లు మరణించిన వారం రోజుల తర్వాత ఈ కూటమి సమావేశాలు ఇక్కడ జరుగుతుండడం గమనార్హం. . ఈ దాడి తమ పనేనని పాకిస్తాన్‌లో చైనా నిధులతో చేపట్టిన ప్రాజెక్టులను వ్యతిరేకిస్తున్న చట్ట విరుద్ధమైన వేర్పాటువాద సంస్థ ఒకటి ప్రకటించింది. పాకిస్తాన్ ప్రధాని షెహబాజ్ షరీఫ్ ఈ సమావేశంలో మాట్లాడుతూ, చైనా బెల్ట్ అండ రోడ్ ఇనిషియేటివ్ , చైనా-పాకిస్తాన్ ఆర్థిక కారిడార్ విస్తరణ, రోడ్లు, రైల్వేలు, డిజిటల్ మౌలిక సదుపాయాలపై దృష్టి సారించాలని పిలుపునిచ్చారు.

బెల్ట్ అండ్ రోడ్ ఇనిషియేటివ్ కింద చైనా ప్రపంచవ్యాప్తంగా పవర్ ప్లాంట్లు, రోడ్లు, రైల్వే మార్గాలు, ఓడరేవులను నిర్మిస్తోంది. దీనికి బెలారస్, ఇరాన్, కజకిస్తాన్, కిర్గిజిస్థాన్, తజికిస్తాన్, ఉజ్బెకిస్తాన్, పాకిస్తాన్, రష్యా నాయకులు, అధికారులు వన్ బెల్ట్, వన్ రోడ్ చొరవకు మద్దతు పునరుద్ఘాటించారని ఎస్‌సిఓ సంయుక్త ప్రకటన పేర్కొంది. షాంఘై సహకార కూటమి తదుపరి సమావేశం వచ్చే ఏడాది రష్యాలో జరుగుతుందని షరీఫ్ తెలిపారు.

అభిజిత్ లే ఆఫ్ చట్ట వ్యతిరేకం

- కార్మికులకు అన్యాయం చేస్తే సహించేది లేదు : సిహెచ్ నర్సింగరావు

ప్రజాశక్తి - అచ్యుతాపురం (అనకాపల్లి)

అభిజిత్ ఫెర్రో టెక్ కంపెనీ ప్రకటించిన లే ఆఫ్ చట్ట వ్యతిరేకమైందని సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిహెచ్ నర్సింగరావు అన్నారు. అచ్యుతాపురం సెజ్‌లో మూతపడిన అభిజిత్ ఫెర్రో టెక్ పరిశ్రమ వద్ద మూడో రోజైన బుధవారమూ కార్మికులు ఆందోళన కొనసాగించారు. వారి పోరాటానికి నర్సింగరావు మద్దతు తెలిపారు. కార్మికులకు మనోధైర్యం కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పరిశ్రమ స్థాపనకు భూములు ఇచ్చి నేడు ఉపాధి సమస్య ఎదుర్కొనే పరిస్థితి రైతులకు రావడం విచారకరమన్నారు. కార్మికులను భయపెట్టి, అన్యాయం చేయడానికి యాజమాన్యం ప్రయత్నిస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. కార్మికులకు 13వ తేదీన బోనస్ ఇస్తామని చెప్పి, అదే రోజున లే ఆఫ్‌కు దిగడం సహించరాని విషయమన్నారు. సగం జీతం ఇస్తామని చెప్పడం ఏంటని, పూర్తి జీతం బోనస్ కింద ఇవ్వాలని డిమాండ్ చేశారు. లే ఆఫ్ ప్రకటించాలంటే ప్రభుత్వం అనుమతి ఇవ్వాల్సి ఉందన్నారు. అభిజిత్ పరిశ్రమ లే ఆఫ్‌కు ఎవరు పర్మిషన్ ఇచ్చారని ప్రశ్నించారు. 15 సంవత్సరాల క్రితం పరిశ్రమలో ఉపాధి చేసిన కార్మికులకు నేటికీ రూ.15 వేలు మించి జీతం రావడంలేదన్నారు. సెజ్‌లో కార్మికుల సమస్యలపై ప్రశ్నించడానికి, హక్కులను సాధించడానికి యూనియన్ ఏర్పాటు చేసుకుంటేనే యాజమాన్యాలు, ప్రభుత్వం అభ్యంతరం చెబుతున్నాయన్నారు. కార్మికులకు న్యాయం చేయాలని హైకోర్టును ఆశ్రయిస్తామని తెలిపారు. అభిజిత్ కార్మికులకు న్యాయం జరిగేంత వరకూ పోరాటం కొనసాగుతుందని స్పష్టం చేశారు. నాడు సెజ్‌కు భూ సేకరణ సమయంలో రైతులకు అండగా సిపిఎం, సిఐటియు చేసిన పోరాటాలను గుర్తుచేశారు. ఇటువంటి రైతులందరూ పోరాటం చేయడానికి ముందుకు వచ్చారని, అలాగే ఇప్పుడు యాజమాన్యాలు అనుసరిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలపై పోరాడేందుకు ఉద్యమ పథంలోకి రావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి జి కోటేశ్వరరావు, జిల్లా ఉపాధ్యక్షులు ఆర్ రాము, జిల్లా కార్యదర్శి గనిశెట్టి సత్యనారాయణ, అచ్యుతాపురం మండల కన్వీనర్ కె సోమునాయుడు, నాయకులు బుద్ద రంగారావు, కర్రి అప్పారావు పాల్గొన్నారు.

కార్మికులతో కలిసి నినాదాలు చేస్తున్న సిహెచ్.నర్సింగరావు

మహారాజశ్రీ విజయవాడ నాల్గవ అదనపు జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్ట్ లో
ఓ.ఎస్.నెంబర్. 1044 / 2023

బిట్వీన్:
ఐసిఐసి బ్యాంక్ లిమిటెడ్, విజయవాడ, రిప్రజెంటెడ్ బై జిపిఏ హోల్డర్, విజయవాడ.
...వాది

మరియు

రాఘవేంద్ర గుప్త, S/o. మునగాల సాంబశివ రావు, నివాసం: డోర్ నెం. 29-19-24/2, మహేశ్వరి రెసిడెన్సీ, మెయిన్ రోడ్ దగ్గర, సూర్యారావు పేట్, విజయవాడ - 520012, ఎన్టీఆర్ జిల్లా, ఆంధ్ర ప్రదేశ్.
...ప్రతివాది

పై నెంబరు దావా నందు పైన తెలిపిన ప్రతివాదికి దావా సమన్లు అందజేయు నిమిత్తం ది.17.10.2024వ తేదీకి వాయిదా వేసినారు. కావున పైన తెలిపిన ప్రతివాది వాయిదా రోజు ఉదయం గం. 10.30 ని. లకు పై కోర్టు వారి ఎదుట స్వయంగా గాని, అడ్వకేట్ ద్వారా గాని హాజరు అయి వారికి గల ఆక్షేపణలు తెలుపుకొనవలయును. లేని యడల వారి పరోక్షమందు సదరు పై దావా తీర్మానము కాబడునని ఇందు మూలముగా తెలియ చేయటమైనది.

(కోర్టు వారి ఉత్తర్వులు ప్రకారము)

వాయిదా తేది : 17.10.2024

ఇట్లు
కునుకు రాజశేఖర్,
వాది తరుపు అడ్వకేట్,
గాంధీ నగర్, విజయవాడ-520003

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వము
గ్రామీణ నీటి సరఫరా మరియు పారిశుధ్య శాఖ

ఇ-ప్రొక్యూర్‌మెంట్ టెండరు నోటీసు

నెం.01-03/2024-25, తేది : 15.10.2024

ఎన్‌టిఆర్ జిల్లా, విజయవాడ డివిజన్ పరిధిలో ఆపరేషన్ అండ్ మైంటెనెన్సు ఆఫ్ సమగ్ర రక్షిత మంచినీటి సరఫరా పథకముల (3) పనులు చేపట్టుటకు అంచనా రూ. 65.00 లక్షలకు ఆన్‌లైన్ టెండర్లు కోరబడుచున్నవి. టెండర్ డాక్యుమెంట్స్ లభ్యత: 18.10.2024, ఉ.10.30గం. నుండి 01.11.2024, మ.4గం. వరకు. తదుపరి వివరాలను ఇ-మార్కెట్ ప్లేస్ www.apeprocurement.gov.in నందు చూడగలరు.

సం/- కార్యనిర్వాహక ఇంజనీరు,
గ్రా.నీ.స. (ప్రా) విభాగము, విజయవాడ

DIPRNo.14272/CL/ADVT/1/1/2021-22

ఎయిర్‌బస్‌లో 2500 ఉద్యోగులపై వేటు

న్యూయార్క్ : బోయింగ్ బాటలో ఎయిర్‌బస్ కూడా వేలాది మంది ఉద్యోగులను ఇంటికి పంపించే పనిలో పడింది. రక్షణ, అంతరిక్షయాన రంగంలో నెలకొన్న స్తబ్దత ఆర్డర్ల పడిపోవడంతో తయారీ సంస్థలు పొదుపు చర్యలకు దిగుతున్నాయి. ఈ నేపథ్యంలోనే యూరోపియన్ ఏవియేషన్ కంపెనీ ఎయిర్‌బస్ తన రక్షణ, అంతరిక్ష (స్పేస్) రంగంలోని ఉద్యోగులపై వేటు వేయనుందని రిపోర్టులు వస్తున్నాయి. ఈ కంపెనీ డిఫెన్స్, స్పేస్ రంగాల్లో 35,000 మంది ఉద్యోగులు పని చేస్తున్నారు. పెరుగుతున్న వ్యయాలను తగ్గించుకోవడానికి, రక్షణ ప్రాజెక్టుల్లో ఆలస్యం నేపథ్యంలో పలు చర్యలు తీసుకుంటున్నట్లు ఆ కంపెనీ వర్గాల సమాచారం.

యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా
భారత ప్రభుత్వ రంగ సంస్థ

UMFB గుడివాడ బ్రాంచి - 01461 : డోర్ నెం. 10/52-1, గౌరీశంకరపురం, గుడివాడ, కృష్ణా జిల్లా - 521301

స్వాధీనత ప్రకటన (స్థిరాస్తుల కొరకు)
SCHEDULE 6 (RULE 8(1)) of Security Interest (Enforcement) Rules 2002)

సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ ఎస్సెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ (రెండవ) చట్టం, 2002 (2002 యొక్క యాక్ట్ నెం. 54) ప్రకారము **యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, గుడివాడ** బ్రాంచి యొక్క అధీకృత అధికారి అయిన ఈ దిగువ సంతకందారు సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002 నందలి సెక్షన్ 13 (12)కు అనుబంధమైన రూల్ 9 ప్రకారము సంక్రమించిన అధికారములతో **ఋణగ్రహీతలు : 1) శ్రీ మాకినేని రవికుమార్,** తండ్రి : శ్రీ యం. హరినారాయణ, ఫ్లాట్ నెం. 52 & 44, ఫ్లాట్ నెం. 105, సాయి కపిల్ రెసిడెన్సీ, రాజీవ్ నగర్, యూసఫ్‌గూడ, హైదరాబాద్, తెలంగాణ - 500045. **2) శ్రీమతి మాకినేని ఉషారాణి,** భర్త : శ్రీ యం. రవికుమార్, ఫ్లాట్ నెం. 52 & 44, ఫ్లాట్ నెం. 105, సాయి కపిల్ రెసిడెన్సీ, రాజీవ్ నగర్, యూసఫ్‌గూడ, హైదరాబాద్, తెలంగాణ - 500045. **3) శ్రీమతి మాకినేని సరోజిని,** భర్త : శ్రీ యం. హరినారాయణ, ఫ్లాట్ నెం. 52 & 44, ఫ్లాట్ నెం. 105, సాయి కపిల్ రెసిడెన్సీ, రాజీవ్ నగర్, యూసఫ్‌గూడ, హైదరాబాద్, తెలంగాణ - 500045. **4) శ్రీ పునుకొల్లు నారాయణబాబు,** తండ్రి : శ్రీ పి. వెంకట అప్పారావు, ఫ్లాట్ నెం. 302, సుఖ్ నివాస్ అపార్ట్‌మెంట్స్, పంజాగుట్ట కాలనీ, అమీర్‌పేట, హైదరాబాద్, తెలంగాణ - 500082. **5) శ్రీమతి పునుకొల్లు అన్నపూర్ణమ్మ,** భర్త : శ్రీ పి. నారాయణబాబు, ఫ్లాట్ నెం. 302, సుఖ్ నివాస్ అపార్ట్‌మెంట్స్, పంజాగుట్ట కాలనీ, అమీర్‌పేట, హైదరాబాద్, తెలంగాణ - 500082. వారు అనగా అకౌంట్ పేర్లు అయిన శ్రీ మాకినేని రవికుమార్, మాకినేని సరోజిని, పునుకొల్లు అన్నపూర్ణమ్మ, శ్రీ పునుకొల్లు నారాయణ బాబు & శ్రీమతి మాకినేని ఉషారాణి (01463010001 5461) తాలూకు చెల్లించవలసిన బకాయి మొత్తం **రూ. 37,22,521.80/- (అక్షరాలా ముప్పై ఏడు లక్షల ఇరవై రెండు వేల ఐదు వందల ఇరవై ఒక్క రూపాయి ఎనభై పైసలు మాత్రమే)** + వడ్డీ, ఇతర ఖర్చులు, నోటీసు అందిన తేది నుండి 60 రోజులలోగా తిరిగి చెల్లించ వలసినదిగా **తేది. 24-05-2024 న డిమాండ్ నోటీసు** జారీ చేయబడింది.

ఋణగ్రహీత బకాయి సొమ్మును తిరిగి చెల్లించుటలో విఫలమైనందున ఈ దిగువ సంతకందారు సదరు చట్టంలోని సెక్షన్ 13(4)కు అనుబంధమైన సదరు రూల్స్ నందలి రూలు 9 ప్రకారము **తేది. 15-10-2024** న దిగువ పేర్కొన్న ఆస్తిని స్వాధీనము చేసుకోవడమైనదని ప్రత్యేకంగా ఋణగ్రహీత మరియు సాధారణ ప్రజానీకమునకు ఇందుమూలముగా తెలియజేయునది.

ఈ ఆస్తి విషయమై ఎవరు ఎటువంటి లావాదేవీలు జరుపరాదని, ఎటువంటి లావాదేవీలైనా యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా వారికి చెల్లించవలసిన బకాయి మొత్తం **రూ. 37,22,521.80/- (అక్షరాలా ముప్పై ఏడు లక్షల ఇరవై రెండు వేల ఐదు వందల ఇరవై ఒక్క రూపాయి ఎనభై పైసలు మాత్రమే)** + ది. 19-01-2010 నుండి తదుపరి వడ్డీ మరియు ఇతర ఖర్చులు, ఛార్జీకి లోబడి వుండునని ఇందు మూలముగా ప్రత్యేకించి ఋణగ్రహీతలు మరియు సాధారణ ప్రజానీకానికి హెచ్చరించడమైనది.

తనఖా పెట్టిన సదరు ఆస్తుల విమోచనకు ఋణగ్రహీతలు వారికి నిర్దేశించిన కాల వ్యవధి సదరు చట్టములోని సెక్షన్ 13కు అనుబంధమైన సబ్ సెక్షన్ (8) ప్రకారం కలిగియుందురనీ తెలియజేయడమైనది.

స్థిరాస్తి వివరములు

శ్రీమతి మాకినేని ఉషారాణి గారి పేరిట గుంటూరు జిల్లా, మంగళగిరి మండలం మరియు సబ్ రిజిస్ట్రీ, నవులూరు గ్రామం మరియు గ్రామ పంచాయితీ, సర్వే నెం. 353/ఎఫ్ (పి) మరియు జి (పి), సమీప డోర్ నెం. 4-436, ఫ్లాట్ నెం. 205 కి చెందిన 500 చ॥గ॥ల విస్తీర్ణంలోని ఖాళీ నివాస స్థలము. **ఆస్తికి హద్దులు : తూర్పు :** ప్లాట్ నెం. 206, **దక్షిణం :** ప్లాట్ నెం. 218, **పడమర :** ప్లాట్ నెం. 204, **ఉత్తరం :** 40 అ॥ వెడల్పు రోడ్డు.

తేది : 15-10-2024
స్థలం : గుడివాడ

సం/- అధీకృత అధికారి,
యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా

బస్సుయాత్రలో ప్రసంగిస్తున్న సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు వి.రాంభూపాల్

ఆయకట్టుకు నీరివ్వడంలో నిర్లక్ష్యం

- ఎన్నికల హామీల అమల్లో ప్రభుత్వం విఫలం : వి రాంభూపాల్
- అనంతలో 2వ రోజు 'సాగునీటి కోసం సిపిఎం బస్సుయాత్ర'

ప్రజాశక్తి-కళ్యాణదుర్గం, ఉరవకొండ (అనంతపురం జిల్లా)

కరువు జిల్లా అనంతపురంలో ఆయకట్టుకు నీరివ్వకుండా ప్రభుత్వాలు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నాయని సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వి.రాంభూపాల్ అన్నారు. అనంతపురం జిల్లాలో సాగునీటి కోసం సిపిఎం చేపట్టిన బస్సు యాత్ర రెండో రోజు బుధవారం కళ్యాణదుర్గం, ఉరవకొండ, వజ్రకరూరు, ఉరవకొండ మండలాల్లో సాగింది. ఆయా గ్రామాల్లో సాగునీటి కాలువలను నాయకులు పరిశీలించి ప్రజలు, రైతులతో మాట్లాడారు. కళ్యాణదుర్గం పట్టణంలో సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు అచ్యుత్ ప్రసాద్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో రాంభూపాల్ మాట్లాడుతూ.. అనంతపురం జిల్లాలో ఆయకట్టుకు సాగునీటిని అందించేందుకు అవకాశం ఉన్నా పాలకులు అటువైపు దృష్టి సారించకపోవడం విచారకరమని అన్నారు. ప్రభుత్వాలు, పాలకులకు ముందుచూపు లేకపోవడంతో పొలాలకు వెళ్లాల్సిన నీరు వృథాగా సముద్రంలోకి వెళ్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ నీటిని సక్రమంగా వాడుకుంటే జిల్లాలోని అన్ని చెరువులనూ నీటితో నింపొచ్చని తెలిపారు. ఉంతకల్లు రిజర్వాయర్‌ను పూర్తి చేసి హెచ్‌ఎల్‌సి ఎగువ కాలువకు నీరివ్వాలని, జీడిపల్లి నుంచి బీటీపి ప్రాజెక్టు ఎత్తిపోతల పథకం పనులను వెంటనే ప్రారంభించాలని డిమాండ్ చేశారు. భైరవానితిప్ప ప్రాజెక్టుకు 4.90 టిఎంసిల కేటాయింపులున్నా నీరు రాని పరిస్థితి ఉందని తెలిపారు. భైరవానితిప్ప పరిధిలో కాలువల కింద భూములు కోల్పోయిన రైతులకు పరిహారం అందించి వెంటనే ప్రాజెక్టును పూర్తి స్థాయి నీటితో నింపాలని డిమాండ్ చేశారు. జిల్లాలో గ్రామీణ ఆర్థిక శాఖ మంత్రి ఉన్నారని, ఆయన స్పందించి ప్రాజెక్టు అభివృద్ధికి అవసరమైన నిధులను తీసుకురావాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు బాల రంగయ్య, జిల్లా కమిటీ సభ్యులు కృష్ణమూర్తి, నాగమణి, చంద్రశేఖర్, ఆయా మండలాల నాయకులు, రైతులు పాల్గొన్నారు.

యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా
भारत सरकार का उपक्रम

బెంజ్ సర్కిల్ శాఖ, సితారా టవర్స్, యన్.సి.బి.యన్. కాలని, విజయవాడ-10 ఫోన్: 9326716091
Mail:ubin0816094@unionbankofindia.bank

డిమాండ్ నోటీస్

సెక్యూరిటైజేషన్ అండ్ రికన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్సియల్ ఎసెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటి ఇంటరెస్ట్ యాక్ట్ 54 ఆఫ్ 2002

ఋణగ్రహీత మరియు హామీదారు పేరు మరియు చిరునామా : 1) **శ్రీమతి చెరుకూరి శిరీష, తండ్రి. గోవింద రామయ్య,** 64-9-8/5, ఎయిర్‌టెల్ టవర్స్ దగ్గర, పటమట లంక, విజయవాడ-10, 2) **శ్రీమతి చెరుకూరి శిరీష, తండ్రి. గోవింద రామయ్య,** 12-187, ఆదర్శ్ నగర్, ఐడిపియల్ కాలని ఎదురుగా, హైదరాబాద్-500037 3) **శ్రీమతి చెరుకూరి రత్నకుమారి, భర్త. గోవింద రామయ్య,** 64-9-8/5, ఎయిర్‌టెల్ టవర్స్ దగ్గర, పటమట లంక, విజయవాడ-10, 4) **శ్రీమతి చెరుకూరి రత్నకుమారి, భర్త. గోవింద రామయ్య,** 12-187, ఆదర్శ్ నగర్, ఐడిపియల్ కాలని ఎదురుగా, హైదరాబాద్-500037

స్థిరాస్తి వివరము: కృష్ణా జిల్లా (ప్రస్తుతం ఎన్.టి.ఆర్ జిల్లా.), విజయవాడ రిజిస్ట్రార్ జిల్లా, గుణదల, గుణదల సబ్-రిజిస్ట్రార్ ప్రాంతం, విజయవాడ మున్సిపల్ కార్పొరేషన్ ప్రాంతం, విజయవాడ టౌన్‌లో ఆర్.యస్ నెం.394/1, 393/1 MW No.33 కలిగి మొత్తం 635 చ.గ.లలో 508 చ.గ.ల విస్తీర్ణంలో ల్యాండ్ & భవనం అసెస్‌మెంట్ నెం.40544సి (పాతది), అసెస్‌మెంట్ నెం.294394(కొత్తది), డోర్ నెం.54-16-20/10, తూర్పు వైపు భాగం వైడ్ రెజిడ్. సేల్ డీడ్ నెం.3672/1978 & 3430/1978 SRO విజయవాడ.దీనికి హద్దులు: **తూర్పు:** జాతీయ రహదారి ఫీడర్ రోడ్డు, **దక్షిణం:** పునుకోలు సూర్య నారాయణకి అమ్మిన ఆస్తి, **పడమర:** సెంట్రల్ ఎక్సైజ్ కాలని ప్లాట్ నెం.3లో వై. రవి మరియు ఇతరులకు అమ్మిన ఆస్తి, **ఉత్తరం:** మున్సిపల్ కార్పొరేషన్ రోడ్.

అమ్మ / అయ్యా.
విషయం: సెక్యూరిటీ ఇంట్రెస్ట్ యాక్షన్ నోటీసు అమలు - మీరు మాతో అనుభవిస్తున్న క్రెడిట్ సౌకర్యాలకు సంబంధించి నిరర్ధక ఆస్తిగా వర్గీకరించబడింది.

ఇందుమూలముగా మీకు తెలియజేయునది ఏమనగా బెంజి సర్కిల్ శాఖ వారి నుండి పొందిన ఎడుకేషన్ లోన్-560711000020801 ఋణమంజూరు-రూ.20 లక్షలు, ఋణమును బకాయి / వడ్డీ / ఇన్‌స్టాల్‌మెంట్ తిరిగి చెల్లించుటలో విఫలమైనందున నిరర్ధక ఆస్తిగా వర్గీకరించబడింది. అనేక మార్లు విన్నపములు చేసినప్పటికీ, మీరు బకాయి చెల్లించుటలో విఫలమైనారు. మీ ఖాతాలోని బకాయి మొత్తములను చెల్లించలేదు / మీ ఋణములను చెల్లించలేదు. కావున మీ ఖాతాను ఎన్.పి.ఏ (నిరర్థక ఆస్థి) అయ్యింది.

సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ ఎసెట్స్ & ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ ఆర్డినెన్స్, 2002 యొక్క సెక్షన్ 13(2) ప్రకారము మీ యొక్క బకాయి రూ.8,20,557.25పై (ఎనిమిది లక్షల ఇరవై వేల ఐదు వందల యాభై ఏడు మరియు ఇరవై ఐదు పై.) మరియు ఋణ పత్రములో అంగీకరించబడిన నియమ నిబంధనలలో ఉన్న ఒప్పందపు రేటు ప్రకారము తేది: 29-04-2024 తెలుపబడిన ఋణం రాబట్టుటకు + చార్జ్ చేయని వడ్డీ + ఇతర ఛార్జీలు + ముగింపు తేది వరకు జేబు ఖర్చులతో సహ ఈ నోటీసు అందిన 60 రోజులలోగా చెల్లించవలసి ఉంటుందని, అట్లు చేయుటలో విఫలమైనచో మీరు మా బ్యాంక్‌కు హామీ ఇచ్చిన ఆస్తులపై సదరు చట్టం ప్రకారం లభించు ఏవేని లేద అన్ని హక్కులను ప్రయోగించవలసి ఉంటుందని తెలియజేయడమైనది. మీరు పైన ఉదహరించిన బకాయిని 60 రోజులలో లోపల తిరిగి చెల్లించని యెడల బ్యాంకు వారు సదరు చట్టంలోని అన్ని హక్కులను ఉపయోగించి మరియు అమ్మకము జరిగిన తరువాత పూర్తి బకాయి చెల్లించుటలో విఫలమైన బ్యాంకు వారు కోర్టు ఆఫ్ లా/డెబ్ట్ రికవరి ట్రిబ్యూనల్ ద్వారా మిగిలిన బకాయిని చట్టరీత్య వసూలు చేయబడును. సదరు చట్టం యొక్క సెక్షన్ 13(13) ప్రకారము ఈ నోటీసు అందిన నుండి మీరు పైన చెప్పబడిన ఆస్తిని సాధారణ వ్యాపార కార్యకలాపాలు తప్ప బ్యాంకు వారి అనుమతి లేకుండా విక్రయించరాదు, మరియు లావాదేవిలు జరుపరాదు, సదరు సెక్షన్ నిబంధనల అతిక్రమణ జరిగితే తీవ్ర పరిణామాలకు దారి తీస్తుందని గమనించగలరు.

SARFAESI చట్టంలో సెక్షన్ 13 యొక్క సబ్ సెక్షన్ (8) ప్రకారము ఋణగ్రహీత తనఖా ఆస్తిని గడువు లోపల విడిపించుకొనుటకు దృష్టిసారించవలసి ఉన్నది.

తేది.03-05-2024న జారీచేసిన డిమాండ్ నోటీసు పరిగణించబడదు

తేది : 24-09-2024
ప్రదేశం : విజయవాడ

సం/- అధీకృత అధికారి
యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా

డిమాండ్ నోటీసు

ఈడెల్‌వీస్ అస్సెట్ రీకన్‌స్ట్రక్షన్ కంపెనీ లిమిటెడ్
సిఐఎన్: U67100MH2007PLC174759
రిటైల్ సెంట్రల్ మరియు నమోదిత కార్యాలయం: ఈడెల్‌వీజ్ హౌజ్, ఓఎఫ్‌ఎఫ్ సిఎస్‌టి రోడ్డు, కలిన, ముంబాయి 400098.

సెక్యూరిటీ ఇంట్రస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002 యొక్క రూల్ 3 (1)తో చదువుతూ సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అస్సెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంట్రస్ట్ యాక్ట్, 2002 ("ది యాక్ట్") యొక్క సెక్షన్ 13(2) క్రింద డిమాండ్ నోటీసు.

దిగువసంతకందారు అయిన ఈడెల్‌వీస్ అసెట్ రీకన్‌స్ట్రక్షన్ కంపెనీ లిమిటెడ్ ("ఇఎఆర్‌సి") యొక్క అధీకృత అధికారి అయిన దిగువసంతకందారుడు సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002 యొక్క రూల్ 3 తో చదువుతూ సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అస్సెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంట్రస్ట్ యాక్ట్, 2002 యొక్క సెక్షన్ 13(12) క్రింద సదరు అధికారాలను అధ్యాయనం చేస్తూ దిగువ ఇచ్చిన వారికి సంబంధిత డిమాండ్ నోటీసులో పేర్కొన్న మొత్తం తిరిగిచెల్లించుటకు దిగువ రుణగ్రహీత(లు) పిలుస్తూ చట్టం యొక్క సెక్షన్ 13 (2) క్రింద డిమాండ్ నోటీసు జారీ చేయబడింది. పై దానిని అనుసరించి, మరొకసారి నోటీసు ఇవ్వడమేమనగా, ఇఎఆర్‌సి చెల్లించుటకు రుణగ్రహీతలకు, ఈ నోటీసు ప్రచురణ తేది నుండి 60 రోజులలోపల చెల్లించాలని తెలుపడమైనది, ఇక్కడ మొత్తాలు దిగువ పేర్కొనబడ్డాయి, సదరు డిమాండ్ నోటీసులో వివరణాత్మక తదుపరి వడ్డీతో కలిపి, చెల్లింపులు/లేదా తెలిసిన మేరకు తేది(ల) నుండి దిగువ పేర్కొన్న తేది వరకు, ఇతర పత్రాలు/వ్రాసిన వాటితో ఇతర ఒప్పందాలు చదువుతూ రుణం క్రింద చెల్లించబడతాయి, ఏవైనా, సదరు రుణగ్రహీత(లు) ద్వారా అమలుచేయబడతాయి. రుణం యొక్క చెల్లింపు వలన సెక్యూరిటీగా, సదరు రుణగ్రహీత(లు) ద్వారా ఇఎఆర్‌సికి తనాఖపెట్టిన దిగువ ఆస్థి, రుణం యొక్క బకాయి తిరిగిచెల్లింపునకు సెక్యూరిటీగా.

క్ర సం	రుణగ్రహీత(లు)/సహా-రుణగ్రహీత(లు) పేరు/ లోను ఖాతా నంబర్	డిమాండ్ నోటీసు తేది మరియు మొత్తం	ట్రస్ట్ వివరాలు మరియు అసైనర్
1.	1. శ్రీ. రెహ్మాతుల్లా మహమ్మద్ ("రుణ గ్రహీత") 2. శ్రీమతి. మహమ్మద్ రిహాన ("సహ-రుణగ్రహీత") లోన్ ఎకౌంట్ నం.: HM/0219/H/17/100132	23-08-2024 and Rs. 8,00,729.31	ఇఎఆర్‌సి ట్రస్ట్ ఎస్‌సి 484 మరియు పూనావాల హౌసింగ్ ఫైనాన్స్ లిమిటెడ్ (గతంలో మాగ్మా హౌసింగ్ ఫైనాన్స్ లిమిటెడ్‌గా పేర్కొనబడింది)
	ఆస్తి వివరణ: గుంటూరు జిల్లా, తెనాలి రిజిస్ట్రేషన్ జిల్లా, తెనాలి పశ్చిమ ఉపజిల్లా, కటేవరం శివారు, తేలప్రోలు గ్రామ పంచాయతీ ఏరియా, కటేవరం గ్రామం, డో.నం.827/1, డో.నం.17-116 కవర్‌చేయబడిన విస్తీర్ణం ఎ.లు. 0.81 సెంట్లు., మరియు ఆర్.సి.సి. దాబా ఇంటి బయట విస్తీర్ణం 77 1/2 చ.గ.లు. **హద్దులు : తూర్పు :** గాలిబ్ బీ ఆస్తి, **దక్షిణం :** షేక్ అలి ఆస్తి, **పడమర :** పంచాయతీ బజారు, **ఉత్తరం :** షేక్ జాని ఆస్తి. ఈ సరిహద్దుల కవరింగ్ పరిధిలో 77 1/2 చ.గ.లు. (లేదా) 64-77 చ.మీ.లు. ఆర్‌సిసి దాబా ఇంటితో దానిపై ఇప్పటికే ఉన్న నిర్మాణం.		
2	1. శ్రీమతి. షేక్ ఫాతిమున్నిసా ("రుణగ్రహీత") 2. శ్రీ. షేక్ సయ్యద్ బాజి ("సహ-రుణగ్రహీత") లోన్ ఎల్ఎఎన్ : HL/0053/H/16/100020	03-09-2024 and Rs. 4,85,048.95	ఇఎఆర్‌సి ట్రస్ట్ ఎస్‌సి 484 మరియు పూనావాల హౌసింగ్ ఫైనాన్స్ లిమిటెడ్ (గతంలో మాగ్మా హౌసింగ్ ఫైనాన్స్ లిమిటెడ్‌గా పేర్కొనబడింది)
	ఆస్తి వివరణ : కృష్ణాజిల్లా, మచిలీపట్నం డిఓ సబ్ రిజిస్ట్రీ, రాజుపేట, పాత వార్డు నం.3, మున్సిపల్ వార్డు నం.4, మూల్యాంకనం నం.1070014350, పాత డో.నం.4/690, షెడ్ అందులో బేరింగ్ డో.నం.4/690-1 తో సైట్ మొత్తం ఆ ముక్క మరియు పార్శిల్ ఆస్తి పరిధి 168.8 చ.గ.లు. (141.210 చ.మీ.లు.) **ఉన్న హద్దులు : తూర్పు :** షేక్ అమీర్ ఇల్లు, **దక్షిణం :** లేన్, **పడమర :** షేక్ ఉస్మాన్ ఆస్తి, **ఉత్తరం :** చింత హనుమంతరావు ఆస్తి.		
3.	1. శ్రీ. సయ్యద్ జాని (రుణగ్రహీత), 2. శ్రీ.సయ్యద్ మోతి (సహ రుణగ్రహీత) ఎల్ఎఎన్ : HL/0053/H/16/100020	03-09-2024 and Rs. 12,43,121.14	ఇఎఆర్‌సి ట్రస్ట్ ఎస్‌సి 492 మరియు పూనావాల హౌసింగ్ ఫైనాన్స్ లిమిటెడ్ (గతంలో మాగ్మా హౌసింగ్ ఫైనాన్స్ లిమిటెడ్‌గా పేర్కొనబడింది)
	ఆస్తి వివరణ : గుంటూరు జిల్లా, తెనాలి రిజిస్ట్రేషన్ జిల్లా, తెనాలి (పశ్చిమం) ఉపజిల్లా, చుందూరు మండలం, యడ్లపల్లి గ్రామ పంచాయతీ ఏరియా యడ్లపల్లి పంచాయతీ ఏరియా యడ్లపల్లి గ్రామంలో డో.నం.408/ఎ పరిధి వద్ద ఉన్న పేర్కొన్న ఆస్తి మరియు గుంటూరు, తెనాలి (పశ్చిమం) చుందూరు మండలం, యడ్లపల్లి గ్రామ పంచాయతీ ఏరియా యడ్లపల్లి పంచాయతీ ఏరియా యడ్లపల్లి గ్రామంలో డో.నం.408/ఎ స్థిరాస్తి మొత్తం ఆ ముక్క మరియు పార్శిల్ ఆస్తిలో విక్రేత హక్కు మరియు క్రింది విధమైన **హద్దులు : తూర్పు :** పంచాయతీ బజారు-28'-6", **పడమర :** షేక్ అలి సాహెబ్ ద్వారా ఇతరులకు అమ్మబడిన ఆస్తి-28 అ.లు., **ఉత్తరం :** షేక్ మక్తుం ఆస్తి-36'-6", **దక్షిణం :** షేక్ మౌలాలి మొదలైనవారి ఆస్తి -28'-6". ఈ సరిహద్దుల సైట్ పరిధిలో 114 చ.గ.లు. లేదా 95.31 చ.మీ.లు. తో పాటు ఆర్‌సిసి దాబా ఇంటితో 510 చ.అ.లు. తో డో.నం.4-77 మరియు అన్నీ ఇతర సౌకర్యాలు.		

పైన చెప్పిన ఇఎఆర్‌సికి చెల్లించాల్సింది సదరు రుణగ్రహీతలు విఫలమైనయెడల, ఇఎఆర్‌సి చట్టం యొక్క సెక్షన్ 13 (4) మరియు వర్తించే నియమాలు క్రింద పై సెక్యూర్డ్ అస్సెట్స్ ఎదురుగా ముందుకు సాగును మొత్తం సదరు రుణగ్రహీత(లు) వ్యయాలు మరియు పరిణామాలకు బాధ్యత వహించాల్సి ఉంటుంది. రుణగ్రహీతలు సదరు ఆస్తులను విక్రయించుట, లీజు లేదా వేరే ఏ రకంగాను ఇఎఆర్‌సిని ముందస్తుగా సంప్రదించకుండా చేయుట చట్టం క్రింద నిషేదంచడమైనది. ఎవరైనా వ్యక్తి ఉల్లంఘించిన లేదా ప్రేరేపించిన చట్టం లేదా పొందుపరిచిన నియమాల యొక్క నిబంధనలు ఉల్లంఘించిన, చట్టం క్రింద జైలు శిక్ష మరియు/లేదా జరిమానా విధించబడును.

తేది: 17.10.2024
ప్రదేశం: ముంబై

సం/- అధీకృత అధికారి
ఈడెల్‌వీస్ అస్సెట్ రీకన్‌స్ట్రక్షన్ కంపెనీ లిమిటెడ్ తరపున

Edelweiss
Asset Reconstruction

ఎస్ఎమ్ఎఫ్‌జి ఇండియా హోమ్ ఫైనాన్స్ కంపెనీ లిమిటెడ్
(గతంలో ఫుల్లెర్టన్ ఇండియా హోమ్ ఫైనాన్స్ కంపెనీ లిమిటెడ్)

SMFG Grihashakti
Nayi Asha. Naya Vishwas.

కార్పొరేట్ ఆఫీసు : 503 మరియు 504, 5వ అంతస్తు, జి-బ్లాక్, ఇన్స్‌పైర్ బికెసి, బికెసి మెయిన్ రోడ్డు, బాంద్రా కుర్లా కాంప్లెక్స్, బాంద్రా (ఈ), ముంబై-400 051, ఎమ్ హెచ్.
నమోదిత కార్యాలయం : మేఫ్ టవర్స్, 3వ అంతస్తు, పాత నం. 307, కొత్త నం.165, పూనమల్లీ హైరోడ్, మదురావోయల్, చెన్నై-600 095, తమిళనాడు

స్థిరాస్తుల అమ్మకం కొరకు విక్రయ నోటీసు

సెక్యూరిటీ ఇంట్రస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002 యొక్క రూల్ 9(1) నిబంధనలతో చదువుతూ సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంట్రస్ట్ యాక్ట్, 2002 క్రింద స్థిరాస్తుల అమ్మకం కొరకు 15 రోజుల ఇ వేలం విక్రయ నోటీసు.

ప్రత్యేకంగా రుణగ్రహీతలు మరియు హామీదారులు మరియు సాధారణ ప్రజలకు నోటీసు ఇవ్వడమేమనగా, సెక్యూర్డ్ క్రెడిటార్ కు తనఖా/ఛార్జ్ చేయబడిన క్రింద వివరించిన స్థిరాస్తులను **ఎస్ఎమ్ఎఫ్‌జి ఇండియా హోమ్ ఫైనాన్స్ కంపెనీ లిమిటెడ్ (గతంలో ఫుల్లెర్టన్ ఇండియా హోమ్ ఫైనాన్స్ కంపెనీ లిమిటెడ్)** యొక్క అధీకృత అధికారి స్వాధీనం చేసుకోవడం జరిగింది. క్రింద పేర్కొన్న తేదీ మరియు సమయంలో **"ఏది ఉంటే అదే" "ఏమి ఉన్నాయో వాటినే" మరియు "ఎక్కడ ఉన్నాయో అక్కడే"** సెక్యూర్డ్ క్రెడిటార్ ద్వారా విక్రయించబడును. రియలైజేషన్ తేది వరకు క్రింద పేర్కొన్న బకాయిల రికవరీ కొరకు దానిపై తదుపరి వడ్డీ మరియు ఇతర ఖర్చులు.

క్ర. సం.	రుణగ్రహీతలు / హామీదారుల పేరు	ఆస్తుల వివరణ	రిజర్వు ధర (రూ.లో) / బయానా మొత్తం (రూ.లో)	ఇ-వేలం తేది మరియు సమయం	ఇఎమ్‌డి సమర్పణ తేది
01.	లోన్ ఎకౌంట్ నం.: 605739510990293 1. పీట్ల అంజలి, తండ్రి. వెద్ద చిన్న అంజనప్ప, 2. పీట్ల సతీష్	గుంటూరు జిల్లా, చేబ్రోలు గ్రామ పంచాయతీ ఏరియా మరియు సబ్ రిజిస్ట్రీ, పాతరెడ్డిపాలెం, బ్లాక్ నం.12, మూల్యాంకనం నం.1942, డో.నం.22-142 అందులో భవనంతో పాటు సైట్ ఆస్తి బేరింగ్ పరిధి 435.6 చ.గ.లు. లేదా 364.21 చ.మీ.లు. ఉన్న **హద్దులు : తూర్పు :** పంచాయతీ బజారు, **దక్షిణం :** పి.నల్లయ్య ఆస్తి, **పడమర :** పంచాయతీ బజారు, **ఉత్తరం :** పంచాయతీ బజారు.	18,20,000/- / 1,82,000/-	05.11.2024 at 11.00 a. m. to 01.00 p. m.	04.11.2024

అమ్మకం యొక్క షరతులు మరియు నిబంధనల వివరాలు ఇక్కడ క్రింద మరియు అందించిన మా/క్రింది విధమైన లింక్ వద్దసెక్యూర్డ్ క్రెడిటార్స్ వెబ్‌సైట్/వెబ్‌సైట్ చిరునామా **(https://disposalhub.com and https://www.grihashakti.com/pdf/E-Auction.pdf)** వివరాలు కూడా. ఉద్దేశించిన బిడ్డర్లు ఇక్కడ కూడా సంప్రదించవచ్చు : **కానూరి ఉమా శంకర్, అతని మొబైల్ నం.: 9848102052, ఇ మెయిల్ : kaanoori.shankar@grihashakti.com, శ్రీ నిలోయ్ దే, అతని మొబైల్ నం.: 9920697801, ఇ మెయిల్ : niloy.dey@grihashakti.com**

సం/-

తేది : 15.10.2024
ప్రదేశం : గుంటూరు, ఆంధ్రప్రదేశ్

అధీకృత అధికారి, ఎస్ఎమ్ఎఫ్‌జి ఇండియా ఫైనాన్స్ కంపెనీ లిమిటెడ్
(గతంలో ఫుల్లెర్టన్ ఇండియా హోమ్ ఫైనాన్స్ కంపెనీ లిమిటెడ్)

ఎస్‌సిఇఆర్‌టిలో అధ్యాపక పోస్టుల భర్తీ

- డిప్యూటేషన్ విధానంలో దరఖాస్తుల ఆహ్వానం

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పరిశోధన విద్యామండలి (ఎస్‌సిఇఆర్‌టి)లో అధ్యాపక పోస్టులను డిప్యూటేషన్ విధానంలో పాఠశాల విద్యాశాఖ భర్తీ చేయనుంది. ఇందుకు సంబంధించిన నోటిఫికేషన్‌ను పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ వి విజయరామరాజు బుధవారం విడుదల చేశారు. 9 ప్రొఫెసర్ పోస్టులు, 20 లెక్చరర్ పోస్టులు, 5 కోఆర్డినేటర్, స్పెషల్ ఎడ్యుకేటర్ పోస్టులు భర్తీ చేయనున్నారు. ఉపాధ్యాయ విద్య కళాశాలల(సిటిఇ)లో లెక్చరర్, డైట్ కళాశాల లెక్చరర్ పోస్టులకు ప్రభుత్వ, జిల్లా పరిషత్ పాఠశాలల్లో పనిచేస్తున్న ప్రధానోపాధ్యాయులు దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు. 010 పద్దు కింద జీతాలు తీసుకునేవారు అర్హులని తెలిపారు. . 2024 సెప్టెంబర్ 28 నాటికి కనీసం ఐదేళ్ల బోధన అనుభవం ఉండి 55ఏళ్లు దాటని వారు అర్హులుగా తెలిపారు. ఈ నెల 16వ తేదీ నుంచి 25వ తేదీ వరకు పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ కార్యాలయంలో సంబంధిత అధికారికి దరఖాస్తు అందించాలని పేర్కొన్నారు. వచ్చిన దరఖాస్తులను పరిశీలించి 28 నుంచి 30వ తేదీ మధ్య అర్హుల జాబితా విడుదల చేస్తామని తెలిపారు. నవంబర్ 4,5 తేదీల్లో ఎంపికైన వారికి ఇంటర్వ్యూలు ఉంటాయని వెల్లడించారు.

మున్సిపల్ ఉపాధ్యాయులకు అవకాశం కల్పించాలి: యుటిఎఫ్

ఎస్‌సిఇఆర్‌టిలో డిప్యూటేషన్‌పై పనిచేసే అవకాశం మున్సిపల్ పాఠశాలల్లో పనిచేసే ఉపాధ్యాయులకు కూడా కల్పించాలని యుటిఎఫ్ కోరింది. ప్రభుత్వ, జిల్లా పరిషత్ పాఠశాలల ఉపాధ్యాయులకు మాత్రమే అర్హులని నిబంధన విధించడం సరికాదని ఫెడరేషన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎన్ వెంకటేశ్వర్లు, కెఎస్ఎస్ ప్రసాద్ ఒక ప్రకటనలో అభ్యంతరం వ్యక్తం చేశారు. మున్సిపల్ ఉపాధ్యాయులు కూడా పాఠశాల విద్య పరిధిలోకి తీసుకొచ్చిన విషయాన్ని మర్చిపోయారని విమర్శించారు. 010 పద్దు కింద జీతాలు తీసుకునేవారు అర్హులని ఒకవైపు చెప్తూనే మరోవైపు ఈ ఉపాధ్యాయులను మినహాయించడం సరికాదని తెలిపారు. వెంటనే నోటిఫికేషన్‌లో సవరణ చేసి అర్హత కలిగిన మున్సిపల్ ఉపాధ్యాయులకు కూడా అవకాశం ఇవ్వాలని డిమాండ్ చేశారు.

భౌతిక స్వాధీనతా ప్రకటన

ICICI Home Finance

రిజిష్టర్డు ఆఫీసు: ఐసిఐసిఐ బ్యాంక్ టవర్స్, బాంద్రా-కూర్ల కాంప్లెక్స్, బాంద్రా(ఈస్ట్) ముంబయి-400051
కార్పొరేట్ ఆఫీసు: ఐసిఐసిఐ హెచ్ఎఫ్‌సి టవర్, జెబి నగర్, ఆంధేరి కూర్ల రోడ్, ఆంధేరి ఈస్ట్, ముంబయి-400059
బ్రాంచ్ ఆఫీసు: 2వ అంతస్తు, 40-1-129/1, ఆర్‌సిసి బిల్డింగ్, మహాత్మాగాంధీ రోడ్, చంద్రమౌళిపురం, విజయవాడ-520010

ఏదైతే,
క్రింది సంతకందారులు ఐసిఐసిఐ హోమ్ ఫైనాన్స్ కంపెనీ లిమిటెడ్ యొక్క అధీకృత అధికారిగా, సెక్యూరిటైజేషన్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్, 2002 క్రింద మరియు సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్ 2002 యొక్క రూల్ 3తో చదవగల సెక్షన్ 13(12) క్రింద సంక్రమించిన అధికారాలతో సదరు నోటీసు స్వీకరణ తేదీ నుండి 60 రోజుల్లోగా నోటీసులో పేర్కొన్న మొత్తాలను తిరిగి చెల్లించవలసిందిగా కోరుతూ దిగువ పేర్కొన్న రుణగ్రహీతలకు డిమాండ్ నోటీసులు జారీచేయబడినవి.
రుణగ్రహీత బకాయి మొత్తాలను తిరిగిచెల్లించుటలో విఫలం చెందినకారణంగా, ఇందుమూలంగా రుణగ్రహీత మరియు సాధారణ ప్రజలకు నోటీసు ఇవ్వడమేమనగా, దిగువ-పేర్కొన్న తేదీలలో సదరు రూల్స్ యొక్క రూల్ 8తో చదువగల సదరు చట్టంలోని సెక్షన్ 13(4) క్రింద అతనికి/ఆమెకు సంక్రమించిన అధికారాలతో క్రింది సంతకందారు దిగువ వివరించిన ఆస్తిని స్వాధీనం చేసుకొన్నారు. ప్రధానంగా రుణగ్రహీత మరియు సాధారణ ప్రజలను ఇందుమూలంగా హెచ్చరించడమేమనగా, సదరు ఆస్తితో లావాదేవీలు జరుపరాదని మరియు ఏదేని లావాదేవీలు జరుపదలచిన వారు ఐసిఐసిఐ హోమ్ ఫైనాన్స్ కంపెనీ లిమిటెడ్ వారికి చెల్లించుటకులోబడి ఉంటుందని తెలియజేయనైనది.

క్ర. సం.	రుణగ్రహీత /సహ-రుణగ్రహీత పేరు / రుణ ఖాతా నెంబరు	ఆస్తి వివరణ/ స్వాధీనం చేసుకొన్న తేది	డిమాండ్ నోటీసు తేది/ డిమాండ్ నోటీసులోని మొత్తం (రూ.)	బ్రాంచ్ పేరు
1.	మామిడిపాక వెంకటరావు (రుణగ్రహీత), అనసూయ మామిడిపాక (సహ-రుణగ్రహీత), LHVJW00001499296.	21 11 7 4డి, మధురానగర్, డోర్ నెం.21 11/7-4డి, ఎన్‌టిఎస్ నెం. 23/2, న్యూ అసిస్ట్ నెం.172639, ప్లాట్ నెం.23, సాయి బాబా కాలనీ, 7వ లేన్, సంగశెట్టి వార్, మధురానగర్ ఎన్‌టిఆర్ జిల్లా, ఆం.ప్ర, మధురా నగర్ 23 2 విజయవాడ ఆంధ్రప్రదేశ్-520015. (రిఫరెన్స్ లాన్ నెం. LHVJW00001499296). సరిహద్దులు: ఉత్తరం: ప్లాట్ నెం.22 ఎం ఆస్తి, దక్షిణం: పి వెంకట ఆస్తి, తూర్పు: ప్లాట్ నెం.24 ఎల్ అనురాధ 150, పడమర: బి దుర్గ ఆస్తి మరియు/ స్వాధీనతా తేదీ: 11 అక్టోబర్-2024.	17-11-2023 Rs. 26,73,960/-	విజయవాడ -బి
2.	మామిడిపాక వెంకటరావు (రుణగ్రహీత), అనసూయ మామిడిపాక (సహ-రుణగ్రహీత), LHVJW00001503160.	21 11 7 4డి, మధురానగర్, డోర్ నెం.21 11/7-4డి, ఎన్‌టిఎస్ నెం. 23/2, న్యూ అసిస్ట్ నెం.172639, ప్లాట్ నెం.23, సాయి బాబాకాలనీ, 7వ లేన్, సంగశెట్టి వార్, మధురానగర్ ఎన్‌టిఆర్ జిల్లా, ఆం.ప్ర, మధురా నగర్ 23 2 విజయవాడ ఆంధ్రప్రదేశ్-520015. (రిఫరెన్స్ లాన్ నెం. LHVJW00001503160). సరిహద్దులు: ఉత్తరం: ప్లాట్ నెం.22 ఎం ఆస్తి, దక్షిణం: పి వెంకట ఆస్తి, తూర్పు: ప్లాట్ నెం.24 ఎల్ అనురాధ 150, పడమర: బి దుర్గ ఆస్తి మరియు/ స్వాధీనతా తేదీ: 11 అక్టోబర్-2024.	17-11-2023 Rs. 1,15,411.62/-	విజయవాడ -బి

ఇందుమూలంగా పైన పేర్కొన్న రుణగ్రహీత(లు)/ హామీదారు(ల)కు బాకీ మొత్తాలను తిరిగి చెల్లించవలసిందిగా 30 రోజుల ప్రకటన ఇవ్వబడుతుంది, లేనిచో సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్ 2002 యొక్క రూల్ 8 మరియు 9 క్రింద నియమాల ప్రకారం, ఈ నోటీసు ప్రచురణ తేదీ నుండి 30 రోజులు ముగిసిన తరువాత సదరు తాకట్టుపెట్టిన ఆస్తులు విక్రయించబడును.

తేది: అక్టోబర్ 17, 2024, ప్రదేశం: విజయవాడ
అధీకృత అధికారి, ఐసిఐసిఐ హోమ్ ఫైనాన్స్ కంపెనీ లిమిటెడ్

శంకరన్ జయంతి, వర్ధంతులను ప్రభుత్వమే నిర్వహించాలి

- శంకరన్ మెమోరియల్ కమిటీ కన్వీనర్ జల్లి విల్సన్ విజ్ఞప్తి

ప్రజాశక్తి - విజయవాడ

నిరుపేదల అభ్యున్నతి కోసం అనేక సంక్షేమ పథకాలను రూపొందించి వాటి అమలుకు పాటుపడిన ఆదర్శనీయులు మాజీ ఐఎఎస్ అధికారి ఎస్ఆర్.శంకరన్ జయంతి, వర్ధంతి కార్యక్రమాలను రాష్ట్ర ప్రభుత్వమే నిర్వహించాలని ఎస్ఆర్ శంకరన్ మెమోరియల్ కమిటీ కన్వీనర్, మాజీ ఎమ్మెల్సీ జల్లి విల్సన్ విజ్ఞప్తి చేశారు. ఎస్ఆర్.శంకరన్ మెమోరియల్ కమిటీ సమావేశం విజయవాడలోని ఐక్యతా భవన్‌లో బుధవారం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఐక్యతా భవన్‌లో శంకరన్ కాంస్య విగ్రహాన్ని ప్రతిష్టించినప్పటి నుండి క్రమం తప్పకుండా ఆయన జయంతి, వర్ధంతి కార్యక్రమాలను కమిటీ నిర్వహిస్తోందని గుర్తు చేశారు. శంకరన్ వంటి నిబద్ధత, అంకితభావం కలిగిన అధికారిని స్మరించుకోవడం మంచి సంప్రదాయమని తెలిపారు. ఈ నెల 22న శంకరన్ 90 జయంతి నిర్వహించాలని ఈ సమావేశంలో పాల్గొన్న వివిధ దళిత సంఘాల నేతలు, కో కన్వీనర్లు నిర్ణయించారని తెలిపారు. ఈ సమావేశంలో కెవిపిఎస్ రాష్ట్ర కార్యదర్శి అండ్ర మాల్యాద్రి, డిహెచ్‌పిఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కరవది సుబ్బారావు, రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి బుట్టి రాయప్ప, కెవిపిసిఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు పరిశపోగు రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

ఆరుద్ర శత జయంతి సందర్భంగా

18న 'ప్రజా కళలు - సాహిత్యం'పై సభ

ప్రజాశక్తి - విజయవాడ

ఆరుద్ర శత జయంతి సభ ఈ నెల 18వ తేదీ సాయంత్రం 6 గంటలకు ఎన్‌టిఆర్ జిల్లా విజయవాడలోని గవర్నరుపేట బాలోత్సవ్ భవన్ 2వ అంతస్తులో సాహితీ స్రవంతి ఆధ్వర్యాన జరుగుతుందని నిర్వాహకులు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా "ప్రజా కళలు - సాహిత్యం" అన్న అంశంపై ప్రముఖులు మాట్లాడతారని, ప్రధాన వక్తగా సాహితీ స్రవంతి అధ్యక్షులు తెలకపల్లి రవి పాల్గొంటారని తెలిపారు. అధ్యక్షులు కెంగార మోహన్ అధ్యక్షతన జరిగే ఈ కార్యక్రమంలో ఉపాధ్యక్షులు ఎంవిఎస్ శర్మ హాజరవుతారని పేర్కొన్నారు.

ఫారం G
ఆసక్తి వ్యక్తీకరణ కొరకు ఆహ్వానము
M/s.ఈస్ట్ గోదావరి బ్రూవరీస్ ప్రైవేట్ లిమిటెడ్
బ్రూవింగ్ ఇండస్ట్రీలో ఉంది
5-172సి, తిమ్మాపురం, టాటామోటార్స్ దగ్గర, కాకినాడ, ఆంధ్రప్రదేశ్-533005,
(ఇన్సాల్వెన్సీ మరియు బ్యాంక్రప్టసీ బోర్డ్ ఆఫ్ ఇండియా (కార్పొరేట్ వ్యక్తుల కొరకు ఇన్సాల్వెన్సీ తీర్మాన ప్రక్రియ) రెగ్యులేషన్స్, 2016లోని రెగ్యులేషన్ 36ఎ సబ్-రెగ్యులేషన్ (1) క్రింద)

వ.నెం.	సంబంధిత వివరములు	
1.	కార్పొరేట్ డెటార్ పేరు, PAN & CIN / LLP నెం.	M/s.ఈస్ట్ గోదావరి బ్రూవరీస్ ప్రైవేట్ లిమిటెడ్ PAN: AADCE9156H CIN: U15510AP2015PTC096084
2.	రిజిష్టర్డ్ ఆఫీస్ యొక్క చిరునామా	5-172సి, తిమ్మాపురం, టాటామోటార్స్ దగ్గర, కాకినాడ, ఆంధ్రప్రదేశ్-533005.
3.	URL యొక్క వెబ్‌సైట్	NA
4.	స్థిర ఆస్తులు మెజారిటీ ఉన్న స్థలం యొక్క వివరాలు	కార్పొరేట్ డెటార్స్ పేరున ప్రధానమైన స్థిరాస్తులు లేవు
5.	ప్రధాన ఉత్పత్తులు / సేవల యొక్క వ్యవస్థాపించిన సామర్థ్యం	NA
6.	గత ఆర్థిక సంవత్సరంలో విక్రయించబడిన ప్రధాన ఉత్పత్తులు / సేవల పరిమాణం మరియు విలువ	M/s Anheuser Busch InBev ఇండియా లిమిటెడ్ (పూర్వము M/s. SAB మిల్లర్ ఇండియా లిమిటెడ్) బ్రూవింగ్ ఒప్పందాన్ని రద్దు చేయడం వల్ల బ్రూవింగ్ ప్లాంట్ స్థాపించబడలేదు.
7.	ఉద్యోగులు / వర్క్‌మాన్ యొక్క సంఖ్య	Nil
8.	రెండు సంవత్సరాల చివరిగా అందుబాటులో ఉన్న ఆర్థిక నివేదికలు (షెడ్యూళ్లతో) సహా మరిన్ని వివరాలు, రుణదాతల జాబితాలు URLలో అందుబాటులో ఉన్నాయి	ఆసక్తిగల PRA'sలు రిజల్యూషన్ ప్రొఫెషనల్ ఇమెయిల్: egbpl.cirp@gmail.com కు అభ్యర్థన పంపడం ద్వారా పొందవచ్చు.
9.	కోడ్ యొక్క సెక్షన్ 25(2)(h) క్రింద దరఖాస్తుదారుల తీర్మానము కొరకు అర్హత	ఆసక్తిగల PRA'sలు రిజల్యూషన్ ప్రొఫెషనల్ ఇమెయిల్: egbpl.cirp@gmail.com కు అభ్యర్థన పంపడం ద్వారా పొందవచ్చు.
10.	ఆసక్తి వ్యక్తీకరణ స్వీకరణకు ఆఖరి తేది	01-11-2024
11.	ఔత్సాహిక తీర్మాన దరఖాస్తుదారుల తాత్కాలిక జాబితా జారీ తేది	02-11-2024
12.	తాత్కాలిక జాబితాకు అభ్యంతరములు దాఖలు చేయుటకు ఆఖరి తేది	07-11-2024
13.	ఔత్సాహిక తీర్మాన దరఖాస్తుదారుల తుది జాబితా జారీ తేది	08-11-2024
14.	ఔత్సాహిక తీర్మాన దరఖాస్తుదారులకు తీర్మాన ప్లాన్ల కొరకు వినతి మరియు ఇవాల్యుయేషన్ మ్యాట్రిక్స్, ఇన్ఫర్మేషన్ మెమొరాండమ్ జారీ తేది	09-11-2024
15.	తీర్మాన ప్లాన్ల యొక్క దాఖలుకు ఆఖరి తేది	09-12-2024
16.	ఆసక్తి వ్యక్తీకరణను సమర్పించడానికి ఇమెయిల్ ఐడిని ప్రాసెస్ చేయండి	egbpl.cirp@gmail.com

గమనిక: CD యొక్క CIRP వ్యవధి 07-11-2024 నాటికి ముగుస్తుంది. పైన పేర్కొన్న సమయపాలనలు CIRP వ్యవధిని పొడిగించడానికి CoC ఆమోదానికి లోబడి ఉంటాయి మరియు అలాంటి పొడిగింపును మంజూరు చేస్తూ గౌరవనీయులైన NCLT, అమరావతి బెంచ్ యొక్క ఆదేశానికి లోబడి ఉంటాయి.

తేది : 17-10-2024
ప్రదేశం : విజయవాడ

సం/- సిఏ డా.ఇమ్మానేని ఈశ్వరరావు
IBBI/IPA-001/IP-P01224/2018-2019/11943
40-26-22, మొహిద్దీన్ స్ట్రీట్, చంద్రమౌళిపురం, BSNL ఎక్స్ఛేంజ్ ఎదురు, లబ్బీపేట, యమ్‌జి రోడ్డు, యన్‌టిఆర్ జిల్లా, ఆంధ్రప్రదేశ్-520010, ఇండియా.
మొబైల్ నెం. 9951789558 & 924812333
M/s East Godavari Breweries Private Limited (In CIRP)

సంపాదకీయం

పెనం మీద నుండి పొయ్యిలోకి...

ప్రజారోగ్య పరిరక్షణకు అత్యంత కీలకమైన ఔషధాల ధరలు సైతం చుక్కలను దాటి పరుగులు తీస్తున్న తీరు దిగ్భ్రాంతిని కలిగిస్తోంది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం ప్రారంభంలోనే 800 రకాల ముఖ్యమైన ఔషధాలను ధరలను కేంద్ర ప్రభుత్వం పెంచింది. ప్రతి సంవత్సరం చోటుచేసుకునే సాధారణ పెంపుగానే దీనిని అప్పట్లో సమర్థించుకున్న ప్రభుత్వం తాజాగా ఎనిమిది రకాల ఔషధాల ధరలను ఏకంగా 50 శాతం పెంచడానికి అనుమతించింది. ఉబ్బసం, గ్లుకోమా, తలసేమియా, క్షయతో పాటు మానసిక ఆరోగ్య రుగ్మతలతో బాధపడేవారికి అవసరమైన మందులు ఈ జాబితాలో ఉన్నాయి. ఇప్పటికే నిత్యావసర ధరల పెరుగుదలతో దిక్కుతోచక సతమతమౌతున్న దేశ ప్రజానీకానికి కేంద్ర ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయం శరాఘాతంగా మారనుంది. కేంద్ర రసాయనాలు, ఎరువుల మంత్రిత్వ శాఖ పరిధిలో 1997లో ఏర్పాటైన నేషనల్ ఫార్మాస్యూటికల్ ప్రైసింగ్ అథారిటీ (ఎన్.పి.పి.ఎ) సాంకేతికంగా ఔషధాల ధరలను నియంత్రిస్తుంది. 'దేశంలో నెలకొన్న అసాధారణ పరిస్థితుల రీత్యా... ప్రజా ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని... అనివార్య పరిస్థితుల్లో ఈ నిర్ణయం తీసుకున్నట్లు' ధరల పెంపునకు అనుమతిస్తూ ఆ సంస్థ చేసిన ప్రకటన హాస్యాస్పదం! ఉత్పత్తి వ్యయం పెరగడం, ధరల నియంత్రణ చర్యల కారణంగా ఔషధాలను ఉత్పత్తి చేయడం అసాధ్యంగా మారిందంటూ తయారీదారులు భీష్మించుకు కూర్చోవడమే ఎన్.పి.పి.ఎ చెప్పిన 'అసాధారణ పరిస్థితి'! ఔషధాలను అందుబాటులో ఉంచడానికి ధరలను పెంచడానికి అనుమతివ్వడమే 'ప్రజా ప్రయోజనం'. ఇంతకన్నా అడ్డగోలు వాదన మరోటి ఉంటుందా?

1997లో ఎన్.పి.పి.ఎ ఏర్పాటైన తరువాత నుండి ప్రతి ఆర్థిక సంవత్సరం ప్రారంభంలో ధరలను సమీక్షించి పెంపునకూ అనుమతిస్తూనే ఉంది. దీనికోసం ఔషధాలను ప్రభుత్వం షెడ్యూల్డ్, నాన్ షెడ్యూల్డ్ తరగతులుగా విభజించింది. ముఖ్యమైన ఔషధాలను షెడ్యూల్డ్ జాబితాలో చేర్చారు. టోకు ధరల సూచిక ఆధారంగా ప్రతీ సంవత్సరం ప్రభుత్వం వీటి ఎగువ సీలింగ్ ధరను నిర్ణయిస్తుంది. ప్రస్తుతం ఈ జాబితాలో 384 ఔషధాలు, నాలుగు వైద్య పరికరాలు ఉన్నాయి. నాన్ షెడ్యూల్డ్ ఔషధాల ధరలను తయారీదారులే కొన్ని నిబంధనలకు లోబడి నిర్ణయించుకోవచ్చు. షెడ్యూల్డ్ ఔషధాల ధరలను నిర్దేశించిన ప్రమాణాల కన్నా ఎక్కువగా పెంచాలని తయారీదారులు అడిగిందే తడవుగా కేంద్రం తలూపింది. ఎన్.పి.పి.ఎ కున్న ప్రత్యేక అధికారాలను వినియోగించి మరీ ఔషధ తయారీ కంపెనీలకు మేలు చేసింది. ఇలా ఉత్పత్తిదారుల ఒత్తిడికి మోడీ ప్రభుత్వం తలొగ్గడం ఇదే మొదటిసారి కాదు. 2019లోనూ, 2021లోనూ ఆర్థిక సంవత్సరాల మధ్యలో ఈ తరహా నిర్ణయాలనే తీసుకుంది.

గత నెలలో కేంద్ర ప్రభుత్వం విడుదల చేసిన నేషనల్ హెల్త్ అకౌంట్స్ నివేదిక ప్రకారం ఆరోగ్యంపై పెడుతున్న ఖర్చులో మూడో వంతు మందులకు అవుతోందని ఆ నివేదిక పేర్కొంది. ఇన్సూర్ టెక్ ప్లమ్ ఇండియా తాజాగా విడుదల చేసిన గణాంకాల్లో మన దేశంలో వైద్య ద్రవ్యోల్బణం 14 శాతానికి చేరింది. సరైన చర్యలు తీసుకోకపోతే ఇది మరింతగా పెరిగే ప్రమాదం ఉందని ఆ సంస్థ హెచ్చరించింది. ఆన్‌లైన్ బీమా సంస్థ 'పాలసీ బజార్' గణాంకాల ప్రకారం 2019లో 17,900 రూపాయలుగా ఉన్న వార్షిక ఆరోగ్య బీమా పాలసీ ధర ఈ ఏడాది 26,533 రూపాయలకు చేరింది. దీనికి ప్రధాన కారణం ఔషధాల ధరల్లో భారీ పెరుగుదల చోటు చేసుకోవడమేనని ఆ సంస్థ తెలిపింది. పెరుగుతున్న ఔషధాల ధరలు సామాన్యులకు పెనుభారంగా మారుతున్న తీరుకు ఇవి కొన్ని ఉదాహరణలు మాత్రమే! డ్రగ్ ప్రైస్ కంట్రోల్ ఆర్డర్ (డి.పి.సి.ఓ) 1979 ప్రకారం ముఖ్యమైన ఔషధాల ధరలను ప్రభుత్వం నియంత్రించేది. నాణ్యమైన, తక్కువ ధరలకు అవసరమైన మందులను ఉత్పత్తి చేసే ప్రభుత్వ రంగం బలంగా ఉండేది. ఆ పరిస్థితి ప్రస్తుతం మారింది. నయా ఉదారవాద ఆర్థిక సంస్కరణల్లో భాగంగా ప్రభుత్వ రంగాన్ని నీరుగార్చారు. రోగులు వినియోగదారులుగా మారారు. ప్రైవేటు రంగాన్ని నియంత్రించాల్సిన ప్రభుత్వం వారి చేతిలో కీలుబొమ్మగా మారింది. ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ పేరుతో అన్ని నియంత్రణలను ఎత్తివేసింది. కార్పొరేట్, బహుళజాతి ఫార్మా కంపెనీల ఇష్టారాజ్యానికి ఔషధ రంగాన్ని వదిలివేసింది. ఫలితం ఏడాదికేడాదికి పెనం మీద నుండి పొయ్యిలోకి పడ్డట్టుగా సామాన్యుల స్థితి తయారవుతోంది. పేదల మూలుగులు పీల్చి కార్పొరేట్లకు దోచిపెడుతున్న ఆ విధానాలను ప్రతిఘటించడమే ఈ సమస్యకు పరిష్కారం.

మహనీయుల మాట



నిరుద్యోగ సైన్యం నిరంతరం సంసిద్ధంగా ఉంటేనే శ్రమ దోపిడీ యథేచ్ఛగా సాగుతుంది. అందుకే పెట్టుబడిదారీ విధానం ఉన్నంతకాలం నిరుద్యోగం ఉంటుంది.

- కారల్ మార్క్స్

Karl Marx

ప్రజా కవి, మార్క్సిస్టు పరిశోధక భావుకుడు ఆరుద్ర

తెలకపల్లి రవి

విశ్లేషణ

ఆరుద్రతో పోల్చదగిన బహుముఖ ప్రతిభావంతులు చాలా చాలా అరుదుగా వుంటారు. కవి రచయిత, సినిమారంగ ప్రముఖుడు, కాలమిస్టు, చరిత్ర సాహిత్య పరిశోధకుడు, నృత్య కళాశాలలో బోధకుడు, చదరంగంలో ఇంద్రజాలంలో పుస్తకాలు రాసేంత ప్రజ్ఞాశాలి, నలుగైదు భాషలు తెలిసిన వారు, అభ్యుదయ సాహిత్యోద్యమ నాయకుడు...ఈ జాబితాలకు అంతులేదు. అయితే వీటన్నిటికీ ఆధారభూతంగా ఆయన పెట్టుకున్న ప్రామాణిక నిర్దేశం మార్క్సిజమే. సమగ్రమైన ఆ శాస్త్రీయ దృక్పథమే ఆయన ప్రతిభకు ప్రత్యేకత సంతరించిపెట్టింది. విశాఖపట్నంలో 1925 ఆగస్టు 31న పుట్టిన ఆరుద్ర అసలు పేరు భాగవతుల సదాశివ శంకర శాస్త్రి అని అందరికీ తెలుసు. అనేక కలం పేర్లను వాడుతూ చివరకు ఆరుద్రగా స్థిరపడ్డారు. ప్రపంచ సాహిత్యాన్ని క్షుణ్ణంగా అధ్యయనం చేసిన ఆయన విద్యార్హత ఎస్సెస్సెల్సీనే. అసలు చదువంతా పాఠశాలల్లోనూ కళాశాలల్లోనూ గాక గ్రంథాలయాల్లోనే జరిగిందని ఆయన స్వయంగా చెప్పుకున్నారు. తండ్రి నరసింగరావు సాహిత్యాభిలాషి కావడంతో కనిపించిన పుస్తకమల్లా తెచ్చేవాడు. వాటిని కుర్ర ఆరుద్ర ఎప్పటికప్పుడు చదువుతుండేవాడు. మేనమామ మహాకవి శ్రీశ్రీ అప్పటికే విశాఖ రీడింగు రూములో పుస్తకాలన్నీ తాను చదివేసి ఆరుద్రతోనూ చదివించాడు. ఆ విధంగా 13 ఏళ్ల వయసులోనే ఆరుద్ర కవిత్వ రచన మొదలెట్టారు. కొడవటిగంటి కుటుంబరావు ఆయనలో సాహిత్య ప్రతిభకు పదును పెట్టారు. చాగంటి సోమయాజులు మార్క్సిజాన్ని మేధోగతం చేసుకోవడానికి ఉత్ప్రేరకంగా పనిచేశారు. 1942లో సెట్టి ఈశ్వరరావు సిఫార్సుపై ఆరుద్ర కమ్యూనిస్టుపార్టీ సభ్యత్వం స్వీకరించి పార్టీ కార్యకలాపాల్లో పాల్గొన్నారు. తిండి కొరతను నివారించేందుకు దొంగనిల్వలు వెలికి తీసేందుకు ఉద్యమించారు. రెండవ ప్రపంచ యుద్ధంలో జర్మనీ రష్యాపై దాడి చేశాక అందుకు వ్యతిరేకంగా తన వంతు పాత్ర నిర్వహించేందుకై ఆరుద్ర వైమానిక దళంలో చేరారు. ఆనందవాణి పత్రికలో కొలువుతో సహా అనేక మజిలీల తర్వాత మద్రాసులో స్థిరపడి సృజన, పరిశోధన సాగించారు. 1955 ఏప్రిల్‌లో దర్శక దిగ్గజం హెచ్.ఎం.రెడ్డి, శ్రీశ్రీలే సాక్షులుగా అరవై రూపాయల ఖర్చుతో జర్నలిస్టు రామలక్ష్మిని రిజిస్టరు వివాహం చేసుకున్నారు. ఆమె కమ్యూనిస్టు కాకున్నా దంపతులిద్దరూ హేతువాద భావాలనే కొనసాగించారు.

ఆది నుంచి అభ్యుదయ ప్రస్థానం

భావ కవిత్వంతోనో సంప్రదాయ వాదంతోనో బయలుదేరిన కొందరిలా గాక ఆరుద్ర అభ్యుదయ కవిగానే ప్రస్థానం ప్రారంభించారు. కవిత్వంలో టెక్నిక్కు ప్రయోగాలకూ ఆధునికతకూ ఎక్కువ ప్రాధాన్యతనిచ్చారు. శ్రీశ్రీ మార్క్సిజాన్ని 'పరస్పరం సంఘర్షించిన శక్తులలో చరిత్ర పుట్టెను' అంటూ కవితాత్మకంగా చెబితే ఆరుద్ర 'పైథాగరస్ తీరం చేరుస్తుంది' అంటూ ఎసి స్క్వయర్ బిసి స్క్వయర్ భాషలో మలచడానికి ప్రయత్నించారు. గాయాలూ గేయాలూ, సాహిత్యోపనిషత్, (ఛందస్సు లేని) ఇంటింటి పద్యాలు, కూనలమ్మ పదాలు, సినీ వాలి, పైలా పచ్చీసు, అమెరికా ఇంటింటి పజ్యాలు తదితర రచనలను పరిచయం చేశారు. నాట్యశాస్త్రంలోని హస్త ముద్ర లక్షణ పదాలు మరో ప్రత్యేక రచన. ఆరుద్ర అరబ్బీ మురబ్బాలు ఆయన మరణానంతరం వెలువడ్డాయి. జీవితపు చివరి దశలో మొదలు పెట్టిన మనిషీ-ఆడమనిషి కావ్యంలోని ఒక భాగం 'స్త్రీ పురాణం' మహిళా కోణాన్ని ఆవిష్కరించింది. తను రాయని సినీవాలి అనే కావ్యం రాసినట్టు ఎవరో పొరబాటున పేర్కొంటే దాన్ని నిజం చేయడానికి ఆ కావ్యం రాశారు (సినీ వాలి అంటే అమావాస్యనాడు కనిపించీ కనిపించని చంద్రరేఖ.). ఇంటింటి పజ్యాలు, కేరా శతకము వంటివి కూడా అలవోకగా చేసిన ప్రయోగాలే, కూనలమ్మ పదాలు వందల మందిని కవులను చేశాయంటారు. ఆరుద్ర రాసిన కవిత్వంలో వచన కవిత్వం పాలే ఎక్కువ. అనువాద కావ్యాలు. దృశ్య కావ్యాలను అనేకం అందించారు.. కథా సాహిత్యంతో పాటు కథా రచన టెక్నిక్‌ల పైనా చక్కగా రాశారు. వీర తెలంగాణ సాయుధ పోరాటంపై హరీంద్రనాథ్ చటోపాధ్యాయ గీతాలను తెలుగులోకి అనువదించగా సుందరయ్య గారి పుస్తకంలో ప్రచురించారు.

కొండగాలి తిరిగింది...

సినిమా కవిగానూ ఆరుద్ర జనరంజక గీతాలు అనేకం రాశారు. కొండగాలి తిరిగింది పేరిట వచ్చిన సినిమా పాటలు ఆయన పట్టును చెబుతాయి. రాజులు ఎక్కు అంబారీపై అందరు ఎక్కుట తప్పు కదా అంటే. రోజులు మారి రాజులు పోయిరి.. ప్రజలే ప్రభువులు ఈనాడు..మనుషులు పైన సవారి కన్నా ఏనుగు సవారి నయం కదా అంటూ రాస్తారు. ఎదగడానికెందుకురా తొందర పాటలో నిరుద్యోగాన్ని వివరిస్తారు. గాంధి పుట్టిన దేశమా ఇది అంటూ ప్రశ్నిస్తారు. చరిత్ర రచనలోనే గాక, వేదంలా ప్రవహించే గోదావరి, మహాబలిపురం వంటి పాటలు వింటే రాగం చరిత్ర అల్లుకు పోవడం చూస్తాం. కొట్టుకుని పోయే కొన్ని కోటి లింగాలు వీరేశలింగమొకడు నిలిచెను చాలు అన్న ఆయన మాటలు సుభాషితాల్లా నిలిచిపోయాయి. రగిలింది విప్లవాగ్ని ఈ రోజు అంటూ అల్లూరి సీతారామరాజుకు రాసిన పాట కూడా గొప్పగా వుంటుంది సినిమా పాటల తీరు మారి విలువలు తగ్గిపోతున్న దృష్ట్యా వాటిని రాయడం విరమించుకున్నారు. 150 చిత్రాలకు మాటలూ, 500 చిత్రాల్లో నాలుగు వేలకు పైగా పాటలు రాశారు.

రేపు విజయవాడలో ఆరుద్ర శత జయంతి ప్రారంభ సభ సందర్భంగా

> **రెండవ ప్రపంచ యుద్ధంలో ఫాసిజాన్ని ఓడించాలంటూ సైన్యంలో చేరడంతో మొదలైన ఆరుద్ర రాజకీయ అవగాహన ఆఖరుదాకా అదే బాటలో సాగింది. సైద్ధాంతిక విభేదాలు పెరిగినపుడు మామూలు కవులుగా అందుకోవడంలో తాము పొరబడి వుండొచ్చని నిస్సంకోచంగా, వినయంగా చాలాసార్లు చెప్పారాయన. 1955లో ప్రగతిశీల శిబిరంలో ప్రగతి నిరోధక స్వరాలు వినిపించినపుడు ఆయనను కూడా అటువైపు చేర్చారు గాని నిజం కాదని చాలాసార్లు సోదాహరణంగా చెప్పడానికి ప్రయత్నించాడాయన. శ్రీశ్రీ కన్నా 14 ఏళ్లు చిన్నవాడయినా అవగాహన పెంచుకుంటూ సమకాలీన బృందంతోనే నడవడం ఆయన ప్రతిభకూ పట్టుదలకూ అద్దం పడుతుంది.**

మహా పరిశోధకుడు

మార్క్సిస్టు దృక్పథంతో పరిశోధన, అధ్యయనం చేసిన ఆరుద్ర సమగ్ర ఆంధ్ర సాహిత్యం అందుకు తలమానికమైంది. సామాన్యుడికి సాహిత్య చరిత్ర తెలియడానికి తాను ఈ మహా భారం వేసుకున్నానని వినయంగా చెబుతూ వచ్చిన ఆయన వాస్తవంలో పండితులకు కూడా గొప్ప వనరు సమకూర్చారు. దాన్ని రాసే సమయంలో తీరిక లేకపోవడం వల్లనే గడ్డం చేసుకోవడం మానేసి పెంచేశానని సరదాగా చెబుతుండేవారు. వేమన వేదం (1974), మన వేమన, వ్యాస పీఠం, గురజాడ గురు పీఠం, సంపుటాలు ప్రజాశక్తిలో వారం వారం రాసిన వ్యాసాలతో వెలువడిన ప్రజా కళలూ-ప్రగతివాదులూ ఆయన ప్రజ్ఞకు ప్రతిబింబాలుగా నిలిచివున్నాయి. 'రాముడికి సీత ఏమవుతుంది?', 'గుడిలో సెక్స్' అన్న గ్రంథాలు ఆరుద్ర పరిశోధనా పటిమకూ నిదర్శనాలు. కళలు, క్రీడలు, ఇంద్రజాలం వంటి అంశాలపై కూడా సాధికార గ్రంథాలు వెలువరించారు. నాట్య శాస్త్రంలో గొప్ప అవగాహన గల ఆయన చెన్నైలో ప్రతిష్టాత్మక సంస్థల్లో ఉపన్యాసకుడుగా వున్నారు. దాదాపు అన్ని విశ్వవిద్యాలయాలలోనూ ఆయన ప్రసంగాలు చేయగా ఆయనపై అరడజను పైగా పరిశోధనలు జరగడం మరో విశేషం.

శ్రీశ్రీ, ఆరుద్ర

రెండవ ప్రపంచ యుద్ధంలో ఫాసిజాన్ని ఓడించాలంటూ సైన్యంలో చేరడంతో మొదలైన ఆరుద్ర రాజకీయ అవగాహన ఆఖరుదాకా అదే బాటలో సాగింది. సైద్ధాంతిక విభేదాలు పెరిగినపుడు మామూలు కవులుగా అందుకోవడంలో తాము పొరబడి వుండొచ్చని నిస్సంకోచంగా, వినయంగా చాలాసార్లు చెప్పారాయన. 1955లో ప్రగతిశీల శిబిరంలో ప్రగతి నిరోధక స్వరాలు వినిపించినపుడు ఆయనను కూడా అటువైపు చేర్చారు గాని నిజం కాదని చాలా సార్లు సోదాహరణంగా చెప్పడానికి ప్రయత్నించాడాయన. శ్రీశ్రీ కన్నా 14 ఏళ్ల చిన్నవాడయినా అవగాహన పెంచుకుంటూ సమకాలీన బృందంతోనే నడవడం ఆయన ప్రతిభకూ పట్టుదలకూ అద్దం పడుతుంది. అతి సన్నిహితులైన వారి మధ్య తేడాలను రాజకీయం చేయవలసిన అగత్యమే లేదు. శ్రీశ్రీ, ఆరుద్రలు అభ్యుదయ లోకంలో గొప్ప ప్రభావం చూపిన ఇద్దరు ఉద్దండులుగా ఎప్పటికీ మిగిలి వుంటారు. ఈ వ్యాస రచయిత శ్రీశ్రీ 'అనంతం'పైన సమీక్ష రాశాక ఆరుద్ర అభినందనలు రాస్తూ 'ప్రముఖ సామ్యవాద కవిగా మాత్రమే ఆయనను మనం గుర్తుంచుకోవాలి' అని ఆరుద్ర తేల్చి చెప్పారు. ఈ కారణంగానే నా శ్రీశ్రీ జయభేరి ఆరుద్రకే అంకితమిచ్చాను.

అరవైల తర్వాత ఇంకో అరుణారుణంగా...

1985లో ఆరుద్ర షష్టి పూర్తి తెలుగు సాహిత్య లోకంలో ఒక పండుగలా జరిగింది. అనేక పట్టణాల్లో ఆయనను సత్కరించారు. ప్రచురణ సంస్థలు తలా ఒక సంపుటం వెలువరించాయి. మద్రాసు రాణీ శీతల్ హాలులో జరిగిన ఆ సభ ఇప్పటికీ గుర్తుంది. ప్రజాకళలు ప్రగతివాదులు కాపీలు తీసుకుని వెళ్లాను. ఆ తర్వాత కాలంలో ఆరుద్ర ఉద్యమానికి మరింత దగ్గరయ్యారు. కీలకమైన పలు సభలకూ సందర్భాలకూ హాజరవుతూ వచ్చారు. సుందరయ్య కన్ను మూసినపుడు రాత్రి ఫోన్ చేసి మరీ చిన్న కవిత చెప్పి నివాళులర్పించారు. సమగ్ర ఆంధ్ర సాహిత్యం సంపుటాల మలి ముద్రణ కూడా ఆరుద్ర అప్పగించడం, అందుకు అవసరమైన ఏర్పాట్లు ప్రజాశక్తి చేయడం యాదృచ్ఛికం కాదు. బొమ్మారెడ్డిగారు, గోళ్ల రాధాకృష్ణమూర్తి గారు ఆయనతో ఎక్కువగా మాట్లాడుతుండేవారు. మేడిపల్లి రవికుమార్ ఆరుద్రకు రాసిపెట్టడంలో సహకరించేవారు. తర్వాత కాలంలో ఆయన సాహిత్య అకాడమీ కోసం ఆరుద్ర జీవితం రాశారు.

అంతర్జాతీయంగా సోవియట్ విచ్ఛిన్నం, ప్రపంచీకరణ, దేశంలో అయోధ్య వివాదం తర్వాత మతతత్వ రాజకీయాలు పెరుగుతున్న తరుణంలో ఆరుద్ర మరింత పట్టుదలగానూ అధ్యయన శీలంగానూ గడిపారు. మనీ ప్రపంచం మనీ ప్రపంచం/ మనీ ప్రపంచం గెలిచిందా? మరో ప్రపంచం మరో ప్రపంచం మరో ప్రపంచం మారిందా?/ పీడిత శక్తుల స్వప్నాలన్నీ/పీడ కలలుగా మారాయా?/మరో ప్రపంచం మరో ప్రపంచం / మాతామహులను మరిచేరా? /మతిభ్రమించిన అతిరథులంతా / గతితర్కాన్నే తిడతారా?/ కారల్ మార్క్స్ ఉపదేశాలకు కాలదోషమని అంటారా? /డెబ్బయ్యేళ్ల త్యాగాలన్నీ / ఇబ్బందుల పద్దుకు జమ కట్టి వర్గ శత్రువుల దుర్గంధాల వాకిట ముష్టికి వెడతారా?/ బొచ్చె పట్టుకుని బిచ్చమెత్తుకుని/ చచ్చిన చావు వద్దు సుమా అని హెచ్చరించారు. మార్క్సు లెనినూ మనకై వేసిన మార్గంలోనే చరిద్దాము/ మరో ప్రపంచం మరో ప్రపంచం / మరలా మనమూ రచిద్దాం/విశ్రమించక విధిగా సరిగా శ్రీశ్రీ గీతిక పఠిద్దాం...అని అమెరికాలో వుండగా రాసిన పాట ప్రజాశక్తికి పంపించారు.

ఆరుద్ర 1998 జూన్ 4న కన్నుమూసిన సంగతి అంత్యక్రియలు ముగిశాక తెలిసిందంటే అది కూడా ఆయన నిరాడంబరతకు ఓ నిదర్శనమే. తన అంతిమ ఘట్టం అలా నిశ్శబ్దంగా జరిగిపోవాలని ఆయన ఆకాంక్షించారట. ఆయన భార్య రామలక్ష్మి 2023 మార్చి 3న కన్నుమూశారు. చరిత్రనే తిరగదోడే సంఘ పరివార్ దాడులు, సాహిత్యంలోనూ సమిష్టి ప్రయోజనం కన్నా వ్యక్తిగత ధోరణులు వాణిజ్య ప్రభావాలు పెంచుతున్న ఈ తరుణంలో ఆరుద్ర జీవిత ప్రస్థానం జిజ్ఞాసులు, చైతన్య గత ప్రాణుల అధ్యయనానికి మార్గదర్శకం. అన్ని అవకాశాలు వుండి కూడా ఉద్యమంతో మమేకం కావాలని పరితపించిన ఆరుద్ర జీవితం, కృషి ఆదర్శప్రాయం. శత జయంతి సంవత్సరంలో ఆరుద్ర సాహిత్యం అధ్యయనాల వారసత్వాలను సంస్కరించుకుందాం. అలవర్చుకునే ప్రయత్నం చేద్దాం.

★

జనవాక్యం

ఆదర్శ పాఠశాలల్లో కారుణ్య నియామకం

ఆంధ్రప్రదేశ్ మోడల్ పాఠశాలల వ్యవస్థ 2013లో ప్రారంభమై రెగ్యులర్ ఉపాధ్యాయుల పోస్టింగ్ జరిగే సమయానికి ఎటువంటి సర్వీస్ నిబంధనలు లేవు. అప్పటికి కొత్తగా ఏర్పడిన ఈ ఆదర్శ పాఠశాలల వ్యవస్థ (మోడల్ స్కూల్స్ సిస్టమ్) రిక్రూట్‌మెంట్ విధానంలో డైరెక్ట్ రిక్రూట్‌మెంట్ ద్వారా ప్రధానోపాధ్యాయులు, పోస్ట్ గ్రాడ్యుయేట్ టీచర్లు, ట్రైన్డ్ గ్రాడ్యుయేట్ టీచర్లు అనే కొత్త క్యాడర్‌తో, రెగ్యులర్ పే స్కేళ్లతో ఉపాధ్యాయుల నియామకం జరిగింది. కొత్తగా ఏర్పడిన వ్యవస్థ కనుక సర్వీస్ నిబంధనల అమలులో, కారుణ్య నియామకాల విధానం అమలులో, ఇతర పాలసీ నిర్ణయాల అమలులో కొంత జాప్యం జరిగిందని ప్రభుత్వ గుర్తింపు పొందిన ఉపాధ్యాయ సంఘాలు పలు సందర్భాల్లో తెలియజేస్తున్నాయి. అనేక సంవత్సరాలు గడిచిపోతున్నా నేటికీ ఆదర్శ పాఠశాల వ్యవస్థకు సంబంధించి సర్వీస్ నిబంధనలతో ముడిపడిన అనేక అంశాలకు స్పష్టత లేదు. ముఖ్యంగా విధుల్లో చేరి 12 సంవత్సరాలు అవుతున్నప్పటికీ నేటికీ సర్వీస్ నిబంధనలు లేకపోవడం వలన చనిపోయిన రెగ్యులర్ ఉపాధ్యాయుల కుటుంబాలు నష్టపోయాయి. ప్రారంభంలో మోడల్ స్కూల్ వ్యవస్థకు కారుణ్య నియామకాల విధానం లేకపోవడం ఆ బాధిత కుటుంబాలకు పెద్ద సమస్యగా మారింది. ఒక రెగ్యులర్ ఉపాధ్యాయుడు సర్వీస్‌లో ఉండగా చనిపోతే అదే వ్యవస్థలో కుటుంబ సభ్యుల్లో ఒకరికి కారుణ్య నియామకం కల్పించడం సర్వసాధారణ విషయం. చనిపోయిన ఉపాధ్యాయ కుటుంబానికి ప్రభుత్వమే ఆసరాగా నిలిచి "కారుణ్య నియామకాల విధానాన్ని" అన్ని మేనేజ్‌మెంట్ల సిబ్బందికి ప్రవేశపెట్టింది. మోడల్ స్కూళ్లలో మాత్రం ఈ కారుణ్య నియామకాల విధానాన్ని ఇంకా అడాప్ట్ చేసుకోలేదు. ఆదర్శ పాఠశాల వ్యవస్థ ప్రస్తుతం విద్యా శాఖలో అంతర్భాగంగా ఉన్నప్పుడు విద్యా శాఖలో ఏదైనా విభాగంలో కారుణ్య నియామకాలు ఇవ్వాలని మోడల్ స్కూల్ ఉపాధ్యాయుల కుటుంబాలు ఎదురు చూస్తున్నాయి. 21 మంది రెగ్యులర్ ఉపాధ్యాయుల కుటుంబాలని ఆదుకోవాలని అనేక సంవత్సరాలుగా చేస్తున్న విజ్ఞప్తులను, ప్రాతినిధ్యాలను చేసిన సందర్భాలను పరిగణనలోకి తీసుకొని మోడల్ స్కూల్ రెగ్యులర్ ఉపాధ్యాయుల కుటుంబాల సభ్యులకు అర్హతతో కూడిన కారుణ్య నియామకాలు ఇచ్చి ప్రభుత్వం వారిని ఆదుకోవాలని విజ్ఞప్తి. కారుణ్య నియామకాలు విధానాన్ని మోడల్ స్కూళ్ల వ్యవస్థలో కూడా అడాప్ట్ చేసుకొని కారుణ్య నియామకాలు ఇవ్వడానికి అవసరమైన ప్రతిపాదనల ద్వారా ఆ కుటుంబాలకు మేలు చేసే అవకాశం ఉంది. ప్రస్తుతం ఆదర్శ పాఠశాలలు రాష్ట్ర ప్రభుత్వ ఆధీనంలోనే విద్యాశాఖలో ఒక భాగంగా ఉన్నాయి. 164 ఆదర్శ పాఠశాలలకు సంబంధించిన ఈ అంశాలను ప్రభుత్వం పరిష్కరిస్తుందని ఉపాధ్యాయ కుటుంబాలు ఎదురు చూస్తున్నాయి. టీచర్ ఎమ్మెల్సీలు, ప్రభుత్వ గుర్తింపు పొందిన సంఘాలు కూడా ఆదర్శ పాఠశాలల సమస్యలపై దృష్టి పెట్టాలని, దీర్ఘకాలిక పెండింగ్ అంశాలను పరిష్కరించాలని ఉపాధ్యాయులు ఆశిస్తున్నారు.

- బి. సురేష్,
మోడల్ స్కూల్స్ రెగ్యులర్ టీచర్స్ కమిటీ, ఎ.పి, సెల్ : 8790897345

సమస్య

కొత్త పరిశ్రమలు రావలసిందే ఉద్యోగాలు కావాల్సిందే .. కానీ!

పి.అజయకుమార్

రాష్ట్రంలో ప్రభుత్వం మారింది. టిడిపి కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది. కొత్త ప్రభుత్వం వచ్చింది కాబట్టి నిరుద్యోగుల్లో ఆశ పెరిగింది. కొత్తగా పరిశ్రమలు వస్తాయి. తమకు ఉద్యోగాలు వస్తాయని ఎదురు చూస్తున్నారు. టిడిపి ప్రభుత్వం పారిశ్రామిక అభివృద్ధి విషయంలో గత ప్రభుత్వంతో పోల్చినపుడు కొంత మెరుగు కావచ్చు.

కానీ కూటమి ప్రభుత్వం ఇచ్చే నినాదాలు బెరుకు కలిగిస్తున్నాయి. ప్రభుత్వ, ప్రైవేట్ భాగస్వామ్యం (పి.పి.పి) కాదు, ప్రభుత్వ, ప్రైవేట్, ప్రజల భాగస్వామ్యం (పి.పి.పి.పి) అన్నారు. మూడు 'పి'లు పోయి నాలుగు 'పి' లు వచ్చాయి. 'ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్' (వ్యాపారం తేలికగా చేసుకోవటం) ఎపుడో వచ్చింది. దీనికి అదనంగా రాష్ట్రంలో ఇపుడు స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్' వచ్చింది.

అనుభవాలను మరిచిపోలేరు. కష్టాలు పడ్డ వారి కథలు కో కొల్లలు. ప్రభుత్వ, ప్రైవేట్ భాగస్వామ్యం అన్నారు. ప్రభుత్వ (ప్రజల) ఖజానాలో కొంత ప్రైవేటుకు ఇచ్చి ప్రభుత్వ రంగ బ్యాంకుల చేత రుణాలు ఇప్పించిన తరువాత ప్రైవేట్ కంపెనీలు వేసే రోడ్లు, విమానాశ్రయాలు, చేసే విద్యుత్తు ఉత్పత్తి తదితర మౌలిక సౌకర్యాలు ఎవరికి అందుబాటులో ఉన్నాయి? ఎవరి మీద భారాలు పడుతున్నాయి?

ఒక పక్కన దసరా, సంక్రాంతి పండుగల సందర్భాల్లో 4 లైన్లు, 6 లైన్లు హైవేల్లో టోలుగేట్లు దగ్గర బారులు తీరే కార్లు. మరోపక్క రైళ్లలో జనరల్ కంపార్ట్‌మెంట్లు, స్లీపర్‌కోచ్‌లు తగ్గిపోయి, బస్టాండ్లలో తగినన్ని బస్సులు లేక కిటకిటలాడిపోయే జనం. ప్రైవేట్ కంపెనీల చేతివాటంతో పెరిగిపోతున్న 'ట్రూ అప్' విద్యుత్తు భారాలు. ప్రభుత్వ, ప్రైవేట్ భాగస్వామ్యం అసలు రూపం ఇదే.

ఇపుడు కొత్తగా ప్రజల భాగస్వామ్యాన్ని కూడా చేర్చారు. ఇంతకు ముందు లేనిది ఇపుడు కొత్తగా వస్తోందా? మునుపటి కంటే ప్రజల భాగస్వామ్యం మరింత పెరిగిపోతుందా? కొత్తగా ప్రజలకు అనుకూల మార్పు వస్తోందా? ఎస్.ఇ.జెడ్ లలో వచ్చిన కంపెనీలకు భూములు ఇచ్చి రైతులు ఆ కంపెనీల్లో కూలీలుగా మారారు. పరిశ్రమల నిర్మాణ సమయంలో వచ్చే, పోయే లారీల్లో దింపుడు, ఎత్తుడు హమాలీలయ్యారు. కోల్‌కొతా-చెన్నయ్ రహదారి పక్కన తమిళనాడు సరిహద్దులో ఉన్న పేరు మోసిన ఎస్.ఇ.జెడ్.లో భూములు కోల్పోయిన రైతులు గతిలేక ఎస్.ఇ.జెడ్ భూముల్లోకి గొడ్లు రాకుండా చూసుకునే కూలీలుగా మారడానికి కూడా సిద్ధపడుతున్నారు.

ఇపుడు కొత్తగా అనకాపల్లి జిల్లా అచ్యుతాపురం ఎస్.ఇ.జెడ్ లో ఉన్న ఒక కంపెనీలో భూములు ఇచ్చిన రైతు కుటుంబాలకు చెందిన 70 శాతం మంది కార్మికులుగా చేరారు. కానీ వారిని 12 సంవత్సరాల తర్వాత కూడా కంపెనీ కార్మికులుగా కూడా గుర్తించలేదు. నైపుణ్యాన్ని బట్టి వేతనాలు ఇవ్వలేదు. కంపెనీ చేసిన ఆర్థిక తప్పిదానికి ప్రస్తుతం మూతపడింది. భూములు ఇచ్చిన కార్మికుల రెక్కలు ముక్కలయ్యాయి. కొత్తగా వచ్చే నాలుగో 'పి' అంటే ప్రజల భాగస్వామ్యం ఏ విధంగా అదే ప్రజలకు ఇంత కంటే మెరుగ్గా ఒరగబెడుతుందో కూటమి ప్రభుత్వం చెప్పాలి. లేదంటే ఏ నినాదం వెనుక ఏ వర్గ ప్రయోజనం దాగి ఉందోనని ప్రజలు తెలుసుకోటానికి పెద్ద సమయం పట్టదు.

ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ (తేలికగా వ్యాపారం చేసుకోవటం) పేరుతో పెట్టుబడిదారులకు ఉన్న ఆటంకాలను తొలగించారు. ప్రభుత్వాలు ఏకపక్షంగా పెట్టుబడిదారుల ప్రయోజనాల కోసమే పని చేస్తున్నాయి. యూనియన్లు పెట్టుకోనివ్వటం లేదు. అలా ముందుకు వచ్చిన వారిని ఉద్యోగాల నుండి తొలగిస్తున్నారు. ప్రైవేట్ పరిశ్రమల్లో గుర్తింపు ఎన్నికలు మూలపడ్డాయి. తనిఖీలను ఎత్తివేశారు. కార్మికుల భద్రతను గాలికొదిలేశారు.

కనీస వేతన చట్టం ప్రకారం 5 సంవత్సరాలకు ఒకసారి కార్మికులు వేతనాలు పెంచాలి. 2005-06 సంవత్సరాల తర్వాత పరిశ్రమలతో సహా షెడ్యూల్డు ఎంప్లాయ్‌మెంట్లలో 50 లక్షల మంది కార్మికులకు వేతనాలు పెంచలేదు. ఆ 18 సంవత్సరాల క్రితపు వేతనాలను కూడా నైపుణ్యాలకు తగినట్లుగా ఇవ్వటం లేదు. అదానీ పోర్టులో కూడా ఇదే పరిస్థితి. కార్మికులను కదలకుండా చేయటానికి పోర్టుల్లో, ఎస్.ఇ.జెడ్ లలో పోలీసు స్టేషన్లు వచ్చాయి. యూనియన్లకు ప్రవేశం లేదు. విడివిడిగా ఉండే ప్రైవేట్ పరిశ్రమలన్నింటిలో కూడా ఇదే పరిస్థితి.

లేబరు అధికారులు చేతులెత్తేశారు. తమ చేతులు కట్టివేయబడ్డాయని వాపోతున్నారు. ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ పరిస్థితే ఇలా ఉంటే స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్' ఇంకెలా ఉంటుందోనని కార్మికులు ఆందోళన చెందుతున్నారు. తాము మరింతగా తొక్కివేయబడతామని భయ భ్రాంతులకు గురవుతున్నారు.

> **కనీస వేతన చట్టం ప్రకారం 5 సంవత్సరాలకు ఒకసారి కార్మికులు వేతనాలు పెంచాలి. 2005-06 తర్వాత పరిశ్రమలతో సహా షెడ్యూల్డు ఎంప్లాయ్‌మెంట్లలో 50 లక్షల మంది కార్మికులకు వేతనాలు పెంచలేదు. ఆ 18 సంవత్సరాల క్రితపు వేతనాలను కూడా నైపుణ్యాలకు తగినట్లుగా ఇవ్వటం లేదు. అదానీ పోర్టులో కూడా ఇదే పరిస్థితి. కార్మికులను కదలకుండా చేయటానికి పోర్టుల్లో, ఎస్.ఇ.జెడ్ లలో పోలీసు స్టేషన్లు వచ్చాయి. యూనియన్లకు ప్రవేశం లేదు. విడివిడిగా ఉండే ప్రైవేట్ పరిశ్రమలన్నింటిలో కూడా ఇదే పరిస్థితి.**

ఏ ప్రభుత్వమైనా ఆ పథకం ఇస్తాం, ఈ పథకం ఇస్తామని మభ్యపెడుతున్నాయి తప్పిస్తే కార్మికులకు వేతనాలు పెంచుతాం, కార్మిక హక్కులను కాపాడతామని చెప్పటం లేదని కార్మికులు గుర్తించాలి.

ఒకరు ప్రతిపక్షంలో ఉన్నపుడు ప్రతి ఫ్యాక్టరీలో యూనియన్లు పెట్టమని చెపుతారు. అధికారంలోకి వచ్చిన తర్వాత యూనియన్లు పెట్టి ఆందోళన చేస్తామంటే కుదరదంటారు. మరొకరు ప్రతిపక్షంలో ఉండగా వీధి వీధికి, గడప గడపకు తిరిగి అధికారంలోకి వచ్చాక కలుగులో ఉండిపోయి బయటకు రాలేదు.

కార్మికుల సమస్యలను, కోర్కెలను తెలియజేయటానికి యూనియన్లు పెట్టటం తప్పనిసరి. 1926 ట్రేడ్‌యూనియన్ల చట్టం ప్రకారం రిజిస్ట్రార్ ఆఫ్ ట్రేడ్ యూనియన్ల (లేబర్ కమిషనర్లు) ద్వారా కార్మిక సంఘాలను రిజిస్టర్ చేయటం ప్రభుత్వాల బాధ్యత. తద్వారా విడి విడి కార్మికుల గొంతును వినిపించే అవకాశం కల్పించాలి.

రాజ్యాంగంలోని 19(1) (సి) అధికరణం ప్రకారం యూనియన్లు, అసోసియేషన్లను ఏర్పాటు చేసుకోవటం ప్రాథమిక హక్కు. పారిశ్రామిక వివాదాల చట్టం సమ్మె చేయటాన్ని కార్మికుల చట్టపరమైన హక్కుగా గుర్తించింది. ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ కింద ఈ హక్కులు కాలరాయబడుతున్నాయి. కార్మికులు సంఘటితం కావాలి. చట్టపర హక్కుల కోసం పోరాడాలి. కార్మిక సంఘాలు కార్మికులను చైతన్యపర్చి కార్మికులను సంఘటితం చేసేందుకు పూనుకోవాలి.

/ వ్యాసకర్త సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు /

ఎవరీ సురీందర్ కుమార్ చౌదరి?

శ్రీనగర్: జమ్మూ కాశ్మీర్ డిప్యూటీ సిఎంగా ఒమర్ అబ్దుల్లా సురీందర్ చౌదరిని ఎందుకు ఎంచుకున్నారు? అసలు ఈ సురీందర్ ఎవరు? అన్న సందేహాలు తలెత్తడం సహజం. వివరాల్లోకి వెళితే..ఈయన జమ్మూలోని నౌషెరా నియోజకవర్గం నుంచి పోటీ చేసి తన సమీప ప్రత్యర్థి బిజెపికి చెందిన రవీందర్ రైనాపై 7,619 ఓట్ల మెజార్టీతో విజయం సాధించారు. 2023లో ఆయన నేషనల్ కాన్ఫరెన్స్‌లో చేరారు. 2014 అసెంబ్లీ ఎన్నికల్లో పిడిపి తరపున పోటీ చేసి రైనా చేతిలో ఓడిపోయారు. ఆ తర్వాత పిడిపి నుంచి తప్పుకుని బిజెపిలో చేరారు. అయితే, ఒక్క సంవత్సరంలోనే ఆ పార్టీని వదిలి నేషనల్ కాన్ఫరెన్స్‌లో చేరారు. నేషనల్ కాన్ఫరెన్స్ ఉపాధ్యక్షుడు, ముఖ్యమంత్రి ఒమర్ అబ్దుల్లా జమ్మూ ప్రజలకు వాయిస్ ఇవ్వాలనే ఉద్దేశంతో సురీందర్ చౌదరిని ఉప ముఖ్యమంత్రిగా ఎంచుకున్నారు. కొత్త ప్రభుత్వం అందరినీ కలుపుకుపోవాలని కోరుకుంటున్నట్లు ఒమర్ చెప్పారు. ఈ ప్రభుత్వంలో తమ గొంతు లేదని జమ్మూ ప్రజలు భావించకూడదన్నదే తన అభిమతమని అన్నారు.

మసీదులో జైశ్రీరాం నినాదాలు

- మత విశ్వాసాలను దెబ్బతీయవు : కర్ణాటక హైకోర్టు

బెంగళూరు : మసీదులో జైశ్రీరాం నినాదాలు చేయడం వలన ఏ మత పరమైన విశ్వాసాలను దెబ్బతీయవని కర్ణాటక హైకోర్టు తీర్పునిచ్చింది. ఇద్దరు వ్యక్తులపై పోలీసులు నమోదు చేసిన క్రిమినల్ కేసును మంగళవారం కొట్టివేసింది. జైశ్రీరామ్ నినాదాలు ఏ కమ్యూనిటీ మతపరమైన భావాలనైనా ఎలా దెబ్బతీస్తాయో అర్థం కావడం లేదని నిందితుని అప్పీల్ పిటిషన్‌ను విచారించిన జస్టిస్ ఎం.నాగప్రసన్న నేతృత్వంలోని సింగిల్ డివిజన్ బెంచ్ వ్యాఖ్యానించింది.

నైజీరియాలో గ్యాసోలిన్ ట్యాంకర్ పేలి 94మంది మృతి

అబూజా : నైజీరియాలో గ్యాసోలిన్ ట్యాంకర్ బోల్తా పడి పేలిపోవడంతో 94మంది మరణించారు. మరో 50మంది గాయపడ్డారని పోలీసులు బుధవారం తెలిపారు. ట్యాంకర్ బోల్తా పడిన వెంటనే రోడ్డుపై పడిన చమురును తీసుకునేందుకు పెద్ద సంఖ్యలో ప్రజలు పరుగులు తీశారు. జిగవా రాష్ట్రంలోని మజియా పట్టణంలో అర్ధరాత్రి దాటిన వెంటనే ఈ ప్రమాదం సంభవించింది. హైవేపై వెళుతుండగా వాహనంపై డ్రైవర్‌కు పట్టుతప్పడంతో ఈ ప్రమాదం చోటు చేసుకుందని పోలీసు ప్రతినిధి లావాన్ ఆదమ్ తెలిపారు. నైజీరియాలో ఇటువంటి ప్రాణాంతకమైన ట్యాంకర్ ప్రమాదాలు చాలా సర్వసాధారణం. చాలాచోట్ల ట్రాఫిక్ నిబంధనలను పాటించరు. పైగా సరుకు రవాణాకు సమర్థవంతమైన రైల్వే వ్యవస్థ వంటి ప్రత్యామ్నాయాలు లేకపోవడంతో పరిస్థితి మరింత భయంకరంగా వుంటుంది. ట్యాంకర్ బోల్తా పడిన వెంటనే పెద్ద ఎత్తున పేలుడు సంభవించి, మంటలు చెలరేగి ఆ ప్రాంతమంతా అలుముకున్న దృశ్యాలు వైరల్ అవుతున్నాయి.

బీరుట్‌పై వరుస దాడులతో రెచ్చిపోయిన ఇజ్రాయిల్

- మేయర్ సహా 20మంది మృతి
- 12 రోజులుగా కొనసాగుతున్న ఉత్తర గాజా ముట్టడి
- ముస్లిం దేశాలన్నీ ఒక్క తాటిపైకి రావాలన్న ఇరాన్

బీరుట్, గాజా : లెబనాన్ రాజధాని బీరుట్‌లోని దక్షిణ ప్రాంతాన్ని ఖాళీ చేయాలని ఆదేశాలు జారీ చేసిన ఇజ్రాయిల్ మిలటరీ గంట కూడా గడవక ముందే వరుస వైమానిక దాడులతో రెచ్చిపోయింది. దక్షిణ శివార్లలో జరిగిన ఈ దాడుల్లో మేయర్ సహా మొత్తంగా 20మంది మరణించారని అధికారులు తెలిపారు. స్థానిక పాలనా భవనాన్ని లక్ష్యంగా చేసుకుని నబటియె పట్టణంలో జరిగిన దాడిలో ఆ పట్టణ మేయర్ సహా ఐదుగురు చనిపోయారని వార్తలందాయి. మరో గ్రామమైన కానాలో ఇళ్ళపై, ఆరోగ్య కేంద్రంపై జరిగిన దాడుల్లో 15మంది చనిపోయారు.

మరోవైపు ఉత్తర గాజా దిగ్బంధనం ఇప్పటికి 12రోజులుగా కొనసాగుతోంది. ఇజ్రాయిల్ బలగాలు వరుస వైమానిక, పదాతి దాడులతో విరుచుకుపడుతుండడంతో అక్కడ పరిస్థితి అధ్వాన్నంగా తయారైంది. కుటుంబాలకు కుటుంబాలే అదృశ్యమయ్యాయని గాజా ఆరోగ్యశాఖ డైరెక్టర్ జనరల్ తెలిపారు. వీరిలో సగానికి పైగా మహిళలు, చిన్నారులే వున్నారు. ఇంకా అనేక మృతదేహాలు శిథిలాల కింద, వీధుల్లో పడి వున్నాయి. వరుస దాడుల కారణంగా సహాయక సిబ్బంది అక్కడకు చేరుకునే పరిస్థితులు లేవు. 12 రోజుల క్రితం దాడులు ఆరంభమైనప్పటి నుండి ఇప్పటివరకు 350 మృతదేహాలు ఆస్పత్రులకు వచ్చాయి. కాగా, దాడులు కొనసాగుతున్నప్పటికీ సెంట్రల్ గాజాలో పోలియో డ్రైవ్‌ను ప్రారంభించగలిగామని ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యుహెచ్‌ఓ) తెలిపింది. వేలాదిమంది పిల్లలకు వ్యాక్సిన్లు వేస్తున్నామని పేర్కొంది. నుస్రత్ శిబిరంలోని ఒక స్కూలును వ్యాక్సినేషన్‌కేంద్రంగా మార్చారు. కానీ ఆ స్కూలుపై ఆది, సోమవారాల్లో దాడులు జరగడంతో 22మంది మరణించారని ఐక్యరాజ్య సమితి పాలస్తీనా శరణార్థుల సంస్థ యుఎన్‌ఆర్‌డబ్ల్యుఎ పేర్కొంది.

ఇరాన్ పిలుపు

ఇజ్రాయిల్‌కు వ్యతిరేకంగా ముస్లిం దేశాలన్నీ ఏకం కావాలని ఇరాన్ అధ్యక్షుడు మసూద్ పెజెషికాన్ కోరారు. మనందరం కలిసి కట్టుగా ఒక తాటిపైకి రాగలిగితే, ఆ యూదు ప్రభుత్వం అంత సులభంగా ఈ యుద్ధ నేరాలకు పాల్పడలేదని ఆయన వ్యాఖ్యానించారు. ఒమన్ పాలకుడితో ఫోన్‌లో మాట్లాడిన సందర్భంగా ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు.

ప్రాంతీయ ఉద్రిక్తతలపై ఇరాన్, జోర్డాన్ విదేశాంగ మంత్రులు సమావేశమయ్యారు. అంతకుముందు ఇరాన్ విదేశాంగ మంత్రి అబ్బాస్ అరగచ్చి సిరియా, సౌదీ అరేబియా, లెబనాన్‌లో పర్యటించారు. చివరగా అమ్మాన్ చేరుకున్నారు. ఇరాన్ శాంతిని కోరుకుంటోందని ఆయన స్పష్టం చేశారు. అయితే ఇజ్రాయిల్ తమ దేశంపై దాడి చేస్తే మాత్రం కచ్చితంగా ప్రతీకారం తీర్చుకుంటామని తెలిపారు.

విఐపి భద్రత నుంచి ఎన్‌ఎస్‌జి కమాండోల ఉపసంహరణ

- కేంద్ర ప్రభుత్వం ఉత్తర్వులు

న్యూఢిల్లీ: విఐపిల భద్రత నుంచి ఎన్‌ఎస్‌జి కమాండోలను ఉపసంహరించాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు కేంద్ర హోం మంత్రిత్వ శాఖ బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఇక నుంచి ఈ బాధ్యతను సిఆర్‌పిఎఫ్ చేపడుతుందని ఆ ఉత్తర్వుల్లో తెలిపింది.ఇది వచ్చే నెల నుంచి అమలులోకి వస్తుందని హోం మంత్రిత్వశాఖ వర్గాలు తెలిపాయి. హై రిస్క్ ఉన్న తొమ్మిది కేటగిరీల విఐపిల సెక్యూరిటీ బాధ్యత ఇక నుంచి సిఆర్‌పిఎఫ్ చూసుకుంటుందని ఈ వర్గాలు పేర్కొన్నాయి. పార్లమెంటు వద్ద భద్రతా విధులను కూడా సిఆర్‌పిఎఫ్ విఐపి సెక్యూరిటీ విభాగానికి ఇప్పటికే అప్పగించారు. జెడ్ ప్లస్ కేటగిరీ విఐపీల్లో తొమ్మిది మంది ఉన్నారు. ఎన్‌ఎస్‌జికి చెందిన బ్లాక్ క్యాట్ కమాండోల భద్రత పొందుతున్న ఈ విఐపీల్లో యుపి ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్, ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి ఎన్ చంద్రబాబు నాయుడు, మాజీ ఉప ప్రధాని, బిజెపి నాయకుడు ఎల్‌కె అద్వానీ, రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్, బిఎస్‌పి నేత మాయావతి, కేంద్ర షిప్పింగ్ శాఖ మంత్రి సర్బానంద సోనోవాల్, చత్తీస్‌గఢ్ మాజీ ముఖ్యమంత్రి రమణ్ సింగ్, జమ్మూ కాశ్మీర్ మాజీ ముఖ్యమంత్రి డెమొక్రాటిక్ ప్రొగ్రెసివ్ అజాద్ పార్టీ (డిపిఎపి) గులాం నబీ అజాద్, నేషనల్ కాన్ఫరెన్స్ నేత ఫరూఖ్ అబ్దుల్లా ఉన్నారు. వీరందరి సెక్యూరిటీ బాధ్యత ఇప్పుడు సిఆర్‌పిఎఫ్ చేపడుతుంది.

6 రబీ పంటలకు ఎంఎస్‌పి

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

రబీ పంటల ఎంఎస్‌పికి కేంద్ర మంత్రివర్గం ఆమోదం తెలిపింది. బుధవారం ప్రధాని నరేంద్ర మోడీ అధ్యక్షతన సమావేశమైన కేంద్ర మంత్రివర్గం ఈ మేరకు నిర్ణయం తీసుకుంది. మంత్రివర్గ నిర్ణయాలను కేంద్ర మంత్రి అశ్వినీ వైష్ణవ్ బుధవారం నాడిక్కడ వెల్లడిస్తూ 2025-26 సీజన్‌లో ఆరు రబీ పంటలకు కనీస మద్దతు ధర (ఎంఎస్‌పి) నిర్ణయించినట్లు చెప్పారు. గోధుమలు క్వింటాల్‌కు రూ.2,425, బార్లీ క్వింటాల్‌కు రూ.1,980, శనగలు క్వింటాల్‌కు రూ.5,650, కందులు క్వింటాల్‌కు రూ.6,700, ఆవాలు క్వింటాల్‌కు రూ.5,950, కుసుమలు క్వింటాల్‌కు రూ.5,940గా ధర నిర్ణయించినట్లు చెప్పారు. ఈ ఎంఎస్‌పి గతం కంటే పెరిగిందని తెలిపారు.

రూ.2,642 కోట్లతో వారణాసిలో రైల్-రోడ్ బ్రిడ్జ్

కొత్త రైల్-రోడ్ బ్రిడ్జిని రూ.2,642 కోట్లతో నిర్మించేందుకు కేంద్ర మంత్రివర్గం ఆమోదం తెలిపిందని కేంద్ర మంత్రి అశ్విని వైష్ణవ్ తెలిపారు. గంగానదిపై రైలు, రోడ్డు మార్గాల బ్రిడ్జి సహా 'వారణాసి-పండిట్ దీన్ దయాళ్ ఉపాధ్యాయ బహుళ మార్గాల బ్రిడ్జి' నిర్మాణం చేపట్టనున్నట్లు పేర్కొన్నారు. 'మాల్వీయ బ్రిడ్జి కట్టి 137 ఏళ్లయింది. ఇప్పుడు కొత్త బ్రిడ్జి నిర్మాణం జరపనున్నాం. లోయర్ డెక్‌లో 4 రైల్వే లైన్లు, అప్పర్ డెక్‌పై 6 లేన్ల హైవే ఉంటుంది. ట్రాఫిక్ కెపాసిటీ దృష్ట్యా ప్రపంచంలోనే అతిపెద్ద బ్రిడ్జిల్లో ఇదొకటి అవుతుంది' అని మంత్రి తెలిపారు. ఉత్తరప్రదేశ్‌లోని వారణాసి-చౌందాలి జిల్లాల గుండా కొత్త వంతెన నిర్మాణం జరగనుందన్నారు.

కెనడాకు బాసటగా నిలిచిన 'ఫైవ్ ఐ' దేశాలు !

- ఆ దర్యాప్తుకు భారత్ సహకరించాలంటూ వ్యాఖ్యలు

లండన్ : భారత్, కెనడాల మధ్య రగులుతున్న దౌత్య వివాదంలో బ్రిటన్, అమెరికా, ఆస్ట్రేలియా, న్యూజిలాండ్ కెనడాకు మద్దతుగా నిలిచాయి. కెనడా జ్యుడీషియల్ ప్రక్రియ పట్ల పూర్తి విశ్వాసం వుందని బ్రిటన్ పేర్కొంది. కెనడా చట్టపరమైన ప్రక్రియకు భారత్ సహకరించడమే ప్రస్తుతం తీసుకోవాల్సిన సరైన చర్య అని స్పష్టం చేసింది. ఈ మేరకు బ్రిటిష్ విదేశాంగ కార్యాలయం బుధవారం ఒక ప్రకటన చేసింది. అంతకుముందే కెనడా వైఖరిని న్యూజిలాండ్, ఆస్ట్రేలియా దేశాలు సమర్ధించాయి. తాజాగా బ్రిటన్ వత్తాసు పలికింది. కెనడాలో జరిగిన స్వతంత్ర దర్యాప్తుల్లో వెల్లడైన తీవ్ర పరిణామాల గురించి తెలుసుకున్నామని, కెనడా న్యాయ వ్యవస్థ పట్ల తమకు పూర్తి విశ్వాసం వుందని, సార్వభౌమాధికారాన్ని, చట్టపాలనను గౌరవించడం ముఖ్యమని బ్రిటన్ విదేశాంగ శాఖ పేర్కొంది. 'ఫైవ్ ఐ' దేశాలైన ఆస్ట్రేలియా, కెనడా,న్యూజిలాండ్, అమెరికా, బ్రిటన్‌లు తరచుగా ఉమ్మడి భద్రతా ప్రయోజనాలకు సంబంధించిన అంశాలపై సమన్వయంతో వ్యవహరిస్తూ వుంటాయి.

శాంసంగ్ కార్మికులకు ఎఐకెఎస్ విప్లవాభినందనలు

న్యూఢిల్లీ : చారిత్రక విజయాన్ని సాధించిన శాంసంగ్ కార్మికులకు అఖిల భారత కిసాన్ సభ (ఎఐకెఎస్) విప్లవాభినందనలు తెలియజేసింది. సిఐటియు నేతృత్వంలోని శాంసంగ్ ఇండియా వర్కర్స్ యూనియన్ (ఎస్ఐడబ్ల్యుయు) ఆధ్వర్యంలో 37 రోజుల పాటు పెద్ద ఎత్తున సమ్మె నిర్వహించిన కార్మికులను అభినందించింది. పోలీసు బలగాలను ఉపయోగించి, నేతలను అరెస్టు చేసి, వారిని వేధింపులకు గురి చేయడం వంటి అణచివేత చర్యల ద్వారా సమ్మెను విచ్ఛిన్నం చేయడానికి యాజమాన్యం అనేక ప్రయత్నాలు చేసినా లొంగక కార్మికుల తమ డిమాండ్లను సాధించుకున్నారని పేర్కొంది. ఈ పోరులో వారు చూపిన తెగువ, ధైర్యసాహసాలు భవిష్యత్ పోరాటాలకు స్ఫూర్తినిస్తాయని పేర్కొంది.

ఎన్ని చర్యలు తీసుకున్నా కార్మికులు వెనుకంజ వేయకపోవడంతో, కార్మికుల డిమాండ్ల పత్రాన్ని ఆమోదిస్తున్నట్లు, యూనియన్‌ను గుర్తిస్తున్నట్లు కంపెనీ యాజమాన్యం అంగీకరించాల్సి వచ్చింది. శాంసంగ్, సిఐటియు నేతల మధ్య చర్చలు ఏర్పాటు చేయడానికి ఐదుగురు కేబినెట్ మంత్రులతో కూడిన ప్రతినిధి బృందాన్ని మంగళవారం రాష్ట్ర ప్రభుత్వం పంపింది. అలాగే ఇంతవరకు సమ్మె చేసిన కార్మికులపై ఎలాంటి చర్యలు తీసుకోబోమని కూడా కంపెనీ ప్రకటించింది.

మరింత మెరుగైన వేతనాలు కావాలని, పని గంటలు తగ్గించాలని, తమ యూనియన్‌కు లాంఛనంగా గుర్తించాలని కోరుతూ కార్మికులు సెప్టెంబరు 9 నుండి సమ్మె ప్రారంభించారు. యూనియన్ గుర్తింపు ప్రక్రియ కోర్టుకు చేరింది. 45రోజుల్లోగా పూర్తి కావాల్సి వుంది.

కంపెనీ యాజమాన్యం ఇచ్చిన హామీల నేపథ్యంలో బుధవారం యూనియన్ జనరల్‌బాడీ సమావేశం జరిగింది. చర్చల్లో కుదిరిన ఒప్పందం మేరకు సమ్మె విరమించాలని నిర్ణయించింది. వర్కర్లందరూ గురువారం నుండి విధులకు హాజరవుతారు.

దేశంలో సమకాలీన పారిశ్రామిక పోరాటాల చరిత్రలో 1500మంది శాంసంగ్ కార్మికులు వీరోచితంగా చేసిన సమ్మె పోరాటం నిలిచిపోతుంది. వేతనాలు పెంచేందుకు కంపెనీ అంగీకరించినా సిఐటియు నేతృత్వంలో యూనిన్ తమ పారిశ్రామిక యూనిట్లలో పనిచేయడం నచ్చలేదు. దాంతో సమస్య మొదలైంది. కార్మిక వర్గం సాధించిన అద్భుతమైన విజయాన్ని భారత రైతాంగ విప్లవ సంఘంగా ఎఐకెఎస్ హృదయపూర్వకంగా స్వాగతిస్తోందని పేర్కొంది.



జమ్మూకాశ్మీర్ ముఖ్యమంత్రి ఒమర్ అబ్దుల్లా ప్రమాణ స్వీకారోత్సవానికి హాజరైన ప్రకాశ్ కరత్, చిత్రంలో అఖిలేష్, డి రాజా, ఫరూక్ అబ్దుల్లా ఉన్నారు.

కేటాయించిన రాష్ట్రాలకు వెళ్లండి

- తర్వాత వివాదం తేలుస్తాం
- ఐఎఎస్‌ల పిటిషన్లు కొట్టివేసిన తెలంగాణ హైకోర్టు

ప్రజాశక్తి- హైదరాబాద్ బ్యూరో

డిఒపిటి ఉత్తర్వులపై స్టే ఇవ్వాలని తెలంగాణ హైకోర్టును ఆశ్రయించిన ఐఎఎస్ అధికారులకు నిరాశే మిగిలింది. కేటాయించిన రాష్ట్రాలకు వెళ్లాల్సిందేనని స్పష్టం చేసింది. ప్రస్తుతం పనిచేస్తున్న రాష్ట్రం నుంచి రిలీవ్ చేయకుండా ఆదేశాలు ఇవ్వాలన్న ఐఎఎస్ అధికారులు వాణి ప్రసాద్, వాకాటి కరుణ, రొనాల్డ్ రోస్, ఆమ్రపాలి, సృజన, శివశంకర్, హరికిరణ్ పిటిషన్లను హైకోర్టు కొట్టివేసింది. దీంతో, ఆంధ్రప్రదేశ్‌లో పనిచేస్తున్న ఐఎఎస్‌లు సృజన, శివశంకర్, హరికిరణ్ బుధవారం సాయంత్రం తెలంగాణ సచివాలయంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారికి రిపోర్టు చేశారు. తెలంగాణలో పనిచేస్తున్న వాణి ప్రసాద్, వాకాటి కరుణ, రొనాల్డ్ రోస్, ఆమ్రపాలి కట్టాలను తెలంగాణ ప్రభుత్వం రిలీవ్ చేసింది. డిఒపిటి ఆదేశాలను నిలిపివేయాలన్న ఐఎఎస్‌ల అభ్యర్థనను క్యాట్ తోసిపుచ్చడంతో వారు బుధవారం తెలంగాణ హైకోర్టులో లంచ్‌మోషన్ పిటిషన్ దాఖలు చేశారు. వీటిపై జస్టిస్ అభినంద్ కుమార్ షావిలి ధర్మాసనం విచారణ చేపట్టింది. కేంద్ర ట్రిబ్యునల్‌లో నవంబరు 4న విచారణ ఉందని, అప్పటి వరకు రిలీవ్ చేయవద్దని ఐఎఎస్‌ల తరపు న్యాయవాది కోర్టును కోరారు. రిలీవ్ చేసేందుకు 15 రోజుల గడువు ఇవ్వాలని రెండు రాష్ట్రాలు డిఒపిటిని కోరాయని కోర్టు దృష్టికి తీసుకొచ్చారు. గత పదేళ్ల అనుభవాన్ని పరిగణనలోకి తీసుకోవాలన్న హైకోర్టు ఆదేశాలను కేంద్రం పరిగణనలోకి తీసుకోలేదని వాదనలు వినిపించారు. క్యాట్ తుది తీర్పు ఇచ్చే వరకు రిలీవ్ చేయవద్దని కోరారు. ఐఎఎస్‌ల వాదనలను ధర్మాసనం అభ్యంతరం వ్యక్తం చేసింది. స్టే ఇస్తూపోతే ఈ అంశం ఎన్నటికీ తేలదని వ్యాఖ్యానించింది. 'ముందుగా మీకు కేటాయించిన రాష్ట్రాల్లో చేరండి. తర్వాత వివాదాన్ని తేలుస్తాం' .అని న్యాయమూర్తి పేర్కొన్నారు. 'మీరంతా బాధ్యతాయుతమైన అధికారులు. ప్రజలకు ఇబ్బంది కలగనీయొద్దు. ఎవరు ఎక్కడ పనిచేయాలనేది కేంద్రం నిర్ణయిస్తుంది. మరోసారి పరిశీలించాలని డిఒపిటిని ఆదేశించమంటారా?' అని ఐఎఎస్‌లను ధర్మాసనం ప్రశ్నించింది. కేంద్ర ప్రభుత్వం తరపున అదనపు సొలిసిటర్ జనరల్ నరసింహాశర్మ వాదనలు వినిపించారు. ఉద్యోగులు ఎక్కడ పనిచేయాలో కోర్టులు నిర్ణయించవద్దని, క్యాట్ స్టే ఇవ్వకపోవడం సరైన నిర్ణయమేనని అన్నారు. డిఒపిటి నిర్ణయం ఎలా సరైందో పూర్తి వివరాలతో క్యాట్‌లో కౌంటర్ దాఖలు చేస్తామని తెలిపారు. ఇరువైపులా వాదనలు విన్న ధర్మాసనం ఐఎఎస్ అధికారుల పిటిషన్లను కొట్టివేస్తూ ఆదేశాలు జారీ చేసింది.

ప్రగతే లక్ష్యంగా కొత్త పాలసీలు

(మొదటి పేజీ తరువాయి)

మంత్రులు అచ్చెన్నాయుడు, పయ్యావుల కేశవ్, సవిత సభ్యులుగా ఉన్నారు.

చెత్తపన్ను రద్దు

రాష్ట్రంలో చెత్తపన్ను రద్దుకు మంత్రిమండలి ఆమోదం తెలిపిందని ముఖ్యమంత్రి చెప్పారు. రోడ్లపై గుంతలు పూడ్చేందుకు రూ.600 కోట్లను కేటాయించినట్లు సిఎం తెలిపారు. గ్రామీణ, పంచాయతీ, పట్టణ రహదారులపై ఎక్కడా గుంతలు లేకుండా ఉండే విధంగా గత క్యాబినెట్లో తీసుకున్న నిర్ణయాలకు అనుగుణంగా రహదారుల మరమ్మతులకు చేపట్టిన పనుల ప్రగతిని తెలిపే స్టేటస్ నోట్‌కూ మంత్రిమండలి ఆమోదించినట్లు తెలిపారు. పంచాయతీ రోడ్ల ఏర్పాటుకు గత ప్రభుత్వం టెండర్లు ఇచ్చిందని వాటికి సంబంధించి ఆర్థికశాఖలో ఇంతవరకు వివరాలు లేవని తెలిపారు. వీటితోపాటు కృష్ణాజిల్లా మల్లవల్లి పారిశ్రామికవాడలో ఎకరా రూ.16.50 లక్షలకు కేటాయించేందుకు నిర్ణయించినట్లు సిఎం చెప్పారు. వైసిపి ఐదేళ్ల పాలనలో ఇష్టారాజ్యంగా వ్యవహరించారని, విచారణ చేసేకొద్దీ అక్రమాలు వెలుగులోకి వస్తున్నాయని చంద్రబాబునాయుడు వివరించారు. ఇసుక విషయంలో మంత్రులను జోక్యం చేసుకోవద్దని హెచ్చరించామని, అధిక ధరలకు విక్రయిస్తున్నట్లు తెలిస్తే వెంటనే ఫిర్యాదు చేయాలని తెలిపారు. దీనికోసం ఫోన్ నెంబరు కేటాయిస్తామని పేర్కొన్నారు.

దక్షిణకోస్తాలో కుండపోత

(మొదటి పేజీ తరువాయి)

రద్దు చేసింది. వాయుగుండం గురువారం తీరం దాటే అవకాశం ఉందని రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ ఎమ్‌డి రోణంకి కూర్మనాథ్ తెలిపారు. బుధవారం సాయంత్రానికి వాయుగుండం చెన్నైకు 190, పుదుచ్చేరికి 250, నెల్లూరుకు 270 కిలోమీటర్ల దూరంలో కేంద్రీకృతమై ఉంది. నైరుతి బంగాళాఖాతంలో ఉన్న ఈ వాయుగుండం పశ్చిమ వాయువ్య దిశగా ప్రయాణం చేసి చెన్నైకి సమీపంలో పుదుచ్చేరి, నెల్లూరు మధ్య గురువారం తెల్లవారుజామున తీరాన్ని దాటే అవకాశం ఉందని అంచనా వేస్తున్నారు.

తిరుమల డ్యాముల్లోకి 250 లక్షల గ్యాలన్లు

భారీ వర్షాలతో తిరుమల్లోని డ్యాముల్లోకి 250 లక్షల గ్యాలన్ల నీరు చేరింది. ముందుజాగ్రత్త చర్యలుగా పాపవినాశనం, శ్రీవారిపాదాల మార్గాలను టిటిడి మూసివేసింది. తిరుమలలో విఐపి బ్రేక్ దర్శనాలను రద్దు చేశారు. తిరుమల గిరుల్లో మాల్వాడిగుండం భారీగా ప్రవహిస్తోంది. రేణిగుంట విమానాశ్రయంలో రన్‌వేపైకి నీరు చేరడంతో ల్యాండింగ్ సమస్య తలెత్తి ఇండిగో విమానాన్ని చెన్నయ్‌కి మళ్లించారు.

దక్షిణకోస్తాలో..

నెల్లూరు జిల్లాలో 83 మిల్లీమీటర్ల సగటు వర్షపాతం నమోదైంది. వరికుంటపాడు, మర్రిపాడు, ఆత్మకూరు మండలాల్లోని వాగులు పొంగి రోడ్లపైకి వచ్చాయి. రాకపోకలు నిలిచాయి. ప్రకాశం జిల్లా నాగులుప్పలపాడు మండలం చదలవాడలో రామన్న చెరువుకు గండి పడింది. దీంతో, 216 జాతీయ రహదారిపై ఐదు అడుగుల మేర వరద నీరు ప్రవహించడంతో రాకపోకలు స్తంభించాయి. యుద్ధప్రాతిపదికన ఈ గండిని పూడ్చారు. హనుమాపురం వాగు, కొత్తకోట వాగు పొంగి ప్రవహించాయి. మాచవరం సమీపంలో దండావాళ్ల వాగు కట్టతెగి పొలాల్లోకి వరద నీరు చేరింది. కొత్తపట్నంలో సుమారు 15 మీటర్ల మేర సముద్రం ముందుకొచ్చింది. బాపట్ల జిల్లా చినగంజాలో 267 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. చీరాల, భట్టిప్రోలు ప్రాంతాల్లో చేనేత మగ్గాల్లో వర్షపు నీరు చేరింది. చినగంజాం మండలం పెదగంజాం గ్రామం నుంచి పూర్తిగా రాకపోకలు నిల్చిపోయాయి.

రాయలసీమలో

అన్నమయ్య జిల్లా రైల్వేకోడూరులో 134 మిల్లీమీటర్లు, వైఎస్ఆర్ జిల్లా పోరుమామిళ్లలో 90 మిల్లీమీటర్ల సగటు వర్షపాతం నమోదైంది. ఈ జిల్లాల్లోని పలు ప్రాంతాల్లో వరి, ఉల్లి పంటలు నేలకొరిగాయి. వీరపునాయునిపల్లె మండలంలోని బుసిరెడ్డిపల్లెకు వెళ్లే రహదారిలోని వంక బ్రిడ్జి వరద నీటి ప్రవాహం వల్ల తెగిపోవడంతో రాకపోకలు నిలిచిపోయాయి. వైఎస్ఆర్ జిల్లాలో 2024.2 ఎకరాల్లో వరి పంట ఒరిగిపోయింది. 254.5 ఎకరాల్లో మినుము పంట నీట మునిగింది. కడప ఆర్‌టిసి బస్టాండ్‌లోకి వర్షపు నీరు చేరడంతో ప్రయాణికులు ఇబ్బందులు పడ్డారు. శ్రీసత్యసాయి జిల్లా ధర్మవరం, ముదిగుబ్బ, బత్తలపల్లి మండలాల్లో 50 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. కర్నూలు, నంద్యాల జిల్లాల్లో సిరివెళ్ల, రుద్రవరం ప్రధాన రహదారిలో బ్రిడ్జిపై వర్షపు నీరు పొంగి ప్రవహించడంతో రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. బనగానపల్లె మండలంలో పంట పొలాలు నీట మునిగాయి. ఆళ్లగడ్డ మండలం సిరివెళ్ల సమీపంలో వాగు పొంగి పొర్లుతుండడంతో రాకపోకలకు అంతరాయం ఏర్పడింది.

ఉప్పాడలో అల్లకల్లోలం..

కాకినాడ జిల్లా యు.కొత్తపల్లి మండలం ఉప్పాడ తీరంలోని సముద్రం అల్లకల్లోలంగా మారింది. అలల తాకిడికి రక్షణ రాళ్లు బీచ్ రోడ్డుపైకి కొట్టుకొస్తున్నాయి. ఉప్పాడ గ్రామంలోని మాయాపట్నం, సూరాడపేటల్లో పలు గృహాలు కోతకు గురవుతున్నాయి. ఉమ్మడి అనంతపురం జిల్లా వ్యాప్తంగా మోస్తారు వర్షాలు కురిశాయి.

4,845 కెమెరాలతో ఆర్‌టిజిఎస్ పర్యవేక్షణ

రాష్ట్రంలో పడుతున్న వర్షాలపై ఆర్‌టిజిఎస్ నిరంతర పర్యవేక్షణ చేస్తున్నట్లు సిఇఒ కె.దినేష్‌కుమార్ తెలిపారు. అధికంగా వర్షాలు పడే సూచనలు ఉన్న జిల్లాలైన నెల్లూరు, ప్రకాశం, తిరుపతి, చిత్తూరు, ప్రకాశంలలో మొత్తం 4,845 సర్వైలెన్సు కెమెరాలను ఏర్పాటు చేశామని ఒక ప్రకటనలో పేర్కొన్నారు. వీటితో అక్కడి పరిస్థితి ఎప్పటికప్పుడు సమీక్షిస్తున్నట్లు తెలిపారు. వర్షాలు తగ్గి సాధారణ పరిస్థితి నెలకొనే వరకూ సిబ్బంది అప్రమత్తంగా వ్యవహరించాలని ఆదేశించారు. ప్రతి గంటకూ నివేదికలు రూపొందించి సమర్పించాలని సూచించారు.

నివాసాల మధ్య వద్దు

- పలు జిల్లాల్లో మద్యం దుకాణాల ఏర్పాటును అడ్డుకున్న మహిళలు
- శాంతిభద్రతలకు విఘాతం కలుగుతుందని ఆందోళన
- నిబంధనలను కచ్చితంగా పాటించాలని డిమాండ్

ప్రజాశక్తి- యంత్రాంగం

నివాసాల మధ్య, విద్యా సంస్థలు, ఆలయాలకు సమీపంలో మద్యం దుకాణాలు ఏర్పాటు చేయొద్దంటూ రాష్ట్రంలోని పలు జిల్లాల్లో బుధవారం కూడా ఆందోళనలు జరిగాయి. మద్యం దుకాణాల ఏర్పాటును పలుచోట్ల అడ్డుకున్నారు. విద్యా సంస్థలు, ఆలయాలకు వెళ్లే మార్గాల్లోనూ మద్యం దుకాణాలు ఏర్పాటు చేయవద్దని, నిబంధలను కచ్చితంగా పాటించాలని డిమాండ్ చేశారు. మద్యం దుకాణాల వల్ల మహిళలకు, విద్యార్థినులకు రక్షణ కరువవుతుందని, శాంతిభద్రతలకు విఘాతం కలుగుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. మహిళలు, స్థానికులు నిరసన వ్యక్తం చేసి అధికారులకు వినతిపత్రాలు అందజేశారు.

చిత్తూరు జిల్లా కార్వేటినగరం మండలం కొల్లగుంట ఆది ఆంధ్ర దళితవాడలో వైన్ షాప్ ఏర్పాటు చేయొద్దని కోరుతూ మహిళలు వర్షంలో గొడుగులతో ధర్నా నిర్వహించారు. మందుబాబులు మద్యం సేవించి గ్రామంలో చొరబడతారని ఆవేదన వ్యక్తం చేశారు. గతంలో ఇక్కడ వైన్ షాప్ పెట్టాలని చూస్తే అడ్డుకున్నామని గుర్తు చేశారు. వర్షంలో గొడుగులతో ఆందోళన కొనసాగించారు. ఇక్కడ వైన్ షాప్ పెట్టకుండా చూస్తామని ఎస్ఐ రాజకుమార్ హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు.

పశ్చిమగోదావరి జిల్లా ఆచంట మండలం వల్లూరు పంచాయతీ పరిధి గెద్దాడవారిపాలెంలో పంట కాలువ, నివాసాల మధ్య మద్యం షాపు వద్దంటూ ఆ ప్రాంత మహిళలు, రైతులు ఎపి రైతు సంఘం ఆధ్వర్యంలో వల్లూరు-గుమ్మలూరు ఆర్ అండ్ బి రహదారిపై బైఠాయించారు. నాలుగు సంవత్సరాల క్రితం ఇదే పరిధిలో వైన్‌షాప్ పెట్టారని, దీనివల్ల మహిళలు, రైతులు ఇబ్బందులకు గురయ్యారని, ఐద్వా ఆధ్వర్యంలో ఆందోళన చేపట్టడంతో అధికారులు వైన్‌షాప్‌ను వేరేచోటకు తరలించారని గుర్తు చేశారు. ఆందోళనకు దిగిన వారితో ఎస్ఐ వెంకటరమణ మాట్లాడుతూ ఏమైనా సమస్య ఉంటే నేరుగా జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం అందిస్తే పరిష్కరిస్తారని అన్నారు. మొగల్తూరు మండలం ముత్యాలపల్లిలో జనావాసాల నడుమ మద్యం దుకాణం ఏర్పాటు చేయొద్దని ఆ ప్రాంత ప్రజలు ఆందోళన చేపట్టారు. ఆ దుకాణాన్ని దక్కించుకున్న వ్యక్తులు అక్కడికి వచ్చి రెండు నెలల్లో వేరే చోటుకు మారుస్తామని హామీ ఇచ్చినా మహిళలు అంగీకరించలేదు. దీంతో, మద్యం దుకాణం ప్రారంభించలేదు. నరసాపురం పట్టణం ఒకటో వార్డు పరిధి శ్రీహరిపేట సమీపంలో తమ కళాశాలకు దగ్గర్లో మద్యం షాపు పెట్టొద్దంటూ విద్యార్థులు నరసాపురం ఎంఎల్ఎ బొమ్మిడి నాయకర్, ఆర్‌డిఒ దాసి రాజుకు వినతిపత్రం ఇచ్చారు. ఏలూరు జిల్లా కొయ్యలగూడెంలోని కన్నాపురం రోడ్డులో వినాయకుని గుడికి చేరువలో మద్యం దుకాణం ఏర్పాటు చేయొద్దంటూ స్థానికులు తహశీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. గత ప్రభుత్వంలో ఐదేళ్లూ ఇక్కడ మద్యం దుకాణం ఉండడం వల్ల నరకం చూశామని, ఈ ప్రభుత్వంలోనైనా న్యాయం జరగాలని కోరుతూ నెల్లూరు జిల్లా బుచ్చిరెడ్డిపాలెంలోని బాంబే రోడ్డుకు అనుకొని ఉన్న శాంతినగర్‌లో మహిళలు ఆందోళనకు దిగారు. పోలీసులు అక్కడికి వచ్చి వారికి నచ్చజెప్పే ప్రయత్నం చేసినా ఫలితం లేకపోయింది. దీంతో, అక్కడ మద్యం దుకాణం ప్రారంభం కాలేదు. నివాసాల సమీపంలో మద్యం షాపు వద్దంటూ ఎన్‌టిఆర్ జిల్లా మైలవరం మండలం వెల్వడంలో మహిళలు ఆందోళనకు దిగారు. విజయనగరం జిల్లా డెంకాడ మండలం పెద్దతాడివాడలో గ్రామంలో మద్యం షాపు ఏర్పాటును గ్రామస్తులంతా అడ్డుకున్నారు. పార్వతీపురం మన్యం జిల్లా సాలూరు పట్టణం చిన బజార్ కూడలి వద్ద మద్యం దుకాణం ఏర్పాటు చేయొద్దంటూ పౌర సంఘాల ఆధ్వర్యంలో నిరసన కొనసాగింది. కర్నూలు జిల్లా ఆదోనిలో పాత శివాలయం సమీపంలో మద్యం దుకాణం ఏర్పాటును వ్యతిరేకిస్తూ మున్సిపల్ చైర్‌పర్సన్ శాంతకు, మున్సిపల్ కమిషనర్ కృష్ణకు మహిళలు వినతిపత్రం ఇచ్చారు. అధికారులు స్పందించకపోతే రోడ్డుపై బైఠాయిస్తామని హెచ్చరించారు. జనావాస మధ్య మద్యం దుకాణాలను ఏర్పాటు చేయవద్దని కోరుతూ మంగళవారం కూడా రాష్ట్రంలోని పలు జిల్లాల్లో ఆందోళనలు జరిగిన విషయం విదితమే.

తెలంగాణలో ఘోరరోడ్డు ప్రమాదం

- అతివేగంతో చెట్టును ఢీకొట్టిన కారు
- ఏడుగురు మృతి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

తెలంగాణ రాష్ట్రంలో ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. అతివేగంతో దూసుకొచ్చిన ఓ కారు అదుపుతప్పి చెట్టును ఢీకొట్టి వాగులో పడిపోయింది. ఈ ప్రమాదంలో అక్కడికక్కడే ఏడుగురు మృతి చెందారు. ఈ సంఘటన మెదక్ జిల్లా శివ్వంపేట మండలంలో బుధవారం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. శివ్వంపేట మండలంలోని శంకర్‌తండా, సీతారాంతండా, తాళ్లపల్లితండాకు చెందిన ఎనిమిది మంది.. ఓ కారులో తూప్రాన్ మండలం వెంకటాయపల్లి తండాలోని బంధువుల ఇంట్లో శుభకార్యానికి హాజరయ్యారు. తిరుగు ప్రమయాణంలో ఉసిరికపల్లి చక్కెర ఫ్యాక్టరీ సమీపంలోని బిడ్జి వద్ద వారు ప్రయాణిస్తున్న కారు అతివేగంగా చెట్టును ఢీకొని వాగులో పడిపోయింది. ఈ ప్రమాదంలో తాళ్లపల్లి తండాకు చెందిన ధనవత్ శివరాం (55), ధనవత్ దుర్గమ్మ (45), జెగ్య తండాకు చెందిన మాలోత్ అనిత (30), మాలోత్ బిందు (14), మాలోత్ శ్రావణి (12), భీమ్లా తండాకు చెందిన గుగులోత్ శాంతి (45), గుగులోత్ మమత (16) అక్కడికక్కడే మృతి చెందారు. ఎస్ఐ మహిపాల్ రెడ్డి తన సిబ్బందితో ఘటనా స్థలానికి చేరుకుని జెసిబి సహాయంతో వాగులోని కారును బయటకు తీశారు. కారు నుజ్జునుజ్జు కావడంతో అందులో మృతదేహాలను బయటకు తీసేందుకు తీవ్రంగా శ్రమించాల్సి వచ్చింది. డ్రైవర్ నామ్‌సింగ్‌కు తీవ్ర గాయాలు కావడంతో ఆస్పత్రికి తరలించారు. ఘటనా స్థలాన్ని తూప్రాన్ డిఎస్‌పి వెంకట్ రెడ్డి సందర్శించారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం నర్సాపూర్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

కప్పచెప్పిన గొప్ప సత్యం

'కప్పా! కప్పా! నీట్లో తెప్పా!!
ఏమిటి నీ గొప్ప?
ఎరిగించుము కప్పా!'

'బాబూ! బాబూ!!
వీటికి జవాబు
చెప్పేస్తా బాబు
విప్పేస్తా బాబు

తెడ్డుకాళ్ళ దానను
ఒడ్డునుండు దానను
ఉభయచరాన్నంటారు
ఊరి చెరువునుంటాను"

'ఎలా బతుకుతుంటావు?
ఏమిటి తింటుంటావు?'

'నాచును తింటుంటాను
పురుగును పట్టేస్తాను
బెకబెకమని డప్పుగొట్టి
బెదరక నడిచేస్తాను'

'వర్షం పడితే మీరు
వచ్చివాలి పోతారు
అప్పటివరకెక్కడుండి
గప్పున వచ్చేస్తారు?'

'రాళ్ళ కింద నిద్రిస్తూ
రాకుండా గడిపేస్తాం
శ్వాసకాస్త నెమ్మదిస్తు
చలనం తగ్గించేస్తాం!

వర్షాకాలం వచ్చిన
వరుసగ వచ్చేస్తుంటాం
తెప్పలుగా చెరువులున్న
కప్పలు పదివేలుంటాం!

బెకబెకమను మగకప్పలు
గుర్తు పట్టు స్త్రీకప్పలు
గుడ్లు పెట్టు వేనవేలు
తోకకప్పలగును గుడ్లు

నాచు మేసి చేపలవలె
నీటతిరుగునొక్క దశ
ముందుకాళ్ళదొక్క దశ
వెనుకకాళ్ళదొక్క దశ

తోకలుగల చిరుకప్పలు!
తిరుగుచుండునొక్క దశ
ఊపిరితిత్తులు మొలుచును
జీవించుట చివరి దశ!'

'మిమ్ముచూసి పాములన్ని
పడగగెత్తుచు వస్తాయట!
మీరు కంట పడగానే
పరుగులెత్తి వస్తాయట!'

'బాబూ! ఈలోకంలో
ఆహారపు గొలుసున్నది!
అందుకు లోబడి బతుకుట
సృష్టి జీవధర్మమది!

మనుగడలో ప్రతి జీవికి
పోరాటం తప్పదులే!
ప్రకృతిలో పుట్టువులవి
ప్రకృతిలో కలియునులే!'

కప్ప మాట విన్న బాబు
దొరికిందని తన జవాబు
కప్పకు 'టాటా' చెప్పెను
యింటికి వేగము చేరెను !

– కిలపర్తి దాలినాయుడు,
సాంఘిక శాస్త్రోపాధ్యాయుడు,
జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల
రామభద్రపురం.



సరైన నీడ ఏది?

పిల్లలూ, ఇక్కడ చిన్న పిట్ట ఉంది.
దాని పక్కనే కొన్ని నీడలు ఉన్నాయి.
వాటిలో పిట్ట సరైన నీడ ఏదో
కనిపెట్టండి చూద్దాం.

జవాబు : 3

నేను గీసిన బొమ్మ

ఎం.రిషిత,
5వ తరగతి, ఎంపిపిఎస్
యర్రాబాడు గ్రామం,
నరసన్నపేట మండలం,
శ్రీకాకుళం జిల్లా.

పిల్లలూ, మీ కథలు, బొమ్మలూ పంపండి. ఇదిగో మెయిల్ ఐడీ: chinnaarips@gmail.com

రెండు నెలల్లో టెండర్లు

అమరావతిలో పనులపై సిఆర్‌డిఎ నిర్ణయం

ట్రంక్ ఇన్‌ఫ్రా కోసం డిపిఆర్

ప్రజాశక్తి – అమరావతి బ్యూరో

రాజధాని అమరావతి నగరంలో ట్రంక్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ పూర్తి కోసం డిపిఆర్ తయారు చేయాలని, నిలిచిపోయిన అన్ని పనులకూ రెండు నెలల్లో టెండర్లు పిలవాలని సిఆర్‌డిఎ 38వ అథారిటీ నిర్ణయించింది. బుధవారం సాయంత్రం ముఖ్యమంత్రి చంద్రబాబు ఆధ్వర్యాన ఈ సమావేశం జరిగింది. ఈ సమావేశం సిఆర్‌డిఏకు సంబంధించిన నాలుగు ఆర్థిక సంవత్సరాల ఆడిట్ నివేదికలను ఎజికి సమర్పించేందుకు ఆమోదం తెలిపారు. ఎన్విరాన్‌మెంట్ అండ్ సోషల్ మేనేజ్‌మెంట్ యూనిట్ ఏర్పాటుకు అథారిటీ ఆమోదం తెలిపింది. ఎమ్మెల్యే ఎమ్మెల్సీ ఆలిండియా సర్వీసు అధికారుల భవనాల పాత టెండర్లు రద్దు చేసింది. పెండింగ్ పనులు రూ.524.70 కోట్లతో పూర్తిచేయాలని టెండర్లు పిలిచేందుకు ఆమోదించింది. ఎపిసిఆర్‌డిఏ ప్రాజెక్టు ఆఫీసు పెండింగ్ పనుల పూర్తికి ఎల్‌వన్‌గా నిలిచిన సంస్థలకు బాధ్యతలు అప్పగించాలని నిర్ణయించారు. క్యాపిటల్ సిటీ అభివృద్ధికి ప్రపంచబ్యాంకు, ఆసియా డెవలప్‌మెంట్ బ్యాంకు నుండి రూ.15 వేల కోట్ల రుణం తీసుకోవాలనే ప్రతిపాదనను ఆమోదించారు. సిఆర్‌డిఏ ఏర్పాటైన తరువాత 2017 సంవత్సరం నుండి ఆడిట్ జరగలేదు. వీటికి సంబంధించిన రిపోర్టులు వెంటనే ఎజికి సమర్పించాలని నిర్ణయించారు. రూ.50 వేల కోట్ల వ్యయంతో చేపట్టిన ప్రాజెక్టు కావడంతో ప్రతి నిర్మాణానికి పర్యావరణ అనుమతి అవసరం ఉంది.

రాజధాని ప్రాంత అభివృద్ధిపై 'క్రిడా' అధికారులతో సమీక్షిస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు

దీనికోసం ప్రత్యేకంగా ఎన్విరాన్‌మెంట్ అండ్ సోషల్ మేనేజ్‌మెంట్ యూనిట్ ఏర్పాటు చేయాలనే సిఆర్‌డిఏ నిర్ణయానికి అథారిటీ ఆమోదముద్ర వేసింది. సిఆర్‌డిఏ ప్రాజెక్టు ఆఫీసు పూర్తికి ఎల్‌వన్‌గా నిలిచిన కెసిపి సంస్థకు పనులు అప్పగించాలని అథారిటీ నిర్ణయించింది.

34 రోడ్లు ... మురుగునీటి కాలువలు

రాజధాని నగరంలో ట్రంక్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ అభివృద్ధిలో భాగంగా 34 రోడ్లు, మురుగునీటి కాలువలు, నీటి సరఫరా నెట్‌వర్కు, పవర్ సదుపాయాలు, వరద నివారణ పనులు, పాలవాగు, కొండవీటివాగు కాలువ నిర్మాణాలు చేపట్టనున్నారు. అలాగే శాఖమూరు, నీరుకొండ, కృష్ణాయపాలెంలో రిజర్వాయర్లను విస్తరించాలని నిర్ణయించారు. వరద నీటి నిర్వహణ కోసం ప్రస్తుతం ఉండవల్లి వద్ద ఉన్న లిఫ్టును పెంచాలని, వైకుంఠపురం వద్ద రెండో లిఫ్టు ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. గతంలో నిలిచిపోయిన పనుల పరిస్థితిని అంచనా వేసేందుకు టెక్నికల్ కమిటీని ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. దీని టెండర్లు ఆర్‌వి అసోసియేట్స్ దక్కించుకుంది. అమరావతికి సంబంధించి అన్ని టెండర్లు నవంబరు, డిసెంబర్‌లోగా పూర్తవుతాయి,.

జనవరిలోపు అసెంబ్లీ, సచివాలయ టెండర్లు

అసెంబ్లీ, సెక్రటేరియట్ పనులకు అవసరమైన టెండర్లను జనవరిలోపు పిలుస్తామని ఈ సమావేశ నిర్ణయాలను మీడియాకు వివరించిన పురపాలక శాఖ మంత్రి నారాయణ తెలిపారు. ఈ పనులన్నీ రెండేళ్లలో పూర్తవుతాయని తెలిపారు. ఐకానిక్ భవనాలు రెండున్నరేళ్లలో పూర్తవుతాయని పేర్కొన్నారు. అసైన్డ్ రైతులకూ కౌలు వేశామని పేర్కొన్నారు. ఇంకా 1400 మందికి ఇవ్వాలి ఉందని చెప్పారు. గతంలో భూములు ఇచ్చిన వారికి లాటరీ పద్ధతిలో పదిరోజుల్లో ప్లాట్లు ఇవ్వాలని నిర్ణయించినట్లు తెలిసింది. అమరావతిలో జంగిల్ క్లియరెన్స్ పూర్తయిందని, సింగపూర్ గవర్నమెంటును రాజధాని నిర్మాణంలో భాగస్వామ్యం చేసే అంశంపై ఇంకా మాట్లాడాల్సి ఉందని చెప్పారు. కరకట్టరోడ్డును నాలుగు లైన్లుగా విస్తరించాలని నిర్ణయించామని చెప్పారు. దీనిపై లీ అనే సంస్థ అధ్యయనం చేస్తోందని వివరించారు. కొత్తగా 200 ఎకరాలు పూలింగులో ఇచ్చారని, ఇవ్వనివారి భూములకు సేకరణ నోటిఫికేషన్ ఇస్తామని మంత్రి చెప్పారు. తెలిపారు.. ఐకానిక్ బ్రిడ్జి నిర్మించాలనుకున్న చోట జాతీయ రహదారి వచ్చిందని, దీంతో అక్కడ ఐకానిక్ ప్లాను అమలు జరగడంలేదని, ఇన్నర్‌రింగురోడ్డు లేదా ఔటర్‌రింగురోడ్డు నిర్మించే సమయంలో ఐకానిక్ బ్రిడ్జి నిర్మిస్తామని మంత్రి నారాయణ తెలిపారు. ఈ సమావేశంలో ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి నీరబ్‌కుమార్ ప్రసాదు, పట్టణాభివృద్ధిశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అనిల్‌కుమార్ సింఘాల్, సిఆర్‌డిఏ కమిషనర్ కాటంనేని భాస్కర్, అధికారులు కాంతిలాల్ దండే, సిఎం సెక్రటరీ ప్రద్యుమ్న తదితరులు పాల్గొన్నారు. ఈ సమావేశంలో పలు కీలక నిర్ణయాలు తీసుకున్నారు. వీటిని మంత్రి నారాయణ మీడియాకు వివరించారు.

అన్న క్యాంటీన్లకు టిడిపి రంగుపై పిల్

ప్రజాశక్తి–అమరావతి

రాష్ట్రంలోని అన్న క్యాంటీన్ల బిల్డింగ్స్‌కు అధికార టిడిపి జెండా రంగులు వేయడాన్ని సవాల్ చేస్తూ దాఖలైన పిల్‌ను బుధవారం చీఫ్ జస్టిస్ ధీరజ్ సింగ్ ఠాకూర్ ఆధ్వర్యంలోని డివిజన్ బెంచ్ విచారణ జరిపింది. కౌంటర్ దాఖలు చేయాలని ప్రతివాదులైన ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, పురపాలకశాఖ ముఖ్య కార్యదర్శులకు నోటీసులు జారీ చేసింది. తదుపరి విచారణను 6 వారాలకు వాయిదా వేసింది. అన్న క్యాంటీన్లకే కాకుండా ప్రభుత్వ భవనాలకు టిడిపి జెండా రంగు పసుపు, ఎరుపు వేయడాన్ని తప్పుపడుతూ ఎపి ఎన్‌జిఒ సంఘం పూర్వ అధ్యక్షులు నలమారు చంద్రశేఖర్ రెడ్డి పిల్ వేశారు.

మంత్రులపై సిఎం ఆగ్రహం

- **మద్యం, ఇసుకలో జోక్యమే కారణం**

ప్రజాశక్తి – అమరావతి బ్యూరో

ఇసుక, మద్యం విషయంలో మంత్రుల జోక్యంపై ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసినట్లు తెలిసింది. బుధవారం జరిగిన మంత్రిమండలి సమావేశంలో ఇసుక అంశంపై సిఎం తీవ్రంగా స్పందించినట్లు సమాచారం. క్షేత్రస్థాయిలో ఇసుక వ్యవహారం ప్రభుత్వ పనితీరుపై ప్రతికూల ప్రభావం చూపిస్తోందని, ప్రజల్లో అసంతృప్తి పెరుగుతోందని సిఎం అన్నట్లు తెలిసింది. ఈ విషయాల్లో జోక్యం చేసుకోవద్దంటూ గతంలోనే చెప్పిన విషయాన్ని సిఎం తాజాగా ప్రస్తావించారు. ఇప్పటికి రెండుసార్లు చెప్పానని, ఇక ముందు ఇసుక విషయంలో జోక్యం చేసుకున్నా, వ్యక్తిగతంగా బెదిరింపులకు దిగినా సహించేది లేదని హెచ్చరించినట్లు సమాచారం, అలాగే అధికారులు, పోలీసులు కూడా వారి పనులు వారు చేసుకోవాలే తప్ప అన్ని విషయాల్లోనూ జోక్యం చేసుకోవద్దని తెలిపారు. ఇసుకపై ఫిర్యాదులు స్వీకరించేందుకు సిఎంఒ స్థాయిలోనే ఒక కమిటీని ఏర్పాటు చేస్తామని, వేర్వేరు రూపాల్లో ఇసుకపై వచ్చే ఫిర్యాదులను స్వీకరించి ప్రతిరోజూ నివేదిక ఇస్తారని తెలిపారు. ఇకముందు ఇసుక వ్యవహారంలో మంత్రుల పేర్లు ఎట్టిపరిస్థితుల్లోనూ ఉండకూడదని ఆదేశించారు.

అరాచక ఘటనల్లో వైసిపి నాయకుల పాత్ర

రాష్ట్రంలో వరుసగా జరుగుతున్న అరాచక ఘటనల్లో వైసిపి నాయకుల పాత్ర ఉన్నట్లు తేలిందని సిఎం మంత్రిమండలిలో చెప్పినట్లు తెలిసింది. హిందూపురంలో మహిళలపై గ్యాంగ్ రేప్ ఘటనలోనూ నిందితుడు వైసిపికి అనుకూల వ్యక్తేనని, త్వరలోనే వివరాలు బయటపెడతామని చెప్పినట్లు తెలిసింది. అలాగే ప్రభుత్వానికి చెడ్డపేరు తీసుకువచ్చేందుకు కొన్ని శక్తులు పనిచేస్తున్నాయని, కొంతమంది గంజాయి, మాదక ద్రవ్యాలు ఎరగా వేసి అరాచకాలు చేయించేందుకు ప్రయత్నాలు చేస్తున్నారని, వారికి వైసిపి నాయకత్వం నుండి ప్రోత్సాహం ఉంటోందని ప్రాథమిక సమాచారం ఉందని సిఎం అన్నట్లు తెలిసింది. ఈ నేపథ్యంలో గంజాయి అంశాన్ని తీవ్రంగా పరిగణించాలని నిర్ణయించినట్లు సిఎం పేర్కొన్నారు.

బెదిరింపులకు దిగిన వారికి హెచ్చరికలు

ఎక్సైజ్‌శాఖ కేటాయించిన మద్యం షాపులు తమకు ఇచ్చేయాలని పలు ప్రాంతాల్లో ఎమ్మెల్యేలు, ఒకటీ రెండుచోట్ల మంత్రుల అనుచరులు బెదిరింపులకు దిగిన అంశంపైనా మంత్రులను సిఎం హెచ్చరించినట్లు తెలిసింది. ఇలాంటి చర్యల వల్ల ప్రభుత్వంపై ప్రజల్లో తప్పుడు ప్రచారం వెళ్లే ప్రమాదం ఉందని ఆగ్రహం వ్యక్తం చేశారు. బహిరంగంగా బెదిరింపులకు దిగడంపై మంత్రులను మందలించినట్లు తెలిసింది. ఆయా జిల్లాల్లో ఎమ్మెల్యేలను కూడా మంత్రులు నియంత్రించాలని, ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తే కుదరదని అన్నారు.

డ్రోన్ హ్యాక్‌థాన్ గడువు పొడిగింపు

- **ఎమ్‌డి కె దినేష్‌కుమార్**

ప్రజాశక్తి–అమరావతి బ్యూరో

డ్రోన్ హ్యాక్‌థాన్ పోటీల దరఖాస్తు గడువును రాష్ట్ర ప్రభుత్వం మరో రెండు రోజులు పొడిగించింది. ఈ నెల 22, 23 తేదీల్లో అమరావతి డ్రోన్ సమ్మిట్–2024ను ప్రభుత్వం నిర్వహించనున్న సంగతి తెలిసిందే. ఈ సదస్సులో నిర్వహించే హ్యాక్‌థాన్ పోటీల కోసం 400 మంది ఔత్సాహికులు పేర్లు నమోదుచేసుకోగా, మరింత మంది పాల్గొనేందుకు ఉత్సాహం చూపుతున్నారని ఎపి డ్రోన్స్ కార్పొరేషన్ సిఎమ్‌డి కె దినేష్‌కుమార్ తెలిపారు. పాల్గొనేవారు ఈ నెల 17లోపు తమ పేర్లను ఆన్‌లైన్ ద్వారా నమోదు చేసుకోవచ్చునని బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 9 థీమ్స్‌లో జరిగే పోటీల్లో గెలుపొందిన విజేతలకు నాలుగు కేటగిరీలుగా వర్గీకరించి ప్రతి కేటగిరి నుంచి ముగ్గురు విజేతలను ఎంపిక చేస్తామని వెల్లడించారు. ప్రతి విభాగంలో ప్రథమ బహుమతి రూ.3 లక్షలు, ద్వితీయ బహుమతి రూ.2 లక్షలు, తృతీయ బహుమతి రూ.లక్ష చొప్పున నగదు అందిస్తామని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు చేతుల మీదగా 22న విజేతలకు బహుమతులు అందిస్తామని తెలిపారు.

ముఖ్యమంత్రికి ఆహ్వానం

డ్రోన్ సమ్మిట్–2024 ఆహ్వాన పత్రాన్ని సిఎం చంద్రబాబుకు పెట్టుబడులు, మౌలిక సదుపాయాల కల్పనశాఖ మంత్రి బిసి జనార్ధన రెడ్డి బుధవారం సచివాలయంలో అందజేశారు. మంత్రితోపాటు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, నీరబ్‌కుమార్ ప్రసాద్, మౌలిక సదుపాయాల కల్పనశాఖ కార్యదర్శి ఎస్ సురేష్‌కుమార్, డ్రోన్స్ కార్పొరేషన్ సిఎమ్‌డి కె దినేష్‌కుమార్ ఉన్నారు.

జగన్ ఇంటి రక్షణ గడ్డర్‌కు అనుమతులేవీ? : వర్ల రామయ్య

ప్రజాశక్తి–అమరావతి బ్యూరో

మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తన ఇంటిని అత్యంత భద్రతతో కట్టుకోవాల్సిన అవసరమేమొచ్చిందని టిడిపి పొలిట్‌బ్యూరో సభ్యులు వర్ల రామయ్య ప్రశ్నించారు. టిడిపి కార్యాలయంలో బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. జగన్ ఇంటికి రక్షణ గడ్డర్‌కు రూ.12.85 కోట్ల ప్రజాధనం ఖర్చు చేయడానికి ఎవరు అనుమతించారో చెప్పాలన్నారు. కాగా టిడిపి కార్యాలయంలో మాజీ మంత్రి కెఎస్ జవహర్, మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద్ సత్యనారాయణ, టిడిపి క్రిస్టియన్ సెల్ అధ్యక్షులు స్వామిదాసులు గ్రీవెన్స్ నిర్వహించారు. అర్జీదారుల నుంచి వినతులు స్వీకరించి సమస్యలపై సంబంధిత అధికారులతో ఫోన్‌లో మాట్లాడారు.

మిథున్‌రెడ్డి పర్యటనపై ఆంక్షలు ఉన్నాయా? : హైకోర్టు

ప్రజాశక్తి–అమరావతి

రాజంపేట ఎంపి పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డిని పుంగనూరు వెళ్లకుండా ఏమైనా ఆంక్షలు విధించారో లేదో చెప్పాలని పోలీసులను హైకోర్టు ప్రశ్నించింది. నియంత్రణ ఆదేశాలు జారీ చేస్తే వాటి ప్రతిని అందజేయాలని ఆదేశించింది. విచారణను ఈ నెల 22కు వాయిదా వేస్తూ జస్టిస్ విఆర్ కృపాసాగర్ బుధవారం ఆదేశాలిచ్చారు.

- భద్రతపై వైసిపి మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి దాఖలు చేసిన పిటిషన్‌పై జస్టిస్ బివిఎల్ చక్రవర్తి విచారణ జరిపారు. పిటిషనర్‌కు ఉన్న భద్రత వివరాలను అందజేయాలని పోలీసులను ఆదేశించారు. తదుపరి విచారణను ఈ నెల 19కి వాయిదా వేశారు.

డ్రైవింగ్‌లో డ్రైవర్‌కి గుండెపోటు

- **పొలంలోకి దూసుకెళ్లిన ఆర్‌టిసి బస్సు**
- **డ్రైవర్‌తో సహా బస్సు ఢీకొని సైక్లిస్ట్ మృతి**

ప్రజాశక్తి–కర్లపాలెం (బాపట్ల జిల్లా)

ప్రయాణ సమయంలో గుండెపోటు రావడంతో ఆర్‌టిసి బస్సు డ్రైవర్ ప్రయాణికులను కాపాడి తాను మృతి చెందారు. బస్సు ఢీకొనడంతో సైక్లిస్ట్ కూడా చనిపోయారు. ఈ ఘటన బాపట్ల జిల్లా కర్లపాలెం జాతీయ రహదారిపై చోటుచేసుకుంది.

బస్సు కండక్టర్ వినుకొండలరావు, ప్రయాణికులు తెలిపిన వివరాల ప్రకారం.. బాపట్ల డిపోకు చెందిన ఆర్‌టిసి బస్సు బుధవారం ఉదయం రేపల్లె నుంచి చీరాల వెళుతోంది.కర్లపాలెం జాతీయ రహదారి వద్ద బస్సు డ్రైవర్ డి సాంబశివరావు (54)కు గుండెపోటు వచ్చింది. దీంతో, బస్సును పక్కనే ఉన్న పొలాల్లోకి పోనిచ్చారు. సీటులో పడిపోయి ఉన్న డ్రైవర్‌ను కండక్టర్, ప్రయాణికులు పరిశీలించగా ఆయన చనిపోయి ఉన్నారు. పొలాల్లోకి వెళ్లే సమయంలో ముందు వెళుతున్న సైకిల్‌ను బస్సు ఢీకొట్టింది. సైకిల్‌పై వెళుతున్న కొత్తనందయపాలెంకు చెందిన పిట్టు వెంకటేశ్వరరెడ్డి (60) కాలికి తీవ్ర గాయమైంది. ఆయనను 108 లో బాపట్ల ఏరియా వైద్యశాలకు తరలించారు. మెరుగైన చికిత్స కోసం గుంటూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలిస్తుండగా మార్గమధ్యలో ఆయన మృతి చెందారు. ప్రమాద సమయంలో బస్సులో సుమారు 60 మంది ప్రయాణికులు ఉన్నారు. డ్రైవర్ బస్సును పొలంలోకి పోనివ్వడంతో పెద్ద ప్రమాదం తప్పిందని ప్రయాణికులు తెలిపారు.

సినీ నిర్మాత నళినీరంజన రావు మృతి

ప్రజాశక్తి – రామచంద్రపురం(డాక్టర్ బిఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లా)

ప్రముఖ తెలుగు సినీ నిర్మాత దామిశెట్టి నళినీరంజనరావు (82) వయోభారంతో బుధవారం మృతి చెందారు. డాక్టర్ బిఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా రామచంద్రపురం మండలం తోటపేటలోని స్వగృహంలో ఆయన కన్నుమూశారు. ఆయనకు భార్య, కుమారుడు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. నిర్మాత మిద్దె రామారావు, అంగర సత్యంలతో కలిపి రాజ్యలక్ష్మి ఆర్ట్స్ బ్యానర్‌పై ఆయన తెలుగు చిత్రాలను నిర్మించారు. పల్లెటూరి మొనగాడు, పదహారేళ్ల వయసు వంటి చిత్రాలు విశేష ప్రేక్షకాధరణ పొందాయి. ఆయన మృతికి పలువురు రాజకీయ నాయకులు, గ్రామ ప్రముఖులు నివాళులర్పించారు. తోటపేటలో బుధవారం సాయంత్రం ఆయన అంత్యక్రియలను పూర్తి చేశారు.

'అఖండ 2' షూటింగ్ ప్రారంభం

నందమూరి బాలకృష్ణ హీరోగా, బోయపాటి శ్రీను దర్శకత్వంలో తెరకెక్కుతున్న 'అఖండ 2' సినిమా షూటింగ్ బుధవారం ప్రారంభమైంది. హైదరాబాద్‌లో జరిగిన ఈ కార్యక్రమంలో చిత్రబృందంతో పాటు బాలకృష్ణ కుమార్తెలు బ్రాహ్మణి, తేజస్విని, ఇతర కుటుంబ సభ్యులు హాజరయ్యారు. ముహూర్తపు షాట్‌కు బ్రాహ్మణి క్లాప్ కొట్టారు. బాలకృష్ణ–బోయపాటి శ్రీను కాంబినేషన్‌లో గతంలో వచ్చిన 'సింహా', 'లెజెండ్', 'అఖండ' సినిమాలు భారీ విజయాన్ని అందుకున్నాయి. 2021లో ప్రేక్షకుల ముందుకొచ్చిన 'అఖండ' బాలయ్య కెరీర్‌లోనే భారీ విజయాన్ని సాధించిన సినిమాల జాబితాలో చేరింది. ఇందులో బాలయ్య ద్విపాత్రాభినయంతో ఆకట్టుకున్నారు. 'అఖండ 2' కూడా అద్భుతంగా తెరకెక్కిస్తామని పలు సందర్భాల్లో బోయపాటి వెల్లడించారు. బుధవారం 'అఖండ 2 తాండవం'ను టైటిల్‌గా ప్రకటించారు. ఈ సినిమాలో ప్రగ్యాజైస్వాల్ కీలకపాత్రలో నటించనున్నారు. తమన్ సంగీతం సమకూర్చనున్నారు. 14 రీల్స్ ప్లస్ పతాకంపై ఈ సినిమా నిర్మితమవుతోంది.

తొలి రోజు ఆట వర్షార్పణం

- **భారత్–న్యూజిలాండ్ తొలి టెస్టు**

బెంగుళూరు: బెంగుళూరు వేదికగా భారత్–న్యూజిలాండ్ జట్ల మధ్య జరగాల్సిన తొలి టెస్ట్‌కు వర్షం అడ్డంకిగా నిలిచింది. భారీ వర్షం కారణంగా తొలుత తొలి రెండు సెషన్ల ఆటను రద్దు చేసిన అంపైర్లు టి విరామం తర్వాత మూడో సెషన్ ఆటను రద్దు చేస్తున్నట్లు ప్రకటించారు. బుధవారం ఉదయం నుంచి చిన్నస్వామి స్టేడియంలో కవర్స్ కప్పి అలానే ఉంచారు. బుధవారం రోజంతా అడపాదడపా జల్లు కురుస్తూనే ఉంది. మరోవైపు స్టార్ బ్యాటర్ విరాట్ కోహ్లీ, యశస్వి జైస్వాల్ ఇండోర్ ప్రాక్టీస్ చేశారు. టీ బ్రేక్ తర్వాత.. పిచ్‌ను పరిశీలించిన అంపైర్లు ఆటను రద్దు చేస్తున్నట్లు ప్రకటించారు. కనీసం టాస్ వేసేందుకు కూడా అవకాశం దక్కలేదు. బెంగళూరులో భారీ వర్షాలు కురుస్తుండడంతో రెండోరోజు ఆట అయినా సజావుగా సాగుతుందా? లేదా? అనేది సందేహాస్పదమే. మూడు టెస్ట్ మ్యాచ్‌ల సిరీస్ ఆడేందుకు న్యూజిలాండ్ జట్టు భారత పర్యటనకు వచ్చిన సంగతి తెలిసిందే. న్యూజిలాండ్ జట్టు గత ఐదు టెస్టుల్లో 4 మ్యాచ్‌లలో ఓడిన నిరాత్సాహంలో ఉండగా.. భారత జట్టు బంగ్లాదేశ్‌పై క్లీన్‌స్వీప్ చేసిన ఉత్సాహంతో ఈ సిరీస్‌కు సిద్ధమైంది. న్యూజిలాండ్‌తో సిరీస్‌ను 3–0తో క్లీన్‌స్వీప్ చేస్తే ఆస్ట్రేలియాతో ఐదు టెస్టుల సిరీస్ ఫలితంతో సంబంధం లేకుండా భారతజట్టు వరుసగా మూడోసారి డబ్ల్యుటిసి ఫైనల్ బెర్తును ఖాయం చేసుకుంటుంది.

వర్షంతో చిన్నస్వామి స్టేడియం మైదానాన్ని కవర్లతో కప్పిన దృశ్యం

డకెట్ సెంచరీ

ఇంగ్లండ్ 239/6

ముల్తాన్: పాకిస్తాన్‌తో జరుగుతున్న రెండోటెస్ట్‌లో ఇంగ్లండ్ ఓపెనర్ డకెట్ సెంచరీతో కదం తొక్కాడు. దీంతో ఇంగ్లండ్ జట్టు రెండోరోజు ఆట ముగిసే సమయానికి 6వికెట్ల నష్టానికి 239పరుగులు చేసింది. ఇంగ్లండ్ ఓపెనర్ క్రాలే(27) నిరాశపరిచినా.. మరో ఓపెనర్ డకెట్(114) సెంచరీతో కదం తొక్కాడు. కెప్టెన్ పోప్(29), రూట్(34) సహకారంతో సెంచరీని పూర్తి చేశాడు. రెండోరోజు ఆట ముగిసే సమయానికి స్మిత్(12), కర్సే(2) క్రీజ్‌లో ఉన్నారు. పాకిస్తాన్ బౌలర్లు సాజిద్ ఖాన్‌కు నాలుగు, నోమన్ అలీకి రెండు వికెట్లు దక్కాయి. అంతకుముందు ఓవర్‌నైట్ స్కోర్ 5వికెట్ల నష్టానికి 259పరుగులతో శుక్రవారం రెండోరోజు ఆటను కొనసాగించిన పాకిస్తాన్ జట్టు 366పరుగులకు ఆలౌటైంది. లోయర్ ఆర్డర్ బ్యాటర్లు నోమన్ అలీ(32), అమీర్ జమాల్(37) బ్యాటింగ్‌లో రాణించారు. ఇంగ్లండ్ బౌలర్లు లీచ్‌కు నాలుగు, బ్రాడెన్ కర్సేకు మూడు, పోట్‌కు రెండు వికెట్లు దక్కాయి.

త్రీసా-గాయత్రి జోడీ ఓటమి

డెన్మార్క్ ఓపెన్ బ్యాడ్మింటన్ టోర్నీ

ఒడెన్సె(డెన్మార్క్): డెన్మార్క్ ఓపెన్ సూపర్–750లో భారత షట్లర్ల ఓటముల పరంపర కొనసాగుతోంది. తొలిరోజు లక్ష్యసేన్, మాళ్విక, ఆకర్షి కశ్యప్, పాండా సిస్టర్స్ నిష్క్రమించగా.. రెండోరోజు కరుణాకరన్, త్రీసా జోలీ–గాయత్రీ జంట పరాజయాన్ని చవిచూశాడు. బుధవారం జరిగిన తొలిరౌండ్ పోటీలో గాయత్రి గోపీచంద్–త్రీసా జోలీ జంట 21–19, 17–21, 15–21తో మలేషియా జంట చేతిలో పోరాడి ఓడారు. ఇక పురుషుల సింగిల్స్‌లో కరుణాకరన్ 15–21, 21–17, 20–22తేడాతో చైనీస్ తైపీకి చెందిన ఎల్.వై. సూ చేతిలో ఓటమిపాలయ్యాడు.

జైస్వాల్‌కు 4వ ర్యాంక్

ఐసిసి టెస్ట్ ర్యాంకింగ్స్ విడుదల

దుబాయ్: అంతర్జాతీయ క్రికెట్ మండలి (ఐసిసి) తాజా టెస్ట్ ర్యాంకింగ్స్‌లో జైస్వాల్ 4వ ర్యాంక్‌లో నిలిచాడు. బ్యాటర్ల విభాగంలో కోహ్లి, రిషబ్ పంత్ టాప్–10లో చోటు దక్కించుకున్నారు. జైస్వాల్ 792రేటింగ్ పాయింట్లతో 4వ స్థానంలో నిలువగా.. ఇంగ్లండ్ కెప్టెన్ హారీ బ్రూక్ 829 రేటింగ్ పాయింట్లతో జైస్వాల్‌ను అధిగమించి మూ డో స్థానానికి ఎగబాకాడు. కోహ్లి(724పాయింట్లు) 7వ స్థానంలో నిలువగా.. టీమిండియా వికెట్ కీపర్ రిషబ్ పంత్(718) 9వ స్థానంలో ఉన్నాడు. ఐసిసి బుధవారం విడుదల చేసిన టెస్ట్ ర్యాంకింగ్స్‌లో ఇంగ్లండ్ ఆటగాళ్ల హవా కొనసాగింది. ఆ జట్టు స్టార్ ఆటగాళ్లు జో రూట్, హ్యారీ బ్రూక్ తాజా ర్యాంకింగ్స్‌లో టాప్–3లో నిలిచారు. పాకిస్తాన్‌తో ముగిసిన తొలి టెస్ట్‌లో హ్యారీ బ్రూక్ ట్రిపుల్ సెంచరీ, జో రూట్ డబుల్ సెంచరీ చేసిన విషయం తెలిసిందే. ఈ ప్రదర్శనలతో రూట్ కెరీర్ అత్యుత్తమ రేటింగ్ పాయింట్లు (932) సాధించి టాప్ ర్యాంక్‌ను సుస్థిరం చేసుకున్నాడు. బ్రూక్ ఏకంగా 11 స్థానాలు ఎగబాకి కేన్ విలియమ్సన్‌తో సహా రెండో స్థానాన్ని ఆక్రమించాడు. రూట్, బ్రూక్ దెబ్బకు భారత ఆటగాళ్లు యశస్వి జైస్వాల్, విరాట్ కోహ్లి చెరో స్థానం కోల్పోయి నాలుగు, ఏడు స్థానాల్లో ఉన్నారు. ఇంగ్లండ్‌తో టెస్ట్ మ్యాచ్‌లో సెంచరీలు చేసిన పాక్ ఆటగాళ్లు అఘా సల్మాన్, షాన్ మసూద్ 11, 12 స్థానాలు మెరుగుపర్చుకుని 22, 51వ స్థానాలకు ఎగబాకారు. టెస్ట్ బౌలర్ల ర్యాంకింగ్స్ విషయానికొస్తే.. ఈ విభాగం టాప్–10లో చెప్పుకోదగ్గ మార్పులేమీ జరగలేదు.

బుమ్రా, అశ్విన్ టాప్–2లో కొనసాగుతుండగా.. రవీంద్ర జడేజా ఆరు, కుల్దీప్ 16 స్థానాల్లో ఉన్నారు. పాక్‌తో టెస్ట్ మ్యాచ్‌లో మెరుగైన ప్రదర్శన కనబర్చిన జాక్ లీచ్ తొమ్మిది స్థానాలు మెరుగుపర్చుకుని 28వ స్థానానికి ఎగబాకాడు. టెస్ట్ ఆల్‌రౌండర్ల విభాగంలో జడేజా, అశ్విన్ టాప్–2లో కొనసాగుతుండగా.. జో రూట్ ఓ స్థానం మెరుగుపర్చుకుని మూడో స్థానానికి చేరాడు.

Published and Printed by Mallajosyula Venkata Subrahmanya Sarma on behalf of Prajasakti Printers & Publishers Private Limited from D.No.27-30-4,Akulavari Street,Governorpet, Vijayawada, Krishna Dt., and Printed at Prajasakti Printers & Publishers Private Limited, D.No.14-12-19, Krishna Nagar, Tadepalli (M), Guntur Dt., Editor : Bendi Tulasi Das, Ph : 9490099275, email:editorprajasakthi@gmail.com, RNI Regd.No. 15795/68